Pubilshed from Vijayawada

PRGI NO : APTEL/2011/41440

# ప్రజాభూమి

ఇది ప్రజల వెలుగు

Prajabhoomi Telugu Daily

www.prajabhoomi.com



మనిషి మనుగడలో అతిముఖ్యమైనది
శాంతి సుఖం సంతోషం ఆర్థికాభివృద్ధిఎదుగుదల,
ఇలాంటివి సాధించుకోవటానికి ఎదురయ్యే సమస్యలకు
గృహవాస్తు. జాతకదోషాలు,
అనేక రకాల సందేహాల నివృత్తి కోసం
చక్కటి పరిష్కారం కోసం సంప్రదించగలరు.

వాస్తు - జ్యోతిష పండితులు
మహామంత్రోపాసకులు
శ్రీ లలితాంబికా పీఠం వ్యవస్థాపకులు
బ్రహ్మశ్రీ మాడుగుల శివప్రసాద్ గురూజీ
79970 39039

విజయవాడ VIJAYAWADA | సంపుటి : 15 Vol.No : 15 | సంచిక : 104 Issue No : 104 | శనివారం Saturday | జూలై 25, 2026 25 JULY 2026 | ఎడిటర్ : రామమోహన్ రెడ్డి అంకిరెడ్డిపల్లి Editor : Ankireddypalle Ramamohan Reddy | పేజీలు : 12 Pages 12 | వెల : 3 రూ Rs 3/-

Published From : Vijayawada, Anathapuramu, Eluru, Kadapa, Kakiknada, Tirupathi Circulated at Andharapradesh & Telangana



## వాహనంపై దొర్లిపడిన బండరాళ్లు..

### నవజాత శిశువు సహా13మంది మృతి

సిమ్లా : వేగంగా వెళుతున్న ఎస్‌యువి వాహనంపై పెద్ద బండరాళ్లు దొర్లిపడటంతో 13మంది మరణించారు. హిమాచల్‌ప్రదేశ్‌లోని లాహౌల్ - స్పితి జిల్లాలో ఉదయ్‌పూర్-పాంగి రహదారిపై శుక్రవారం మధ్యాహ్నం ఈ ప్రమాదం జరిగింది. మృతుల్లో ఆరునెలల నవజాత శిశువు కూడా ఉంది. వివరాల ప్రకారం.. 15మంది ప్రయాణికులతో కుల్లు నుండి కిల్లార్‌కి వెళుతున్న ఎస్‌యువిపై బండరాయి దొర్లిపడటంతో వాహనం పూర్తిగా నుజ్జునుజ్జు అయ్యింది. బండరాయి ఢీకొన్న ధాటికి వాహనం వెనుక భాగంలో మంటలు చెలరేగాయి.

వివరాలు 2లో..


# చదువే పిల్లలకు శాశ్వత ఆస్తి



## తల్లిదండ్రులు-టీచర్లు కలిస్తేనే విద్యార్థుల విజయం

- మెగా పీటీఎంతో విద్యా వ్యవస్థలో కొత్త అధ్యాయం
- ప్రభుత్వ బడులపై పెరుగుతున్న నమ్మకం
- సంక్షేమం విషయంలో రాజీ ప్రసక్తే లేదు
- గిరిజనులకు అండగా ఉంటాం..ఆందోళన వద్దు
- రంపచోడవరంలో మెగా పేరెంట్-టీచర్ మీటింగ్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు

ప్రజాభూమి ప్రతినిధి,రంపచోడవరం: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. పోలవరం జిల్లా రంపచోడవరంలో శుక్రవారం నిర్వహించిన మెగా పేరెంట్-టీచర్ మీటింగ్‌లో పాల్గొన్న ఆయన.. ప్రభుత్వ విద్యా వ్యవస్థలో ఇప్పటికే గణనీయమైన మార్పులు ప్రారంభమయ్యాయని చెప్పారు. ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాలల నుంచి ప్రైవేట్ స్కూళ్లకు వెళ్లే పరిస్థితి ఉండేదని, ఇప్పుడు ప్రైవేట్ పాఠశాలల నుంచి లక్షా పది వేల మంది విద్యార్థులు ప్రభుత్వ బడుల్లో చేరడం ప్రభుత్వ విద్యపై పెరిగిన విశ్వాసానికి నిదర్శనమన్నారు.





విద్యార్థుల మార్కులు తగ్గితే అది విద్యాశాఖ పనితీరుపైనే ప్రతిబింబిస్తుందని, అందుకే మంత్రి నారా లోకేష్ విద్యాశాఖ బాధ్యతలను అత్యంత నిబద్ధతతో నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. గిరిజన ప్రాంతాల్లోని పిల్లలు మట్టిలో మాణిక్యాలని, సరైన అవకాశాలు కల్పిస్తే అద్భుతాలు సృష్టిస్తారని అన్నారు. విద్యే పిల్లలకు తల్లిదండ్రులు ఇవ్వగలిగే గొప్ప ఆస్తి అని, ప్రపంచ వ్యాప్తంగా తెలుగు ప్రజలు రాణించడానికి విద్యే కారణమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. పిల్లల అభివృద్ధి బాధ్యతను తల్లి, తండ్రి ఇద్దరూ సమానంగా తీసుకోవాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. పేరెంట్-టీచర్ మీటింగ్‌లకు తల్లులతో పాటు తండ్రులు కూడా తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు. విద్యార్థుల భవిష్యత్తును నిర్మించేది ఉపాధ్యాయులు, తల్లిదండ్రులేనని, అందుకే రాష్ట్రవ్యాప్తంగా మెగా పీటీఎంలను నిర్వహిస్తున్నామని సీఎం చంద్రబాబు చెప్పారు. ఉపాధ్యాయులు మారుతున్న సాంకేతిక పరిస్థితులకు

- మిగతా 2లో..



విద్యార్థులను

## బెదిరించే హక్కు మీకెవరిచ్చారు?

### యూనివర్సిటీలపై రాహుల్ ఫైర్

- జంతర్‌మంతర్‌కు వెళ్లొద్దన్న ఢిల్లీ యూనివర్సిటీ
- జేఎన్‌యూ కూడా ఇదే సూచన
- సోషల్ మీడియాలోనూ జాగ్రత్తలు
- విద్యార్థులు ఆందోళనల్లో పాల్గొనొద్దని ఐఐటీ రూర్కీ ఆదేశం
- డీయూ అడ్వైజరీపై రాహుల్ ఆగ్రహం
- విద్యార్థులను బెదిరించొద్దన్న రాహుల్

న్యూఢిల్లీ : జంతర్‌మంతర్‌లో జరుగుతున్న నిరసనలకు దూరంగా ఉండాలని ఢిల్లీ యూనివర్సిటీ (డీయూ) విద్యార్థులకు జారీ చేసిన సూచనపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్రంగా స్పందించారు. ప్రజాస్వామ్య హక్కులను వినియోగించుకుంటున్న విద్యార్థులను బెదిరించే హక్కు యూనివర్సిటీకి ఎవరిచ్చారని ప్రశ్నించారు. "సమయం వచ్చినప్పుడు మీరే జవాబు చెప్పాల్సి ఉంటుంది" అన్నారు. నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా కోరుతూ

- మిగతా 2లో..



## లోక్‌సభ సోమవారానికి వాయిదా

న్యూఢిల్లీ : నీట్ పేపర్ లీక్ వ్యవహారం పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో ఐదో రోజూ తీవ్ర ప్రతిష్ఠంభనకు దారితీసింది. కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని ప్రతిపక్షాలు పట్టుబట్టాయి దీంతో లోక్‌సభ సోమవారానికి, రాజ్యసభ మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా పడ్డాయి.

2 లో



## ప్రధాని పార్లమెంటులో ప్రకటన చేయాలి.. అర్ధరాత్రి కాదు

- రాజ్యసభ ప్రతిపక్ష నేత మల్లికార్జున్ ఖర్గే

న్యూఢిల్లీ : ప్రధాని మోడీ పార్లమెంటులో ప్రకటన చేయాలని, అర్ధరాత్రులు కాదని రాజ్యసభ ప్రతిపక్ష నేత మల్లికార్జున్ ఖర్గే విమర్శించారు.

2 లో

# చమురు సెగ..



### రూ.4 లక్షల కోట్లకు గండి

బిజినెస్ : దేశీయ ఈక్విటీ మార్కెట్లు శుక్రవారం భారీ అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు రికార్డు స్థాయిలో పెరగడం, పశ్చిమాసియాలో భౌగోళిక ఉద్రిక్తతలు మరింత ముదరడం, ప్రపంచ వాణిజ్యంపై ఆందోళనలు పెరగడం వంటి కారణాలతో మదుపర్లు భారీగా షేర్ల విక్రయాలకు దిగారు. దీంతో సెన్సెక్స్, నిఫ్టీ సూచీలు గణనీయంగా క్షీణించగా, మార్కెట్ ప్రారంభమైన కొద్ది నిమిషాల్లోనే ఇన్వెస్టర్ల సంపదలో దాదాపు రూ.4 లక్షల కోట్ల మేర కోత పడింది.

ఉదయం 9.40 గంటల సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 715 పాయింట్లు నష్టపోయి 75,675 వద్ద ట్రేడవుతుండగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ 198 పాయింట్లు తగ్గి 23,671 స్థాయికి చేరుకుంది. ఇదే సమయంలో డాలర్‌తో పోలిస్తే రూపాయి 15 పైసలు బలపడి 96.58 వద్ద కొనసాగింది.

ఎలాంటి షేర్లు లాభాల్లో.. ఏవి నష్టాల్లో అంటే : నిఫ్టీ సూచీలో సిప్లా, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఓఎన్‌జీసీ, అదానీ ఎంటర్‌ప్రైజెస్, కోల్ ఇండియా షేర్లు స్వల్ప లాభాలు నమోదు చేశాయి. మరోవైపు ఇన్ఫోసిస్, ఎటర్నల్, భారతీ ఎయిర్‌టెల్, డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్, హిందాల్కో, ఇండిగో షేర్లు అమ్మకాల ఒత్తిడితో నష్టాల్లో ట్రేడయ్యాయి.

మార్కెట్ల పతనానికి ప్రధాన కారణాలు..ముడి చమురు ధరల జోరు : అంతర్జాతీయ మార్కెట్లో వరుసగా ఆరో ట్రేడింగ్ సెషన్‌లోనూ ముడి చమురు ధరలు పెరుగుదల కొనసాగించాయి. బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 100 డాలర్లను దాటగా, గత నెలరోజుల్లోనే దాదాపు 40 శాతం పెరిగింది. ఈ పరిణామం ద్రవ్యోల్బణం, దిగుమతి వ్యయాలపై ప్రభావం చూపుతుందనే ఆందోళన మార్కెట్లను కలవరపెడుతోంది.

2 పేజీలో..

## జనావాసాల్లోనే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం

- ఓఆర్ఆర్ లోపల ప్రభుత్వ భూముల గుర్తింపు
- పోలీసు, రెవెన్యూ, రవాణా శాఖల భూముల సేకరణ
- క్యూర్ పరిధిలో ఇళ్ల నిర్మాణంపై సీఎం రేవంత్ సమీక్ష



ప్రజాభూమి ప్రతినిధి, హైదరాబాద్ : నగరంలోని కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ క్యూర్ పరిధిలో నిర్మించే ఇందిరమ్మ ఇళ్లు జనావాసాల పరిధిలోనే ఉండేలా చూడాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. క్యూర్ పరిధిలో ఇళ్లపై ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఓఆర్ఆర్ లోపల నిరుపయోగంగా ఉన్న వివిధ స్థలాలను గుర్తించాలని సూచించారు. ఇప్పటికే పలు నియోజకవర్గాల్లో స్థలాలను గుర్తించినట్లు అధికారులు సీఎం దృష్టికి తీసుకెళ్లారు.

- మిగతా 2లో..

## పవన్ కోసం కలసికట్టుగా పనిచేద్దాం




- నాదెండ్ల మనోహర్ పిలుపు!
- స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలని జనసైనికులకు నాదెండ్ల పిలుపు
- గ్రూపు రాజకీయాలు పక్కన పెట్టాలని హితవు
- అన్ని పదవులు ఒకేసారి ఆశించవద్దన్న మనోహర్

ప్రజాభూమి ప్రతినిధి, అమరావతి : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించడమే లక్ష్యంగా జనసేన శ్రేణులు ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడాలని, నాయకులు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆ పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్, మంత్రి నాదెండ్ల మనోహర్ పిలుపునిచ్చారు. పార్టీలో అంతర్గత విబేధాలకు, గ్రూపు రాజకీయాలకు ఏమాత్రం తావులేకుండా అందరూ కలసికట్టుగా పనిచేయాలని స్పష్టం చేశారు. "మనమంతా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నాయకత్వం కోసమే పనిచేస్తున్నాం.. వ్యక్తిగత వర్గాలు వద్దే వద్దు" అని శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.

2 పేజీలో..

## బడ్జెట్‌లో విద్యావ్యవస్థ కోసం రూ.30 వేల కోట్లు ఖర్చు

### కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్



ప్రజాభూమి ప్రతినిధి, గుంటూరు : రాష్ట్ర బడ్జెట్‌లో రూ.30 వేల కోట్లను విద్యావ్య వస్థ కోసం ఖర్చు చేస్తున్నట్లు కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు.

- మిగతా 2లో..

## యువత భవిష్యత్తే మోదీకి పరమావధి

### బీజేపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్

- విద్యా రంగంలో మోదీ ప్రభుత్వం విప్లవాత్మక మార్పులను తీసుకొచ్చిందన్న మాధవ్
- గతంలో పోలిస్తే పేపర్ లీకేజీలు బాగా తగ్గాయని వెల్లడి
- నీట్ సాకుతో సుప్రీంకోర్టుపై కూడా అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపాటు

ప్రజాభూమి ప్రతినిధి, అమరావతి : ప్రధాని మోదీ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం యువత భవిష్యత్తును పరమావధిగా చేసుకుని పనిచేస్తోందని బీజేపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ స్పష్టం చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా విద్యా రంగంలో మోదీ ప్రభుత్వం విప్లవాత్మక సంస్కరణలు తీసుకువచ్చిందని, దేశవ్యాప్తంగా ఐఐటీలు, ఐఐఎంలు, గిరిజన విశ్వవిద్యాలయాలను నెలకొల్పడంతో పాటు మెడికల్ సీట్లను భారీగా పెంచిందని వివరించారు. గత ప్రభుత్వాల హయాంతో పోలిస్తే తమ పాలనలోనే విద్యా పేపర్ లీకేజీలు గణనీయంగా తగ్గాయని, నీట్ వ్యవహారంలో సమస్య వెలుగుచూడగానే కేంద్రం తక్షణమే కఠిన చర్యలు తీసుకుందని తెలిపారు.

2 పేజీలో..



# సంపాదకీయం

## బొద్దింకలను తేలికగా తీసుకోరాదు !

దేశంలో ఏ ఆందోళన జరిగినా దాని వెనక రాజకీయాలు ఉన్నాయని ఆరోపించడం పాలకులకు అలవాటుగా మారింది. అంతే తప్ప ఆ ఆందోళనల వెనక ఉన్న సత్యాలను గుర్తించడం లేదు. ఆక్రందనలను వినడం లేదు. ఆందోళనల వెనక ఉన్న సమస్యలను గుర్తించడం లేదు. దేశంలో కాంగ్రెస్, బిజెపిలు ఎవరు పాలకులుగా ఉన్నా జరుగుతున్నది ఇదే. రాష్ట్రాల్లో కూడా ఇదే తరహా పాలనను కొనసాగిస్తున్నారు. దేశంలో ఇప్పుడు కాక్రోచ్ జనతాపార్టీ చేస్తున్న ఆందోళనను ముందే గ్రహించి, చర్యలు తీసుకోవడంలో మోడీ ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యింది. నీట్ పేపర్ లీక్ అయిన వెంటనే పలు రకాలుగా నిరసనలు వ్యక్తం అయ్యాయి. కానీ కేంద్రం చూసీచూడనట్లు ఉంటూ వచ్చింది. తమకు తోచిన విధంగా చర్యలు తీసుకుంది. మళ్లీ పరీక్ష నిర్వహణకు షెడ్యూల్ ప్రకటించింది. అయితే ఇప్పుడు బొద్దింకల ఆందోళన వెనక కేవలం ఒక్క నీట్ పరీక్ష మాత్రమే లేదన్న సత్యాన్ని ఇప్పటికీ పాలకులు గుర్తించడం లేదు. బొద్దింకలు ఎవరన్నదాని పై ఆరా తీసి, వారి వెనక పాకిస్థాన్, అమెరికా, కాంగ్రెస్, ఆప్ ఉందన్న ఆరోపణలను ముందుకేసి, సమస్యలను పక్కన పెడుతున్నారు. కానీ బొద్దింకల వెనక ఆక్రోశం ఉంది. ఆందోళన ఉంది. ఆవేదనా ఉంది. దీనిని అర్థం చేసుకోవడంలో, పరిష్కరించడంలో పాలకులు ఏళ్లుగా విఫలం అవుతున్నారు. ఎల్‌నినో వస్తే నీటి కరువు లేకుండా చేసుకునే ఆలోచనలు కూడా పాలకులల వద్దలేదు. జలవనరులను శాశ్వతంగా ఉపయోగించుకునే ప్రణాళికలు లేవంటే వీరిని ఏమనాలి. అందుకే ఇవన్నీ కలగలిపిన నిరసనలే ఢిల్లీలో బొద్దింకల ఆందోళనలకు ప్రతిరూపంగా చూడాలి. దేశంలో నిరాశా,నిస్పృహలో ఉన్న యువత వేదిక కోసం చూస్తోంది. బొదింకల గుంపు వెనకాల ఉండి తమ ఆందోళనల ఆజ్యాన్ని పోశారు. అంతే తప్ప వీటి వెనక ఎవరున్నారన్నది వారికి అవసరం లేదు. బిజెపి 12 ఏళ్ల పాలనలో పేరుకుపోతున్న అనేకానేక సమస్యలపై యువతలో దాగివున్న ఆగ్రహం పెల్లుబికింది. అంతకుముందు యూపిఏ పదేళ్ల పాలనలోనూ ఇలాంటి కోపమే యువతలో ఆవహించింది. దానిని బిజెపి క్యాష్ చేసుకుని అధికారానికి వచ్చింది. అధికారంలో ఉన్న వారు సమస్యలను గుర్తెరిగి పరిష్కరించడం అలవాటు చేసుకోవడం లేదు. ఎసి గదుల్లో కూర్చుని పోలీసులు ఇచ్చిన నివేదికలను ముందేసుకుని చేస్తున్న చర్చ కారణంగా ప్రజల మనస్సులను తెలుసుకోలేక పోతున్నారు. దేశంలో ధరలు పెరుగుతున్నాయి. విద్య, వైద్యం ఖరీదైనదిగా మారింది. ఆస్పత్రులు మాఫియాగా మారాయి. ప్రజల రక్తాన్ని జలగల్లా పీలుస్తున్నాయి. స్కూళ్లు, కాలేజీలు లక్షల్లో ఫీజులు గుంజుతున్నాయి. నిరుద్యోగం ఏటికేడు పెరుగుతోంది. అలాగే రూపాయి విలువ పడిపోతోంది. ఇవన్నీ కూడా తక్షణం పరిష్కరించాల్సిన సమస్యలు. పాలకులు అన్నవారికి ఇవే ముఖ్యం కావాలి. కానీ సమస్యలను గుర్తించకుండా, వీటిపై ఎక్కడా మోడీ ప్రభుత్వం ఫోకస్ పెట్టిన దాఖలాలు లేవు. నాయకులు జీతాలు పెరిగాయి. అలా అనడం కన్నా పెంచేసుకున్నారు. ఎమ్మెల్యేలు, ఎంపిల జీతాలు, భత్యాలను ఇబ్బడిముబ్బడిగా పెంచుకున్నారు. కార్లు, విమాన ప్రయాణాలు అన్నీ ప్రజల డబ్బుతోనే ఎంజాయ్ చేస్తున్నారు. అధికారంలోకి రాగానే కోట్లు వెచ్చించి బంగళాలు కట్టుకుంటున్నారు. ప్రాజెకట్‌ఉల పేరుతో ప్రజాధనం వృధా చేస్తున్నారు. కమిషన్లకు కక్కుర్తి పడుతున్నారు. కానీ వీటివలల్ల ప్రజలకు మిగిలింది సున్నా. తెలివి ఉండి కాస్తా చదువుకున్న వారంతా విదేశాలకు వెళ్లిపోతున్నారు. ఇక్కడే ఉన్నవారు తిండికి లేక, ఉద్యోగం రాక, కూలీ దొరక్క అల్లాడిపోతున్నారు. చదువుకున్న వారి పరిస్తితి మరీ దయనీయంగా ఉంది. బిజెపి అధికారంలోకి వచ్చిన తరవాత పెద్ద ఎత్తున పరిశ్రలమ స్థాపన లాంటివి జరగడం లేదు. ఉన్న పరిశ్రమలను మూసేస్తున్నారు.

ఇలాంటివన్నీ కూడా నిరుద్యోగ, చదువుకున్న యువతలో అసహనం పెంచుతోంది. సర్ ప్రక్రియ లాంటిదే తీసుకుంటే చాలా క్లిష్టంగా ఉంది. చదువుకున్న వారే ఈ ప్రక్రియలో పాల్గొనడం కష్టంగా ఉంది. దేశంలో మోసాలు, దగాలు, రకరకాల ఆన్‌లైన్ మోసాలు పెరిగాయి. చట్టాలు ఉన్నా, ఉన్నవాడికే చుట్టంగా మారాయి. ప్రధాని మోడీ ప్రజలతో మమేకం అయి వుంటే ఇవన్నీ తెలిసేవి. కానీ మోడీ పార్లమెంటుకు రావడం తక్కువే. అక్కడ చర్చలో పాల్గొనడం కూడా తక్కువే. గతంలోలాగా ఇప్పుడు పార్లమెంటులో చర్చలకు అవకాశం లేకుండా పోయింది. ప్రపంచవ్యాప్తంగా నియంతృత్వ ధోరణులను వ్యతిరేకించే వారంతా రోడ్డెక్కుతున్నారు. ఆక్రమిత కాశ్మీర్ కావచ్చు, అర్జెంటీనా కావచ్చు... ప్రజలు వీధుల్లోకి వచ్చి నిరసనలకు దిగుతున్నారు. సమస్య చిన్నదే అని మనం అనుకుంటే సరిపోదని గుర్తించాలి. ఎందుకంటే అంతరాంతరాల్లో దాగివున్న ఆందోళనలకు, ఆగ్రహానికి ప్రతిరూపమే కాక్రోచ్ ఉద్యమం. గనులు, భూములు, ఫ్యాక్టరీల మీద ఆధిపత్యం ఉన్నవాళ్లంతా అధికారంలో ఉంటున్నారు. ఆ సంపదపై ఆధిపత్యాన్ని కొనసాగించటానికి అధికారం అడ్డం పెట్టుకుంటున్నారు. ఇలాంటి సమయాల్లో సోషల్ మీడియా ప్రజాగ్రహాన్ని కొంతమేరకు కదిలించేలా చేయగలుగుతోంది. కోట్లాది గొంతుకలను ఏకం చేస్తోంది. గతంలో ఎప్పుడూ ఇంతటి వైవిధ్య, విశాల వేదిక ప్రజలకు అందుబాటులో లేదు. ప్రభుత్వ విధానాలను ప్రశ్నించలేని పరిస్థితిని సృష్టించిన తర్వాత సోషల్ మీడియానే జననాడిగా మారుతోంది. అసమ్మతులకూ, అసంతృప్తులకూ వేదికగా మారక తప్పటంలేదు. టీవీలూ, పత్రికలూ అధికార పార్టీలకు బాకాలుగా మారిన ప్రస్తుత ప్రపంచంలో సోషల్ మీడియా ప్రజలను ఏకతాటిపైకి తెస్తోంది. అన్ని దేశాల్లోనూ యువత సోషల్ మీడియానే ఆసరాగా చేసుకుని ప్రభుత్వాలను ప్రశ్నించటం మొదలు పెట్టారు. పాలకులు చేస్తున్న తప్పులపై ఎప్పటికప్పుడు విమర్శలు చేస్తున్నారు. జవాబుదారీతనం కోసం డిమాండు చేస్తున్నారు. అలా చేయడంలో భాగంగానే నీట్‌లో జరిగిన అవకతవకలకు బాధ్యతగా కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ దిగిపోవాలని కోరటం ద్వారా కాక్రోచ్ పార్టీ కార్యక్షేత్రంలోకి దిగింది.పనీపాటాలేని కొందరు యువత సోషల్‌మీడియా ద్వారా అనవసరంగా యాగీ చేస్తున్నారనీ, సమాజ జీవనానికి వారు బొద్దింకలుగా మారారని సాక్షాత్తూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి వ్యాఖ్యలు చేసినట్లుగా వచ్చిన వార్తలు దావానలంగా మారి ఒక ఉద్యమరూపాన్ని సంతరించుకోవటం యాదృచ్ఛికం కాదు. ఇది ఒక ప్రేరణ మాత్రమే. ప్రతిపక్షాలు కూడా విశ్వసనీయత కోల్పోవడంతో యువత ఇక తామే కార్యక్షేత్రంలోకి దిగడం అన్నది కాక్రోచ్ పార్టీని చూస్తే అర్థం అవుతోంది. నైతిక బాధ్యతే లేకపోతే ప్రజాస్వామ్యానికి విలువే లేదు. ప్రజాస్వామ్యం,జవాబుదారీతనం కోసమే యువత వీధులకు ఎక్కింది. 2011 నాటి అన్నాహజారే అవినీతి వ్యతిరేక ఉద్యమం, శ్రీలంకలో ఆర్థిక సంక్షోభానికి వ్యతిరేకంగా సాగిన నిరసనలు, బంగ్లాదేశ్ విద్యార్థుల ఆందోళనలు, నేపాల్‌లో తిరుగు బాటు, కెన్యాలో జెన్‌జీ ఉద్యమం లాంటివన్నీ సోషల్ మీడియానే అధికంగా ఉపయోగించుకున్నాయి. పాలకుల అపసవ్య విధానాలపై ప్రశ్నలు తలెత్తగానే స్పందించి ఉంటే సమస్యలు రావు. బొద్దింకలు ఎన్ని మందుల కొట్టినా, పుట్టుకుని వస్తూనే ఉంటాయి. పరిష్కారం చూపనంతవరకు సమస్యలు పుడుతంటాయి. యువత పాలకులను ప్రశ్నిస్తూనే ఉంటుంది. పాలకుల ఆలోచనా విధానం మారాలి. దేశం కోసం అసవర మైన పనులనే చేయాలి. అప్పడే దేశం బాగుపడుతుంది. మాటలతో ఎంతోకాలం మభ్య పెట్టలేమని గుర్తిస్తే, బొద్దింకల బాధా ఉండదు.

## విద్యార్థులను బెదిరించే హక్కు మీకెవరిచ్చారు?

జంతర్‌మంతర్‌లో జరుగుతున్న నిరసనలకు దూరంగా ఉండాలని డీయూ గురువారం సోషల్ మీడియాలో అడ్వైజరీ విడుదల చేసింది. జంతర్‌మంతర్‌లో జరిగే చట్టవిరుద్ధ సమావేశాల్లో పాల్గొంటే చట్టపరమైన చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించింది. విద్యార్థుల భద్రతతో పాటు వారి విద్యా, ఉద్యోగ అవకాశాలపై కూడా ప్రభావం పడొచ్చని పేర్కొంది. సోషల్ మీడియాలో వస్తున్న తప్పుడు ప్రచారాన్ని కూడా నమ్మొద్దని సూచించింది. ఇదే తరహా సూచనను జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జేఎన్‌యూ) కూడా విడుదల చేసింది. జంతర్‌మంతర్ వద్ద జరుగుతున్న ఆందోళనలకు వెళ్లొద్దని, సోషల్ మీడియాలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని విద్యార్థులకు సూచించింది. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలతో పాటు యూనివర్సిటీ క్రమశిక్షణా చర్యలు కూడా ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించింది. యూనివర్సిటీల చర్యలను పలువురు తీవ్రంగా విమర్శించారు. విద్యార్థుల గొంతు నొక్కడం కంటే వారి అభిప్రాయాలను గౌరవించాలని నటి పూజా భట్ పేర్కొన్నారు. డీయూ మాజీ విద్యార్థి, కాంగ్రెస్ ఎంపీ దీపేందర్ హూడా కూడా అడ్వైజరీపై అభ్యంతరం వ్యక్తం చేశారు. కాగా, ఇటీవల ఐఐటీ రూర్కీ కూడా రాజకీయ ఆందోళనల్లో పాల్గొనవద్దని విద్యార్థులకు సూచించగా, ఇది ప్రతి ఏడాది జారీ చేసే సాధారణ మార్గదర్శకమేనని స్పష్టీకరించింది.

## బడ్జెట్‌లో విద్యావ్యవస్థ కోసం రూ.30 వేల కోట్లు ఖర్చు



శుక్రవారం ఆయన గుంటూరులో ఏర్పాటుచేసిన ఓ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 'రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల కోసం లీప్ యాప్‌ను రూపొందించింది. ప్రభుత్వ పాఠశాలలో చదువుకొని అత్యధిక మార్కులు సాధించిన వారి ఫొటోలతో పేపర్‌లో యాడ్స్ వేశాం. వ్యవస్థలో ఉన్న లోపాలను సరిదిద్దాలి. నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంలో జైల్లో ఉన్న 11 మంది నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. . కోర్టులో కేసులు పెండింగ్‌లో ఉండటం వల్ల తప్పు చేసేవారికి భయం ఉండటం లేదు. ఒక వ్యక్తి రాజీనామా చేయడం వల్ల వ్యవస్థలో మార్పులు రావు. ఎక్కడో ఒక చోట తప్పు జరిగినప్పుడు రాజీనామా చేయాలంటే పనిచేయడానికి మంత్రులు ఉండరు. అలాంటి ఘటనలపై తీసుకోవాల్సిన సంస్కరణలను తెలిపితే, చర్చించి అమలు చేసేందుకు చర్యలు చేపడతాం'అని పెమ్మసాని అన్నారు.

## చదువే పిల్లలకు శాశ్వత ఆస్తి

అనుగుణంగా బోధనా విధానాలను మార్చుకోవాలని, కొత్త పద్ధతులను అవలంభించాలని సూచించారు. టీచర్లకు ప్రభుత్వం సముచిత గౌరవం ఇస్తోందని, బదిలీలను పారదర్శక కౌన్సెలింగ్ ద్వారా నిర్వహిస్తున్నామని తెలిపారు.

**విద్యతో పాటు ఆరోగ్యం, ఉపాధిపైనా ప్రత్యేక దృష్టి :** రాష్ట్రం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామని సీఎం తెలిపారు. తల్లికి వందనం పథకం నిధులు ఇప్పటికే తల్లుల ఖాతాల్లో జమ అయ్యాయని చెబుతూ జమ అయ్యాయా లేదా అంటూ సభలోనే ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి నెలా ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, దీపం-2.0 ద్వారా ఉచిత గ్యాస్ సిలిండర్లు, సోలార్ విద్యుత్ వంటి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని చెప్పారు. అలాగే ప్రజారోగ్యంపై దృష్టి సారించామని... ఆగస్టు నుంచి సంజీవని హెల్త్ ప్రాజెక్టును ప్రారంభిస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. గత ప్రభుత్వం రూ.10 లక్షల కోట్ల మేర అప్పులు చేసిందని తెలిపారు. పైగా 14 శాతం మేర వడ్డీలకు కొన్ని అప్పులను తెచ్చిందని ముఖ్యమంత్రి ప్రజలకు వివరించారు. ఆ అప్పులను నెమ్మదిగా తీర్చేందుకు ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తున్నామని.. అలాగే వడ్డీలు తగ్గించేలా కసరత్తు చేస్తూ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. ఒకవైపు ఆర్థిక పరిస్థితిని చక్కబెడుతూనే మరోవైపు సంక్షేమం, అభివృద్ధిని సమతూకంగా కొనసాగిస్తున్నామని ముఖ్యమంత్రి వివరించారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఐఐటీ కోచింగ్ అందిస్తున్నామని, గిరిజన ప్రాంతాల్లో రెసిడెన్షియల్ పాఠశాలలను విస్తరిస్తామని వెల్లడించారు. హాస్టళ్లు, గురుకులాల్లో డైట్ ఛార్జీలను 10 శాతం పెంచామని తెలిపారు. మెగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ నియామకాలు చేపట్టామని, గత ప్రభుత్వం ఐదేళ్లలో ఒక్క డీఎస్సీ కూడా నిర్వహించలేదని గుర్తుచేశారు. తన పాలనలో 16 ఏళ్లలో 14 సార్లు డీఎస్సీ నిర్వహించానన్నారు. ఈ ఏజెన్సీ ఏరియాలో ఇటీవల నిర్వహించిన మెగా డీఎస్సీలో రిక్రూటైన ఉపాధ్యాయులే ఉన్నారని దానికి ఇదే నిదర్శనమన్నారు. ప్రధాని మోదీ, తాను, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తామని చప్పామిని.. దానికి అనుగుణంగా పని చేస్తున్నామని ముఖ్యమంత్రి వెల్లడించారు. తాము కూటమిగా రాష్ట్రాభివృద్ధి కోసం కృషి చేస్తున్నామని... మెగా డీఎస్సీ నిర్వహించి టీచర్ పోస్టులు రిక్రూట్ చేస్తే... దానిపై బురద జల్లుతున్నారని సీఎం విమర్శించారు. రిక్రూటైన టీచర్ల మనోభావాలను దెబ్బతీసేలా కొందరు వ్యవహరిస్తున్నారని ఇలాంటి వారిని కట్టడి చేయాలని సూచించారు. రాజకీయ నేతలు, అధికారులు తేడాగా వ్యవహరిస్తే కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. రంపచోడవరం నియోజకవర్గంలో గతంలో కొందరు దుర్మార్గాలు చేశారని... దళిత డ్రైవరును చంపి డోర్ డెలివరి చేసిన నేతలు ఇక్కడ రాజకీయం చేశారని గుర్తు చేశారు. తల్లిని, చెల్లిని గౌరవించని వాళ్లు సమాజానికి ఏం చెబుతారు..? ఏం మేలు చేస్తారని.. ఇలాంటి వాళ్లు రాజకీయాల్లో ఉండకూడదని సీఎం అన్నారు. మంచిని ప్రోత్సహించాలి... చెడును తప్పు పట్టాలని అప్పుడే సమాజంలో మార్పు వస్తుందని చెప్పారు. ప్రభుత్వ కార్యక్రమాలు, పథకాల అమలుపై ఎప్పటికప్పుడు ప్రజాభిప్రాయాన్ని సేకరిస్తున్నామని... ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిస్తూ.. వారు పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకునేలా పని చేస్తున్నామని చెప్పారు. 94 శాతం స్ట్రైక్ రేటుతో గడచిన ఎన్నికల్లో గెలిపించారని... వచ్చే ఎన్నికల్లో అంతకు మించిన గెలుపును సాధిస్తామని ముఖ్యమంత్రి చెప్పారు.

**డ్రగ్స్‌కు చెక్..గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యం :** గంజాయి, డ్రగ్స్ వినియోగాన్ని అరికట్టేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటోందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. మాదకద్రవ్యాల వల్ల కుటుంబాలు నాశనం అవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఏజెన్సీ ప్రాంతాల్లో గంజాయి సాగును అరికట్టి ఉద్యాన పంటలను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. అరకు కాఫీకి అంతర్జాతీయ స్థాయిలో బ్రాండింగ్ కల్పించామని గుర్తు చేశారు. పిల్లలకు చక్కటి విద్యను అందిస్తామని... ఉద్యోగాలకు ఎక్కడికో వెళ్లాల్సిన అవసరం లేకుండా పెద్దపెద్ద పరిశ్రమలను తెస్తున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు. విశాఖకు గూగుల్ సంస్థ వచ్చిందని... భోగాపురం ఎయిర్ పోర్టుకు అల్లూరి సీతారామరాజు పేరు పెట్టామని ముఖ్యమంత్రి తెలిపారు. ఆగస్టు 1వ తేదీన ప్రధాని మోదీ భోగాపురం ఎయిర్ పోర్టును ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. విద్యార్థులు కష్టపడకుండా.. ఇష్టపడి చదవాలని... ఐదేళ్లు కష్టపడి చదివితే పెద్ద పెద్ద పరిశ్రమల్లో ఉద్యోగాలు కల్పించేలా అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. పోలవరాన్ని నెంబర్-1 జిల్లాగా తయారు చేస్తామని... 2000లో జీవో నెంబర్-3 తెచ్చి.. స్థానిక గిరిజనులకే ఉద్యోగాలిచ్చేలా అండగా నిలబడ్డామని గుర్తు చేశారు. కానీ 2020లో సుప్రీం కోర్టు ఆ జీవోను రద్దు చేసిందని... దీనిపై ఇప్పుడు చర్చిస్తున్నామని గిరిజనులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని సీఎం స్పష్టం చేశారు.

**విద్యార్థుల కలలకు సీఎం ప్రోత్సాహం :** సభలో పలువురు విద్యార్థులు తమ లక్ష్యాలు, ఆశయాలను వెల్లడించగా ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ వారిని అభినందించారు. తాను భవిష్యత్తులో ఐఏఎస్ అధికారిగా మారి ముఖ్యమంత్రికి రిపోర్ట్ చేస్తానని చెప్పిన విద్యార్థి సాత్విక్‌ను సీఎం ప్రత్యేకంగా అభినందిస్తూ, అతని సంకల్పం తప్పకుండా నెరవేరుతుందని ఆకాంక్షించారు. "డేర్ టు డ్రీమ్... స్ట్రైవ్ టు అచీవ్" అనేది తాను ఎప్పుడూ చెప్పే సందేశమని పేర్కొన్న సీఎం... పిల్లలను ప్రోత్సహించడం తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల బాధ్యత అని అన్నారు. విద్యార్థుల ఆలోచనలు, అభిప్రాయాలను ఎప్పటికప్పుడు తెలుసుకునేలా వారితో నిరంతరం సంభాషించాలని సూచించారు. పోలవరం ప్రాంతం నుంచి ప్రపంచానికి సేవలందించే స్థాయికి విద్యార్థులను తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమం సందర్భంగా పాఠశాల విద్యాశాఖ రూపొందించిన "డ్రగ్స్ వద్దు బ్రో" హ్యాండ్‌బుక్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆవిష్కరించారు. అనంతరం "బడి కోసం డోనర్" వెబ్ పోర్టల్‌ను ప్రారంభించారు. పోర్టల్ ప్రారంభమైన వెంటనే మీ సేవ ఆపరేటర్ చిట్టిబోయిన ఉదయ్ కుమార్ రంపచోడవరం హైస్కూల్‌కు రూ.1 లక్ష విరాళం ప్రకటించారు. నెల్లూరు జిల్లా జెడ్పీ హైస్కూల్‌కు పారిశ్రామికవేత్త పూర్ణ చంద్రరావు రూ.4 కోట్ల విరాళాన్ని ప్రకటించారు. వీరిద్దరిని సీఎం చంద్రబాబు అభినందించారు. అలాగే సభా వేదిక మీద నుంచి పోలవరం జిల్లాలో వివిధ శాఖల పనితీరును ముఖ్యమంత్రి వివరించారు. పనితీరు బాగా కనబరిచిన అధికారులను అభినందించిన ముఖ్యమంత్రి... సభికులతోనూ చప్పట్లు కొట్టించారు.

**పేరెంట్స్, టీచర్లతో ముఖాముఖి :** మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ సందర్భంగా రంపచోడవరం ప్రభుత్వ హైస్కూలు, జూనియర్ కళాశాలలో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో ముఖాముఖి నిర్వహించారు. తరగతి గదిలో విద్యార్థుల ప్రోగ్రెస్ రిపోర్టులు, మార్కులు, హాజరు, ఆరోగ్య వివరాలను స్వయంగా పరిశీలించి తల్లిదండ్రులకు వివరించారు. ఆశ్రమ పాఠశాలల విద్యార్థుల రిపోర్టు కార్డులను వారి ఇళ్లకే పంపేలా జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. మరో తరగతి గదిలో స్మార్ట్ బోర్డు ద్వారా బోధనా విధానాన్ని పరిశీలించిన సీఎం.. కొద్దిసేపు ఉపాధ్యాయుడిగా మారి విద్యార్థులకు పాఠాలు బోధించి వారిని ఉత్సాహపరిచారు. పాఠశాల ఆవరణలో విద్యార్థులు నాటిన మొక్కలను పరిశీలించిన సీఎం.. గ్రీన్ పాస్‌పోర్టు, క్యూఆర్ కోడ్ ఆధారంగా మొక్కల వివరాలు తెలుసుకునే విధానాన్ని అభినందిస్తూ రాష్ట్రంలో పచ్చదనాన్ని పెంచేందుకు ప్రతి విద్యార్థి భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. అనంతరం మెగా పీటీఎం ఫొటోఫ్రేమ్ వద్ద విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి ఫొటో దిగారు.

**విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసిన సీఎం :** మెగా పేరెంట్-టీచర్ మీటింగ్ అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. భోజనం నాణ్యత, రుచి ఎలా ఉందని విద్యార్థులను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు పోషకాహారం మరింత మెరుగ్గా అందించాలని సీఎం సూచించారు. విటమిన్ లోపాలు రాకుండా పోషకాహారం అందిస్తున్నామని, కంటి పరీక్షలు కూడా నిర్వహిస్తున్నామని మంత్రి లోకేష్ వివరించారు. ప్రస్తుతం మధ్యాహ్న భోజనంతో పాటు చిక్కి, ఉదయం రాగిమాల్ట్ అందిస్తున్నామని చెప్పగా, ఇంటికి వెళ్లే ముందు కూడా చిక్కిలు అందించేలా చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు. అనంతరం విద్యార్థుల కోరిక మేరకు వారితో కలిసి ప్రత్యేకంగా ఫొటోలు దిగుతూ ఆప్యాయంగా ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, విద్యా శాఖ ఉన్నతాధికారులు, జిల్లా అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## యువత భవిష్యత్తే మోదీకి పరమావధి

మొదటి పేజీ తరువాయి

నీట్ వివాదాన్ని సాకుగా చూపి కొందరు విపక్ష నేతలు ఢిల్లీ వేదికగా మత విద్వేషాలను రెచ్చగొట్టేందుకు కుట్రలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. నీట్ సాకుతో ప్రధానితో పాటు అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టుపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని, నటుడు ప్రకాశ్ రాజ్ సహా కొందరు విద్రోహకర, దేశ వ్యతిరేక వ్యాఖ్యలకు పాల్పడటం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొన్ని విద్యా సంఘాలు విద్యార్థుల ప్రయోజనాలను పక్కనబెట్టి వారి భవిష్యత్తును నాశనం చేసేలా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి దమ్ముంటే తమ సొంత పాలనలో జరిగిన పేపర్ లీకేజీలపై పార్లమెంట్‌లో మాట్లాడాలని, సభలో చర్చల్లో పాల్గొనే ధైర్యం లేకనే ఆయన దాటవేత ధోరణి ప్రదర్శిస్తున్నారని సవాల్ విసిరారు. విశాఖ సమీపంలోని భోగాపురం ఎయిర్‌పోర్ట్ ప్రారంభోత్సవానికి ప్రధాని నరేంద్ర మోదీ వస్తున్నారని, ఈ చారిత్రాత్మక ఘట్టంలో 13 వేల మంది కళాకారులతో కూడిన సంప్రదాయ థింసా నృత్యం, బొబ్బిలి వీణా నాదంతో ఆయనకు అద్భుత స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. అంతేకాకుండా ఈ కార్యక్రమం సందర్భంగా ఏకంగా 3 లక్షల మందితో భారీ బహిరంగ సభను నిర్వహించబోతున్నట్లు ప్రకటించారు. భోగాపురం విమానాశ్రయం అందుబాటులోకి వచ్చాక ఉత్తరాంధ్రలో వెనుకబడిన ప్రాంతమంటూ ఏదీ ఉండకూడదనేది సీఎం చంద్రబాబు ఆలోచన అని, ఆ ప్రాంత సమగ్ర ప్రాజెక్టుగా ఇది నిలుస్తుందని పేర్కొన్నారు. విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు పేరును చిరస్థాయిగా నిలిపేందుకే ఈ అంతర్జాతీయ విమానాశ్రయానికి ఆయన పేరు పెట్టారని మాధవ్ వివరించారు.

## వాహనంపై దొర్లిపడిన బండరాళ్లు..



స్థానికుల సాయంతో ఆర్మీ మంటలను అదుపులోకి తీసుకువచ్చింది. కానీ అప్పటికే వాహనం పూర్తిగా మంటల్లో దగ్ధమైంది. ఈ ప్రమాదంలో 13మంది మరణించారు. మరో ఇద్దరు వాహనం నుండి దూకేయడంతో ప్రాణాలతో బయటపడ్డారని లాహౌల్-స్పితి డిప్యూటీ కమిషనర్ తెలిపారు. ప్రాథమిక సమాచారం ప్రకారం, గురువారం ఉదయ్‌పూర్-కిల్లార్ రహదారి మూసివేయబడటంతో వారు టిండి వద్ద చిక్కుకుపోయారు. రహదారి తిరిగి తెరుచుకున్న తర్వాత శుక్రవారం పాంగికి బయలుదేరారు, కానీ వారి వాహనం ప్రమాదానికి గురవడంతో ప్రాణాలు కోల్పోయారు. మృతుల వివరాలు తెలియాల్సి వుంది.

## జనావాసాల్లోనే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం

పోలీసు, రెవెన్యూ, రవాణా శాఖలకు సంబంధించిన స్థలాలను తీసుకుని.. ఆయా శాఖలకు వేరే చోట కేటాయించాలని రేవంత్ ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్లను జనావాసాలకు దూరంగా కేటాయిస్తే ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు ఇబ్బందులు తలెత్తడంతో పాటు అవి నిరుపయోగంగా మారే అవకాశముందని సీఎం అభిప్రాయపడ్డారు. ప్రజల పని ప్రదేశాలకు దగ్గరగా.. జనావాసాల పరిధిలో ఇళ్లు నిర్మిస్తే నిరుపేదలు జీవనోపాధి కోల్పోకుండా ఉంటారన్నారు. క్యూర్ ఏరియాలోని పలు నియోజకవర్గాల్లో ఒక్కో ప్లాట్ దాదాపు 528 చదరపు అడుగుల విస్తీర్ణంతో, 400 చదరపు అడుగుల కార్పెట్ ఏరియాతో ఇళ్లు నిర్మించనున్నారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి దాదాపు రూ.11 లక్షలు ఖర్చవుతుండగా, దీనిలో ప్రభుత్వం రూ. 5 లక్షల మేర సబ్సిడీని అందించనుంది. మిగిలిన రూ.6 లక్షలు లబ్దిదారుడి వాటాగా చెల్లించాల్సి ఉంటుంది. భూమికయ్యే ఖర్చు మొత్తం ప్రభుత్వమే భరించనుంది. తొలి దశలో 17 నియోజకవర్గాల్లో 7,680 ప్లాట్లు నిర్మించి ఇచ్చేలా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ స్థలాలను వెంటనే గుర్తించి ఇళ్ల నిర్మాణానికి వినియోగించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఔటర్ రింగ్ రోడ్ లోపల ఉన్న ఖాళీ ప్రభుత్వ భూములపై ప్రత్యేక దృష్టి సారించాలని సీఎం ఆదేశించారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు దగ్గరగా ఉండే ప్రాంతాల్లోనే ఇందిరమ్మ ఇళ్లను నిర్మించాలని పేర్కొన్నారు. పోలీస్, రెవెన్యూ, రవాణా శాఖల పరిధిలో ఖాళీగా ఉన్న స్థలాలను గృహ నిర్మాణం కోసం వినియోగించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఖాళీ ప్రభుత్వ భూముల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. నిరుపేదలకు నగరానికి చేరువలోనే గృహాల కల్పనపై ప్రభుత్వం దృష్టి సారించిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. రాజేంద్రనగర్, మహేశ్వరం, శేరిలింగంపల్లి, ఇబ్రహీంపట్నం, మల్కాజిగిరి, నాంపల్లి, ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, కార్వాన్, బహదూర్‌పురా, అంబర్‌పేట్, కూకట్‌పల్లి, మేడ్చల్, కుత్బుల్లాపూర్, సనత్‌నగర్, సికింద్రాబాద్ కంటోన్మెంట్, మలక్‌పేట్ నియోజకవర్గాల్లో ఇందిరమ్మ ఇళ్లను నిర్మించనున్నారు. ఈ నియోజకవర్గాల పరిధిలో నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ స్థలాలను గుర్తించే ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. సమావేశంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## లోక్‌సభ సోమవారానికి వాయిదా

ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా అనంతరమే చర్చ చేపడతామని ప్రతిపక్ష?లు స్పష్టం చేశాయి. సభ కార్యకలాపాలు సజావుగా సాగకుండ అడ్డుకుంటున్నారంటూ చైర్మన్ జగదంబిక పాల్ ప్రతిపక్ష?లపై విరుచుకుపడ్డారు. నీట్‌పై చర్చ చేపట్టేందుకు ప్రభుత్వం అంగీకరించిందని, అయితే స్పీకర్, బిజినెస్ అడ్వైజరీ కమిటీ అనుమతి పొందిన తర్వాత, సభ అజెండాలో చేర్చిన అనంతరం చర్చ చేపడతామని అన్నారు. అయితే ముందుగా కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని ప్రతిపక్ష?లు నినాదాలు చేపట్టారు. దీంతో చైర్మన్ సభను సోమవారానికి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. నీట్ పేపర్ లీక్‌పై చర్చకు సంబంధించి ప్రతిపక్ష?లు ముందస్తు షరతులు విధిస్తూ చర్చ నుండి పారిపోయేందుకు యత్నిస్తున్నాయని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ఆరోపించారు. మరోవైపు రాజ్యసభ సైత్య మధ్యాహ్నం 2.00గంటలకు వాయిదా పడింది.

## ప్రధాని పార్లమెంటులో ప్రకటన చేయాలి.. అర్ధరాత్రి కాదు

విద్యార్థులకు వీడియో సందేశంపై ప్రధాని మోడీపై ఆయన తీవ్ర విమర్శలు గుప్పించారు. పార్లమెంటుకు వచ్చే ముందు ధర్మేంద్ర ప్రధాన్‌ను తొలగించాలని, విద్యార్థులకు క్షమాపణలు చెప్పాలని, విద్యార్థుల గొంతుకను అణచివేసేందుకు లాఠీలు, కర్రలు, పెల్లెట్ గన్‌లను ప్రయోగించాలని ఆదేశించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ధర్మేంద్ర ప్రధాన్‌ను తొలగించిన తర్వాతే విద్యావ్యవస్థపై చర్చించేందుకు ప్రతిపక్ష?ం సిద్ధంగా ఉంటుందని ఎక్స్‌లో పేర్కొన్నారు. ప్రధాని పార్లమెంటులో మాట్లాడాలని, అప్పుడే ప్రధాని అసలైన మాటలు అర్థమవుతాయని అన్నారు. అర్ధరాత్రి 12.00గంటలకు మాట్లాడటానికి బదులుగా పగటి పూట పార్లమెంటుకు వచ్చి మాట్లాడాలని అన్నారు. ఏదైనా హామీని అధికారికమైనదిగా, జవాబుదారీతనం కలిగినదిగా పరిగణించాలంటే, అది ప్రతిపక్ష?ం పరిశీలించడానికి వీలుగా శాసనపరమైన ప్రక్రియలో భాగంగానే ఇవ్వాలని ఖర్గే స్పష్టం చేశారు. సిజెపి నేతృత్వంలో నిరసనలు కొనసాగుతుండగా, గురువారం రాత్రి ప్రధాని మోడీ ఎక్స్ వేదికగా ఒక వీడియో సందేశాన్ని విడుదల చేసిన సంగతి తెలిసిందే. ప్రశ్నాపత్రాల లీకేజీ ఘటనపై మరింత కఠినమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## చమురు సెగ..

**పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు...**ఎర్ర సముద్రంలో నౌకలపై హూతీల దాడుల నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌ను హెచ్చరించడం, మరోవైపు వరుసగా 13వ రోజూ ఇరాన్ సైనిక స్థావరాలపై అమెరికా దాడులు కొనసాగడం ప్రపంచ మార్కెట్లలో అనిశ్చితిని పెంచింది. దీంతో పెట్టుబడిదారులు అప్రమత్తంగా వ్యవహరించారు.

**అమెరికా టారిఫ్ నిర్ణయాలు..** బలవంతపు శ్రమ (వెట్టి చాకిరీ) అంశాన్ని ప్రస్తావిస్తూ భారత్‌తో పాటు 60 దేశాలపై 10 నుంచి 12.5 శాతం వరకు సుంకాలు విధించాలని అమెరికా నిర్ణయించింది. ఈ చర్య ప్రపంచ వాణిజ్య వాతావరణంపై ప్రతికూల ప్రభావం చూపడంతో పాటు దేశీయ స్టాక్ మార్కెట్లపైనా ఒత్తిడిని పెంచింది. మొత్తంగా ముడి చమురు ధరల పెరుగుదల, పశ్చిమాసియాలో కొనసాగుతున్న భౌగోళిక ఉద్రిక్తతలు, అమెరికా తాజా టారిఫ్ నిర్ణయాలు కలిసి దేశీయ స్టాక్ మార్కెట్లను తీవ్రంగా ప్రభావితం చేశాయి. ఫలితంగా ఇన్వెస్టర్లలో ఆందోళన నెలకొని, భారీ స్థాయిలో అమ్మకాలు నమోదయ్యాయి.

## పవన్ కోసం కలసికట్టుగా పనిచేద్దాం

గత కార్పొరేషన్ ఎన్నికల్లో అనేక ప్రతికూల పరిస్థితులు ఉన్నప్పటికీ జనసేన ధైర్యంగా నిలబడిందని, విజయవాడలోని 39 డివిజన్లలో పోటీ చేసి సుమారు 50 వేల ఓట్లు సాధించడమే పార్టీకి ఉన్న క్షేత్రస్థాయి బలానికి నిదర్శనమని అన్నారు. ఆ ఎన్నికల్లో కష్టపడి పనిచేసిన నాయకులు, కార్యకర్తల శ్రమను పార్టీ ఎప్పటికీ మరువదని చెప్పారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో పోటీ చేయాలనుకునేవారు కేవలం సింబల్ పైనే ఆధారపడకుండా, వ్యక్తిగత విశ్వసనీయతను, ప్రజలతో అనుబంధాన్ని పెంచుకోవాలని సూచించారు. కేవలం కార్లలో తిరుగుతూ పెద్ద ఫ్లెక్సీలు, బ్యానర్లు కట్టినంత మాత్రాన ఓట్లు రావని, సమస్యల పరిష్కారంలో భాగమైనప్పుడే ప్రజలు మద్దతు ఇస్తారని స్పష్టం చేశారు. ప్రస్తుతం జనసేన ఎన్డీఏ కూటమిలో భాగస్వామిగా ఉన్నందున అన్ని పదవులను ఒకేసారి ఆశించడం సరికాదని, దశాబ్దాలుగా ఉన్న ఇతర కూటమి పార్టీలతో సమన్వయం చేసుకుంటూ క్రమంగా పార్టీని మరింత బలోపేతం చేయాలని దిశానిర్దేశం చేశారు. అదే సమయంలో సోషల్ మీడియా వేదికగా జనసేన పార్టీపై, పవన్ కల్యాణ్‌పై జరుగుతున్న తప్పుడు ప్రచారాలను, దుష్ప్రచారాన్ని కార్యకర్తలు సమర్థవంతంగా తిప్పికొట్టాలని, నిజాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు.

# విజయవాడ కార్పొరేషన్ లో కూటమిదే విజయం

## మంత్రి కందుల దుర్గేష్

**కూటమి ధర్మాన్ని పాటిస్తూనే క్షేత్రస్థాయిలో జనసేనను మరింత బలోపేతం చేయాలి**

**కష్టపడి పనిచేసే ప్రతి ఒక్కరికీ జనసేనాని పవన్ కళ్యాణ్ ఆశీస్సులు, గుర్తింపు ఉంటాయి**

**రాబోయే కార్పొరేషన్, స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయదుందుభి మోగించాలి**

**విజయవాడ జనసేన నేతల సమీక్షా సమావేశంలో మంత్రి, విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులు కందుల దుర్గేష్ వెల్లడి**



విజయవాడ ప్రజాభూమి ప్రతినిధి

### అరాచక పాలనకు స్వస్తి.. రెండేళ్ల సుపరిపాలనతో ప్రజాక్షేమం

రాష్ట్రంలో గతంలో ఉన్న నియంతృత్వ, అరాచక పాలనను అంతమొందించడానికి జనసేన నాయకుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఎక్కడ నెగ్గాలో కాదు, ఎక్కడ తగ్గాలో తెలుసుకొని కూటమి ప్రభుత్వ ఏర్పాటులో కీలక పాత్ర పోషించారని తెలిపారు. రెండేళ్లుగా రాష్ట్రంలో అత్యద్భుత పాలన సాగుతోందన్నారు.కూటమి ప్రభుత్వం మనది.. ప్రజల సమస్యల పరిష్కారంలో ముందే ఉంటాం అన్నారు.

కూటమి ధర్మాన్ని పాటిస్తూనే జనసేన పార్టీని సంస్థ గతంగా బలోపేతం చేయాలని మంత్రి కందుల దుర్గేష్ పిలుపుని చ్చారు. విజయవాడలో నిర్వహించిన జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తల అత్యవసర సమీక్షా సమావేశంలో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటో గ్రఫీ శాఖల మంత్రి,విజయ వాడ పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులు కందుల దుర్గేష్ పాల్గొని జన సైనికులు, వీర మహిళలు, నాయకులకు దిశానిర్దేశం చేశారు.స్థానిక సంస్థల ఎన్నికలకు అందరూ సిద్ధం కావాలని, జనసేన పార్టీ బలం పెంచుకోవడం ద్వారా ఎక్కువ స్థానాల్లో పోటీ చేసే అవకాశం ఉంటుందని పేర్కొంటూ.. విజయవాడ కార్పొరేషన్ ఎన్నికల్లో కూటమిదే విజయ మని ధీమా వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. విజయవాడ పార్లమెంటు నియోజకవర్గ పరిశీలకుడిగా తాను దాదాపు వారం రోజుల పాటు అన్ని నియోజకవర్గాల జనసైనికులు, వీర మహిళలతో భేటీ అయిన రోజులను గుర్తుచేసుకున్నారు. ఎన్టీఆర్ జిల్లాలో పార్టీ బలోపేతం కోసం స్థానిక నాయకత్వం చూపిస్తున్న చొరవ అత్యంత ఆదర్శనీయమని కొని యాడారు. నాడు పార్టీ పదవుల కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరితో నేను స్వయంగా మా ట్లాడాను. వారంతా 2014 నుండి పార్టీ సిద్ధాంతాలను నమ్మి పనిచేస్తున్న వారే. పేద ప్రజల ప్రతి ని ధులైన ఆటో డ్రైవర్లు, రిక్షావాలాలు, దినసరి కూలీలు తమ కష్టార్జితం నుంచి రూపాయి రూ పాయి కూడబెట్టి పార్టీ కోసం ఖర్చు చేశారు. ఏ ఒక్క కులానికో పరిమితం కాకుండా సమా జంలోని అన్ని వర్గాల ఆశాజ్యోతిగా జనసేన నిలిచింది. ఇంతటి బలమైన భావజాలం ఉన్న సైన్యం ప్రపంచంలో ఒక్క జనసేనకే సాధ్యం అన్నారు. పేదల పార్టీ మన జనసేన అని పేర్కొ న్నారు. ఈ సందర్భంగా రాజకీయ చైతన్యం పొందిన విజయవాడ నగరంలో నాయకత్వం మరింత పెంపొందాల్సిన అవసరం ఉందన్నారు. అత్యవసర సమయంలో ఈ సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేసిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కి, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తూ, పార్టీ జెండాను మోస్తున్న వీర మహిళలు, జనసైనికులు, నాయకులకు మంత్రి దుర్గేష్ ప్రత్యేక అభినందనలు తెలిపారు.సమీక్ష సమావేశంలో భాగంగా జనసేన అభ్యర్థులతో స్వయంగా మంత్రి దుర్గేష్, ఇతర జనసేన నేతలు బయోడేటా ఫామ్స్ తీసుకొని వారితో ముఖాముఖి మాట్లాడారు.




### త్యాగాలకు ప్రతిరూపం జనసైనికులు.. కష్టపడే ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు

జనసేన పార్టీకి కేటాయించిన పదవులకు ప్రతి ఒక్కరూ న్యాయం చేస్తున్నారని మంత్రి దుర్గేష్ అన్నారు. మంత్రి నాదెండ్ల మనోహర్ పౌర సరఫరాల శాఖ ద్వారా ఆరుగాలం కష్టపడే రైతన్నల నుంచి చివరి గింజ వరకు కొనుగోలు చేసి, 24 గంటల్లోనే నగదు జమ చేస్తున్నారని, 'దీపం-2' కింద ఉచిత గ్యాస్ సిలిండర్లు, నాణ్యమైన సన్న బియ్యం అందిస్తూ పాలనలో సత్తా చాటుతున్నామని పేర్కొన్నారు. అదేవిధంగా తాను నిర్వర్తిస్తున్న శాఖలో సాధించిన విజయాలను వివరించారు. జనసేనాని పవన్ కళ్యాణ్ ఆశయాలకు అనుగుణంగా, నమ్మకాన్ని నిలబెట్టు కుంటూ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, లోక్ సభ, రాజ్యసభ సభ్యులు బాగా పని చేస్తున్నారని తెలిపారు.

### విజయవాడ పీఠంపై 'జనసేన' పతాకం.. నూటికి నూరు శాతం విజయం మనదే

ప్రస్తుత రాజకీయ వాతావరణం కూటమికి అత్యంత అనుకూలంగా ఉందని, టీడీపీ-జనసేన-బీజేపీ కలిసి పోటీ చేయనున్న రాబోయే కార్పొరేషన్, స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం నూటికి నూరు శాతం తథ్యమని మంత్రి దుర్గేష్ ధీమా వ్యక్తం చేశారు. గతంలో ఎటువంటి మద్దతు లేని సమయంలోనే గెలిచిన వీరసైనికులను స్ఫూర్తిగా తీసుకుని విజయవాడ నగరంలో జనసేన జెండాను రెపరెపలాడించాలని పిలుపునిచ్చారు. తాను ఈ రోజు మంత్రిగా ఉన్నానంటే అది జనసేనాని పవన్ కళ్యాణ్ వాత్సల్యమేనని, పార్టీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్తకూ తగిన గుర్తింపు, భవిష్యత్తు ఉంటాయని స్పష్టం చేశారు. ఎవరికి ఏ పదవి ఇవ్వాలో పవన్ కళ్యాణ్ గారికి పూర్తి స్పష్టత ఉందన్నారు.

## పాస్‌పోర్ట్ సేవలపై లోక్‌సభలో ఎంపీ బాలశౌరి ప్రశ్నోత్తరాలు

**ఫీజుల పెంపునకు కేంద్రం వివరణ.. వృద్ధులు, చిన్నారులకు 10% రాయితీ**

**14 ఏళ్ల తర్వాత సవరణ 2012 తర్వాత మళ్లీ ఇప్పుడే పాస్‌పోర్ట్ ఫీజులు పెరిగాయి**

**ఎపిలో పాస్‌పోర్ట్ జారీ సమయం పోలీస్ వెరిఫికేషన్ కాకుండా సగటున 11 నుంచి 13 రోజులు**

**రాయితీ వర్తింపు: 60 ఏళ్లు పైబడిన వారికి, 8 ఏళ్ల లోపు చిన్నారులకు 10% మినహాయింపు**




ప్రజాభూమి బ్యూరో కృష్ణాజిల్లా

దేశంలో పాస్‌పోర్ట్ సేవల పనితీరు, ఇటీవల చేపట్టిన ఫీజుల పెంపు మరియు సామాన్యులపై దాని ప్రభావంపై మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి లోక్‌సభలో అడిగిన ప్రశ్నలకు కేంద్ర విదేశాంగ శాఖ స్పష్టమైన వివరణ ఇచ్చింది.ఏపీలో పాస్‌పోర్ట్ జారీ వ్యవధి ఎంతంటే?ఆంధ్రప్రదేశ్‌లో పోలీసు వెరిఫికేషన్ సమయాన్ని మినహాయించి, పాస్‌పోర్ట్ జారీకి పడుతున్న సగటు సమయాన్ని కేంద్రం వెల్లడించింది:2023: 11 రోజులు2024: 11 రోజులు2025: 13 రోజులుదేశవ్యాప్తంగా ఉన్న పాస్‌పోర్ట్ కార్యాలయాలు, పాస్‌పోర్ట్ సేవా కేంద్రాలు (PSK) ఎంతో సమర్థవంతంగా సేవలు అందిస్తున్నాయని ప్రభుత్వం పేర్కొంది.14 ఏళ్ల తర్వాత ఫీజుల పెంపు.. కారణాలు ఇవే2026 జూలై 1 నుంచి అమల్లోకి వచ్చిన గెజిట్ నోటిఫికేషన్ ద్వారా ఫీజులను సవరించినట్లు కేంద్రం తెలిపింది. 2012 తర్వాత, దాదాపు 14 సంవత్సరాల అనంతరం ఈ పెంపు చేపట్టినట్లు స్పష్టం చేసింది.ఫీజుల పెంపునకు ముఖ్య కారణాలు:పాస్‌పోర్ట్ బుక్‌లెట్ తయారీ, ముద్రణ వ్యయాలు పెరగడం.ఈ-పాస్‌పోర్ట్ (E-Passport) ప్రాజెక్ట్, 'పాస్‌పోర్ట్ సేవా ప్రోగ్రామ్ 2.0' అమలు.సాంకేతిక మౌలిక వసతులు, సిబ్బంది వేతనాలు, పోస్టల్ ఛార్జీల పెరుగుదల.పాస్‌పోర్ట్ సేవలను లాభాపేక్షతో నడపడం లేదని, వసూలైన ఫీజు మొత్తం భారత సమీకృత నిధి (Consolidated Fund of India) కి చేరుతుందని కేంద్రం తెలిపింది.సవరించిన నూతన ఫీజుల వివరాలుపాస్‌పోర్ట్ రకంసవరించిన ఫీజు (రూ.)36 పేజీల సాధారణ పాస్‌పోర్ట్₹2,50060 పేజీల జంబో పాస్‌పోర్ట్₹3,500ప్రత్యేక సడలింపు:60 సంవత్సరాలు దాటిన వృద్ధులకు, 8 సంవత్సరాల లోపు చిన్నారులకు కొత్త పాస్‌పోర్ట్ దరఖాస్తులపై 10 శాతం ఫీజు రాయితీ యథాతథంగా కొనసాగుతుందని కేంద్రం వెల్లడించింది.

## సర్ ఆర్థర్ కాటన్ వర్ధంతి సందర్భముగా నివాళులు అర్పించిన వైసీపీ నేతలు

ప్రజా భూమి ప్రతినిధి / అవనిగడ్డ



అవనిగడ్డ నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త మరియు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర రైతు విభాగం రీజనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ సింహాద్రి రమేష్ బాబు ఆదేశాల మేరకు అవనిగడ్డ మండలం, పులిగడ్డ గ్రామ పంచాయతీ పరిధిలోని పులిగడ్డ అక్విడక్ట్ వద్ద రైతుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన జలయజ్ఞ పురుషుడు సర్ ఆర్థర్ థామస్ కాటన్ దొర వర్ధంతి సందర్భంగా ఆయన మహోనీయుని విగ్రహానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించి, అనంతరం దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అవనిగడ్డ నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేతలు, కృష్ణాజిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షులు సింహాద్రి వెంకటేశ్వరరావు, అవనిగడ్డ, మోపిదేవి మండలాల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రేపల్లె శ్రీనివాసరావు, గరికపాటి వెంకటేశ్వరరావు(బుల్లి), కృష్ణాజిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పెన్షనర్ల విభాగం ఉపాధ్యక్షులు చోడాబత్తిన పూర్ణచంద్రరావు, అవనిగడ్డ నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షులు బండారు సూరిబాబు, అవనిగడ్డ గ్రామం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ముస్లిం మైనార్టీ సెల్ విభాగం ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్ భాషా, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నపరెడ్డి పరమాత్మ, గవిని భరత్ కుమార్, గరికపాటి ఆంజనేయులు, దిడ్ల సాంబశివరావు, మత్తి వెంకట సత్యనారాయణ, సింహాద్రి రంజిత్, పూసాయా సతీష్, గరికపాటి రవీంద్ర, తాత శ్రీకాంత్, అడపా పోతురాజు, కొక్కిలిగడ్డ కొత్తపాలెం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తూటారం కృష్ణ మరియు పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.



## బ్రాహ్మణుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వమే శ్రీరామరక్ష

**గత వైసీపీ పాలనలో బ్రాహ్మణులకు తీరని అన్యాయం**

**నాటి ప్రతినిధులు కోన రఘుపతి, మల్లాది విష్ణు బ్రాహ్మణులకు చేసింది శూన్యం**

**బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ పి. వి. ఫణి కుమార్ ధ్వజం**

మచిలీపట్నం/ప్రజాభూమి ప్రతినిధి

రాష్ట్రంలోని బ్రాహ్మణుల సంక్షేమానికి ఎల్లప్పుడూ అండగా ఉండేది నారా చంద్రబాబు నాయుడు నాయకత్వం లోని కూటమి ప్రభుత్వం మాత్ర మేనని బ్రా హ్మ ణ వెల్ఫేర్ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ పి. వి. ఫణి కుమార్ స్పష్టం చేశారు. విజయవాడ బ్రాంచ్ బ్రాహ్మణ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ నందు శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్ర మం లో 'పురో హిత మిత్ర' పథకం కింద 8 మంది లబ్ధిదారులకు రూ. 4,80,000 చెక్కులను ఆయ న అంద జేశారు. ఈ కార్యక్రమంలో విజయ వాడ నగర కార్పొరేషన్ 33వ డివిజన్ టీడీపీ ఇన్‌ఛార్జ్ గార్లపాటి విజయ్ కుమార్ తో కలిసి చెక్కులను పంపిణీ చేశారు. వైసీపీ పాలనపై విమర్శల బాణాలు:ఈ సందర్భంగా పి. వి. ఫణి కుమార్ మా ట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంపై తీవ్ర స్థాయి లో మండిపడ్డారు:ఓటు బ్యాంకు రాజకీ యాలు: గత ప్రభుత్వం బ్రాహ్మణులను కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే వాడుకుని, తీవ్ర అన్యాయం చేసిందని ఆరోపించారు.ఏం సాధించారు?: నాటి వైసీపీ ప్రభుత్వంలో బ్రాహ్మ ణ ప్రతినిధులుగా చలామణి అయిన కోన రఘుపతి, మల్లాది విష్ణు బ్రాహ్మణ సమాజానికి అసలు ఏం చేశారని ప్రశ్నించారు.కార్పొరేషన్ విధ్వంసం: బ్రాహ్మణ కార్పొరేషన్‌ను బీసీ వెల్ఫేర్ కార్పొరేష న్‌లో విలీనం చేసి, నిరుపేద బ్రాహ్మణులకు ఎలాంటి సంక్షేమ పథకాలూ అందకుండా చేశారని ధ్వజమెత్తారు.కూటమి ప్రభుత్వంలో బ్రాహ్మణులకు ప్రాధాన్యత: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బ్రాహ్మణుల ప్రయోజ నాల కోసం తీసుకున్న నిర్ణయాలను ఆయన వివరించారు:దేవాలయ కమిటీలలో స్థానం: రాష్ట్రం లోని ప్రతి దేవాలయ కమిటీలోనూ అర్చకు డితో పాటు మరొక బ్రాహ్మణుడికి ప్రాధా న్యత ఇస్తూ రాజకీయ అవకాశాలు కల్పించారు. ఎండోమెంట్స్‌లోకి విలీనం: బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొ రేషన్ చైర్మన్ కె. బుచ్చి రాంప్రసాద్ నాయ కత్వం లో, బీసీ కార్పొరేషన్‌లో విలీనం కావడం వల్ల జరిగిన నష్టాలను సీఎం చంద్రబాబుకు వివరించి, దానిని దేవాదాయ (ఎండోమెంట్స్) శాఖలోకి మార్చేలా చర్యలు తీసుకున్నారు. అర్చకుల వేతనాల పెంపు: కూటమి ప్రభుత్వం రాగానే అర్చకుల జీతాలు పెంచి వారి జీవితాల్లో వెలుగులు నింపింది. బ్రాహ్మణులకు పిలుపు & భవిష్యత్ ప్రణాళిక: సంఘటితం కావాలి: రాష్ట్రంలో 18 ఏళ్లు నిండిన బ్రాహ్మణ పురుషులు, మహిళలందరూ బ్రాహ్మణ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీలో సభ్యులుగా చేరి, సమాజ సంఖ్యాబలాన్ని, సొసైటీని బలోపేతం చేసుకోవాలని కోరారు.ఉపాధి అవకాశాలు: నిరుపేద బ్రాహ్మణులు చిన్న తరహా వ్యాపారాలు చేసుకుని ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు సొసైటీ ద్వారా అందించే రుణాలను సద్వినియోగం చేసుకోవాలని సూచిం చారు. పథకాల అమలు: చైర్మన్ కె. బుచ్చి రాంప్ర సాద్ ఆధ్వర్యంలో బ్రాహ్మణ సంక్షేమ పథకాలన్నింటినీ అర్హులైన ప్రతి ఒక్కరికీ ఖచ్చితంగా అందజేస్తామని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్ర మంలో బ్రాహ్మణ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ విజయవాడ బ్రాంచ్ మేనేజర్ గోర్తి శ్రీనివాస్, లబ్ధిదారులు మరియు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.





## డ్రైనేజీ పనులు పరిశీలన

ప్రజా భూమి ప్రతినిధి / అవనిగడ్డ

మోపిదేవిలో నిర్మిస్తున్న నూతన డ్రైనేజీ పనులను పరిశీలించిన మోపిదేవి గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారి మరియూ తహసీల్దార్ ముప్పిరి శెట్టి హరనాథ్. జిల్లా పరిషత్ నిధులు 20 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించే ఈ నూతన డ్రైనేజీ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మరో పది రోజుల్లో ఈ డ్రైనేజీ నిర్మాణ పనులు పూర్తికానున్నాయి. నిర్మాణ పనులు శుక్రవారం మోపిదేవి గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారి ముప్పిరిశెట్టి హరనాథ్ పరిశీలించి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా హరనాథ్ మాట్లాడుతూ మోపిదేవి శివారు రావివారి పాలెం గ్రామంలో కూడా డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని తెలిపారు.

## జార్జి కారనేషన్ పాఠశాలలో పండుగలా మెగా పేరెంట్

**టీచర్ మీట్ ముగ్గుల పోటీలు, ఆటపాటలతో అలరించిన విద్యార్థుల తల్లిదండ్రులు విజేతలకు ఘనంగా**



**బహుమతుల ప్రదానంపదో తరగతి ప్రతిభావులైన విద్యార్థులకు ప్రత్యేక రివార్డులు**

**హాజరైన కూటమి నాయకులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు**

మచిలీపట్నం/ప్రజాభూమి ప్రతినిధి

మచిలీపట్నం జార్జి కారనేషన్ హైస్కూల్‌లో 'మెగా పేరెంట్స్ – టీచర్స్ డే' వేడుకలు అత్యంత వైభవంగా, పండుగ వాతావరణంలో జరిగాయి. పాఠశాల ప్రాంగణం విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల కలయికతో సందడిగా మారింది.ముగ్గుల పోటీలు.. ఆటల సందడి!ఈ వేడుక ల్లో ప్రధాన ఆకర్షణగా విద్యార్థుల తల్లిదండ్రుల కోసం ప్రత్యేకంగా నిర్వహించిన ముగ్గుల పోటీలు, వివిధ ఆటల పోటీలు నిలిచాయి. తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు నిర్వాహకులు ఘనంగా బహుమతులు అందజేశారు. ప్రతిభావంతులకు రివార్డులుపాఠశాలలో 10వ తరగతిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యా ర్థులను ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేకంగా అభినందిస్తూ రివార్డులు అందజే శారు. విద్యార్థులు భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.ఐక్యత చాటిన వేడుకలు:పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల పాత్ర అత్యంత కీలకమని ఈ కార్యక్రమం నిరూపించింది.ఈ కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులు, కూటమి నాయకులు గడ్డం రాజు, అక్కు మంతి, వెంకట్రావు, రాజా, మౌలాలి, ప్రసాద్, జిలాని, చంటి, మూసా తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## విద్యార్థుల సమగ్రాభివృద్ధే లక్ష్యం మెగా పేరెంట్స్ మీటింగ్ 3.1లో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ

మచిలీపట్నంరూరల్/ ప్రజాభూమి ప్రతినిధి




విద్యార్థుల విద్యా ప్రమాణాలను మెరుగుపరచడం, వారి సమగ్రాభివృద్ధి లక్ష్యంగా తల్లిదండ్రులు-ఉపాధ్యాయుల భాగస్వామ్యాన్ని బలోపేతం చేసేందుకే కూటమి ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా మెగా పేరెంట్స్ మీటింగ్ 3.1 కార్యక్ర మాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని కృష్ణా జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ తెలిపారు.శుక్రవారం మచిలీపట్నం నార్త్ మండలం కానూరు పంచాయతీ పరిధిలోని పెద్ద కానూరు, చిన్న కానూరు, వన్నారు కానూరు గ్రామాల పాఠశాలల్లో నిర్వహించిన మెగా పేరెంట్స్ మీటింగ్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.పాఠశాల పరిధిలోనే ₹70 లక్షల లబ్ధి!ఈ సందర్భంగా గోపు సత్యనారాయణ మాట్లాడుతూ...తల్లికి వందనం నిధులు: గతంలో ఎన్నడూ లేని విధంగా ఒకే కుటుంబంలో ఎంతమంది విద్యార్థులు ఉన్నా అందరికీ వర్తించేలా ప్రభుత్వం 'తల్లికి వందనం' పథకాన్ని అమలు చేస్తోందన్నారు. ఈ ఒక్క పాఠశాల పరిధిలోనే విద్యార్థుల తల్లిన ఖాతాల్లో ఏకంగా ₹70 లక్షల రూపాయలు జమ కావడం పట్ల లబ్ధిదారులు తీవ్ర హర్షం వ్యక్తం చేశారన్నారు.కృతజ్ఞతలు: విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ, వారి భవిష్యత్తుకు బలమైన పునాదులు వేస్తున్న విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కి ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.రూ.10,000 ప్రోత్సాహకం: ఈ పాఠశాల విద్యార్థులను ప్రోత్సహించేందుకు గాను ప్రతి సంవత్సరం పదవ తరగతి పరీక్షల్లో 551 కంటే ఎక్కువ మార్కులు సాధించిన ప్రతి ప్రతిభావంతునికి ₹10,000 నగదు బహుమతిగా అందిస్తున్నట్లు ఆయన ప్రకటించారు.కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులుప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో సమాజ భాగస్వామ్యం పెరగాలని పిలుపునిచ్చిన ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, ప్రజాప్ర తినిధులు మరియు నాయకులు పాల్గొన్నారు.అధికారులు & సిబ్బంది: పంచాయతీ కార్యదర్శి వరప్రసాద్, తాళ్ళపాలెం PHC డా. జి.గోపి కృష్ణ.ముఖ్య నాయకులు: పీత రాము, దివి మహేష్, గోపు వెంకటరమణ, బొల్లిశెట్టి శివనాగరాజు, చిటికినేటి అయ్యప్ప, మోపిదేవి కృష్ణామూర్తి, బొమ్మిడి పెద్ద ఏడుకొండలు, ఈవన ప్రభాకరరావు, ఒడుగు శ్రీనివాసరావు, గణపబత్తుల నాగపాము, బొమ్మిడి ఏడుకొండలు, కమ్మ గట్టి అశోక్, చిటికినేటి నాగంజనేయులు, ఒడుగు ప్రేమకుమార్, వీర చిన్న, గోపు కనక పెద్దిరాజులు.ఇతర భాగస్వా ములు: పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యా ర్థుల తల్లిదండ్రులు, విలేజ్ క్లినిక్ సిబ్బంది, స్వర్ణ గ్రామ సిబ్బంది మరియు బుక్ కీపర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ముస్సిపల్ కార్మికులకు అందిన “తల్లికి వందనం”పథకం

**-ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ హర్షం.**

ప్రజా భూమి ప్రతినిధి-ఏలూరు జిల్లా.



తల్లికి వందనం పథకం మున్సిపల్ కార్మికులకు కూడా వర్తింప చేయడం పట్ల ఏపి.మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) ఏలూరు జిల్లా కార్యదర్శి భజంత్రీ శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. మున్సిపల్ కార్మికులకు ప్రభుత్వ పథకాలు అందని ద్రాక్ష గా మారిన తరుణంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను మున్సిపల్ కార్మికులకు వర్తింపజేయాలని డిమాండ్ చేస్తూ దశల వారి పోరాటాలకు పిలుపు ఇచ్చి ఆ పోరాటాలను జయప్రదంగా నిర్వహించడంతో రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికులకు తల్లికి వందనం పథకాన్ని అమలు చేసిందన్నారు.పోరాటాల ద్వారా మన డిమాండ్లు సాధించవచ్చు అని మున్సిపల్ కార్మికులు మరోసారి రుజువు చేశారని తెలిపారు.మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం, కోసం న్యాయమైన డిమాండ్ల సాధన కోసం రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన దశల వారి పోరాటాల్లో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ విజయం సాధించిందన్నారు.కార్మికులందరూ ఈ విజయం ఇచ్చిన ఉత్తేజంతో భవిష్యత్తులో జరిగే పోరాటాలలో మరింత ఉత్సాహంగా పాల్గొని తద్వారా మన సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు యూని యన్ ఇచ్చే ప్రతి పిలుపును జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

## నవజాత శిశువు మృతిపై సమగ్ర విచారణకు ఆదేశం

**-ఎమ్మెల్యే బడేటి చంటి**



ప్రజా భూమి ప్రతినిధి-ఏలూరు

ప్రభుత్వాసుపత్రిలో నవజాత శిశువు మృతిచెందిన ఘటనపై పూర్తిస్థాయి విచారణకు ఆదేశించినట్లు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు,ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి తెలిపారు.అలాగే బాధిత తల్లిపై పేపర్లు విసిరి అవమానించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఘటన అనంతరం ఆసుపత్రికి చేరుకున్న ఎమ్మెల్యే వైద్యాధికారులు, బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.ప్రసూతి సేవల్లో నిర్లక్ష్యం జరిగిందన్న ఆరోపణల నేపథ్యంలో ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు సమగ్ర విచారణ చేపట్టాలని ఆదేశించినట్లు తెలిపారు.ఈ విషయాన్ని డీఎంఈ కార్యాలయానికి కూడా తెలియజేసినట్లు చెప్పారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే బడేటి చంటి స్పష్టం చేశారు.

## ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి లోకేష్ సంస్కరణలు దోహదం

**-ఎమ్మెల్యే బడేటి చంటి**

ప్రజా భూమి ప్రతినిధి-ఏలూరు



రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అమలు చేస్తున్న విద్యా సంస్కరణలు ప్రభుత్వ పాఠశాల లను కార్పొరేట్ విద్యాసంస్థలకు ధీటుగా తీర్చిదిద్దేందుకు దోహదపడుతున్నాయని జిల్లా టీడీపీ అధ్యక్షుడు, ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. ఏలూరు 19వ డివిజన్ హనుమాన్‌నగర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మెగా పేరెంట్-టీచర్ మీట్ 4.0 కార్యక్రమంలో ఆయ న ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా విద్యార్థులకు నోటుపుస్తకాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధి, నాణ్యమైన యూనిఫాంలు, పౌష్టికాహారం, ప్రతిభావంతులైన ఉపాధ్యాయుల నియామకంతో విద్యార్థుల సంఖ్య పెరుగుతోందన్నారు.హనుమాన్‌నగర్ పాఠశాలకు అదనపు తరగతి గదులు, స్కూల్ రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే సాంకేతిక కారణాలతో 'తల్లికి వందనం' పథకానికి దూరమైన 12 మంది తల్లులను అర్హుల జాబితాలో చేర్చేందుకు కృషి చేస్తామని తెలిపారు.మేయర్ షేక్ నూర్జహాన్ మాట్లాడుతూ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో కీలక పాత్ర పోషించాలని సూచించారు.కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, కూటమి నాయకులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో తీవ్ర వర్షాభావ పరిస్థిత కారణంగా, కూటమి ప్రభుత్వం వెంటనే సమగ్ర కరవు అంచనాలు చేపట్టి, రైతాంగాన్ని ఆదుకోవాలి

- ఆగస్టు 17న రాష్ట్రవ్యాప్తంగా ఆర్ డి ఓ ఆఫీస్‌ల వద్ద ధర్నాలు.
- పి.జమలయ్య,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం.

ప్రజా భూమి ప్రతినిధి-ఏలూరు జిల్లా



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఏర్పడిన తీవ్ర వర్షాభావ పరిస్థితుల వల్ల రైతాంగం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందని ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. జమలయ్య ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ, ఎండిపోతున్న పంటలను, అప్పుల ఊబిలో ఉన్న రైతులను కాపాడటానికి ప్రభుత్వం వెంటనే సహాయక చర్యలు చేపట్టాలని కోరుతూ ఆగస్టు 17న రాష్ట్రవ్యాప్తంగా ఆర్డీవో కేంద్రాల వద్ద ధర్నాలు నిర్వహించాలని ఆయన పిలుపు నిచ్చారు. ఈరోజు ఏలూరులో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం,కౌలురైతుల సంఘాల సంయుక్త సమావేశం కౌలురైతుల సంఘం అధ్యక్షులు దొంత కృష్ణ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్రంలోని 688 మండలాలకు గాను 591 మండలాల్లో (84%) తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి.ఈ ఖరీఫ్‌లో 86 లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేయాల్సి ఉండగా, కేవలం 20 లక్షల ఎకరాల్లో మాత్రమే సాగు జరిగింది. రాష్ట్రంలో 60% పంటలు వర్ష ఆధారితమే. ఖరీఫ్‌లో అత్యధికంగా వేసే వరి, పత్తి, వేరుశనగ, కంది పంటలు వానలు లేక ఎండిపోతున్నాయి.గత మూడు నెలలుగా 'ఎల్ నినో' ప్రభావం వల్ల వర్షాభావ పరిస్థితులు ఏర్పడతాయని వాతావరణ నిపుణులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నా కూటమి ప్రభుత్వం పెడచెవిన పెట్టింది. ముందస్తు ప్రణాళికలు రూపొందించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. చంద్రబాబు నాయుడు తలచుకుంటే వర్షాభావ పరిస్థితులు తొలగిపోతాయని అపోహలు ప్రచారం చేయడం సిగ్గుచేటున్నారు. రాష్ట్రంలోని వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే సమగ్ర కరవు అంచనాలు చేపట్టి, కరవు ప్రాంతాలుగా ప్రకటించాలి డిమాండ్ చేశారు.ఎండిపోయిన, నష్టపోయిన పంటలకు రైతులకు వెంటనే పరిహారం అందించాలి.గత పంట బీమా పరిహారం రూ. 4,400 కోట్లు తక్షణమే రైతులకు చెల్లించాలి.ఇన్‌పుట్ సబ్సిడీ రూ. 1,200 కోట్లు వెంటనే విడుదల చేయాలి. నిలిచిపోయిన వడ్డీ బకాయిలు రూ. 500 కోట్లు చెల్లించాలి. ప్రస్తుతం ఖరీఫ్‌లో తీసుకున్న పంట రుణాలను రీషెడ్యూల్ చేయాలి. రైతులపై వడ్డీ భారాన్ని తగ్గించి, కొత్త పంట రుణాలు మంజూరు చేయాలి.పశు సంపదను రక్షించడానికి పశుగ్రాస కేంద్రాలను ఏర్పాటు చేయాలి. గ్రామీణ ప్రాంతాల్లో పశువుల నీటి కోసం తొట్టెలు నిర్మించాలని కోరారు.గ్రామాల్లో తాగునీటి ఎద్దడి రాకుండా ప్రత్యేక ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయాలి మరియు వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలన్నారు.రైతాంగాన్ని, ప్రజలను ఈ కరవు కోరల నుంచి కాపాడటానికి ప్రభుత్వం యుద్ధపాతిపదికన స్పందించకపోతే కౌలురైతుల సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని పి. జమలయ్య హెచ్చరించారు. ఏలూరు జిల్లా సిపిఐ కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య మాట్లాడుతూ ఏలూరు, తూర్పుగోదావరి ,యన్ టి ఆర్,కృష్ణా, జిల్లాలకు జీవనాడిగా ఉండవలసిన చింతలపూడి ఎత్తిపోతల పథకం ఇంతవరకు నిర్మాణం జరగలేదన్నారు. ఈ పథకం నిర్మాణం పూర్తైతే వర్షాభావ పరిస్థితులు ఉన్న ఈ జిల్లాలు సశ్యామలంగా ఉండేవిన్నారు. ఈ సమావేశంలో జిల్లా రైతు సంఘం నాయకులు నిమ్మగడ్డ నరసింహ, మెడిపల్లి నాగేంద్రరావు,సన్నేపల్లి సాయిబాబు, కౌలురైతుల సంఘం జిల్లా అధ్యక్షులు గన్ను వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు నైతిక విలువలు పెంపొందించుకోవాలి

**శాసనసభ్యులు బాలరాజు**


ప్రజా భూమి ప్రతినిధి-జీలుగుమిల్లి



జీలుగుమిల్లి మండలం బర్రింకాలపాడు ఏపీ ఆర్ స్కూల్ మరియు కళాశాలలో నిర్వహించిన మెగా పేరెంట్స్ డే 4.0 కార్యక్రమంలో పాల్గొన్న పోలవరం శాసనసభ్యులు చిర్రి బాలరాజు.జీలుగుమిల్లి మండలం బర్రింకాలపాడు ఏపీఆర్ స్కూల్ మరియు కళాశాలలో నిర్వహించిన మెగా పేరెంట్స్ డే 4.0 కార్యక్రమంలో పోలవరం శాసనసభ్యులు చిర్రి బాలరాజు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, విద్యార్థుల అభివృద్ధిలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యాసంస్థల సమన్వయం అత్యంత కీలకమని పేర్కొన్నారు. విద్యార్థుల్లో క్రమశిక్షణ, నైతిక విలువలు, నాణ్యమైన విద్య పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. ప్రతి విద్యార్థి తన లక్ష్యాన్ని చేరుకునేలా తల్లిదండ్రులు నిరంతరం ప్రోత్సహించాలని సూచించారు.అనంతరం విద్యార్థుల విద్యా ప్రగతి, పాఠశాలలో అందుతున్న సౌకర్యాలు, బోధనా విధానాలపై తల్లిదండ్రులతో ఎమ్మెల్యే చర్చించారు. విద్యార్థుల ప్రతిభను అభినందిస్తూ, ఉన్నత లక్ష్యాలను సాధించి సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు శ్రీనివాస్,బుచ్చియ్య, ఏపీఆర్ స్కూల్ మరియు కళాశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు,కూటమి నాయకులు బండారు అనిల్, రూపా సత్యనారాయణ, కొప్పుల శ్రీనికాంత్, రాయి సుబ్బారావు, వనమా రాంబాబు, దేవుడు శ్రీను,కుంజా రమేష్, మద్దాల రమేష్,యామ కృష్ణ,అక్కిశెట్టి ప్రసాద్, గుడ్ల రాంబాబు, కొండపల్లి ప్రసాద్, చాట్రాతి ప్రసాద్,రెడ్డి,గణేష్, సిరిబత్తుల స్వామి,శౌంఠి రామకృష్ణ,శేఖముడి సాయి, చిర్రి నాగరాజు, సంకుల రామకృష్ణ, మందపాటి సూర్య, పేరుబోయిన సాయి,తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు మరియు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

## మెగా ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన..

**-560 మందికి వైద్య పరీక్షలు**



ప్రజా భూమి ప్రతినిధి-ఏలూరు

పెదవేగి మండలం దుగ్గిరాలలో శుక్రవారం తిరుమల తిరుపతి దేవస్థానములు (టీటీడీ), తిరుపతి బర్డ్ ట్రస్ట్ హాస్పిటల్, చింతమనేని ఛారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరాన్ని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు, ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి ప్రారంభించారు.తిరుపతి బర్డ్ ట్రస్ట్ హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ గుడారు జగదీష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో అంగవైకల్యం, కీళ్ల సమస్యలు, వెన్నెముక, ఎముకలు, కండరాల సంబంధిత వ్యాధులతో వచ్చిన 560 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి చికిత్సలు, శస్త్రచికిత్సల కోసం సిఫార్సులు చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు మాట్లాడుతూ అవసరమైన వారికి ఉచితంగా మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యమని తెలిపారు. అలాగే శనివారం భీమడోలు, ఆదివారం చింతలపూడిలో కూడా ఇలాంటి మెగా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శిబిరానికి వచ్చిన వారికి అల్పాహారం, భోజన సదుపాయం కూడా ఏర్పాటు చేశారు.

## పిల్లలు తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించాలి



ప్రజా భూమి ప్రతినిధి-జీలుగుమిల్లి

పాఠశాల యాజమాన్యం మరియు తల్లిదండ్రుల మధ్య సమర్థవంతమైన సహకారంతో విద్యార్థి యొక్క ప్రగతి కోసం, పాఠశాలలో విద్యా సౌకర్యాల కోసం, విద్యార్థులు మెరుగైన ఫలితాల కోసం “ మెగా తల్లిదండ్రుల వంటి సమావేశాలు.. దొహద పడతాయని వాల్మీకి విజ్ఞాన కేంద్రం పాఠశాల ప్రధానాచార్యులు ఎంవీఎస్ సుబ్రహ్మణ్యం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పిలుపుమేరకు వంక వారు కూడా వాల్మీకి విజ్ఞాన కేంద్రం పాఠశాల నందు “ మెగా తల్లిదండ్రుల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో సుమారు 70 మంది వరకు పేరెంట్స్ పాల్గొన్నారు.

తల్లిదండ్రులు తమ పిల్లలని గారాభం చేయవద్దని, వాళ్ల.. ని సెల్‌కి దూరం పెట్టాలని, చదువు పట్ల శ్రద్ధను అంకితభావాన్ని కనబరిచేలాగా, తమ కులవృత్తులు ను నేర్చుకునేలాగా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని,.. పాఠశాల అకాడమిక్ ఇంచార్జి ఉర్రింకల శివశంకర్ అన్నారు. నైతిక నిబద్ధత కూడిన జీవన విధానాన్ని అనుసరించుటకు., విద్యార్థులు ఉత్తమ ఫలితాలు పొందుటకు వాల్మీకి విజ్ఞాన కేంద్రం పాఠశాల నిరంతరం శ్రమిస్తున్నదని పాఠశాల ఉపాధ్యాయులు వేదుల జనార్దన రావు కోరారు. ఈ కార్యక్రమంలో... ఉర్రింకల శివశంకర్, కే గౌరీ , వి కామేశ్వరి, కే వెంకటేశ్వరరావు, ఏ అమల మరియు విద్యార్థుల యొక్క తల్లిదండ్రులు, పోషకులు పాల్గొన్నారు.

**పెదపాడులోని కాకరాల చంద్రశేఖర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో**

# మెగా పేరెంట్స్, టీచర్స్ మీట్ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి

**కార్యక్రమంలో తమ తల్లుల పాదాలకు పూజలు చేసిన విద్యార్థినీ, విద్యార్థులు.**

ప్రజాభూమి ప్రతినిధి-పెదపాడు

విద్యార్థుల సమగ్ర విద్యాభివృద్ధికి పేరెంట్స్, టీచర్స్ మీట్ ఎంతగానో దోహదపడుతుందని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి చెప్పారు. పెదపాడు మండలం పెదపాడులోని కాకరాల చంద్రశేఖర్ జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో శుక్రవారం మెగా పేరెంట్స్, టీచర్స్ మీట్ 4.0 లో జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. మా తెలుగు తల్లికి మల్లెపూదండ గేయంతో ప్రారంభమైన కార్యక్రమంలో ముందుగా విద్యార్థినీ, విద్యార్థులు తమ తల్లుల పాదాలకు పాద పూజలు చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలోని 1772 ప్రభుత్వ పాఠశాలలు, 20 జూనియర్ కళాశాలల్లో పెద్దఎత్తున మెగా పేరెంట్స్, టీచర్స్ మీట్ కార్యక్రమాన్ని ఆహ్లా దకరమైన వాతావరణంలో నిర్వహిస్తున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల స్థాయిని పెంచడం ద్వారా విద్యాభి వృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నదన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలతో కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థినీ, విద్యార్థులు ప్రతిభను చాటుతున్నారన్నారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధి, విద్యా ప్రమాణాలు పెంపుదల , తల్లి దండ్రుల భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడం, పాఠశాల-కుటుంబ సంబంధాలను పటిష్టపరచడం మెగా పేరెంట్స్, టీచర్స్ మీట్ యొక్క ప్రధాన ఉద్దేశ్యమన్నారు. ప్రతీ తల్లితండ్రులు లీప్ యాప్ తప్పనిసరిగా డౌన్ లోడ్ చేసుకోవాలని, లీప్ యాప్ లో తమ పిల్లలు హాజరు, అభ్యాసన స్థాయిని తెలుసుకోవడం, వాటిని మరింత పెంపొందించేందుకు అవసరమైన సూచనలు ఉపాధ్యాయుల నుండి తల్లితండ్రులు పొందవచ్చున్నారు. జిల్లాలో 2 లక్షల 56 వేల 393 మంది విద్యార్థులకు సంబందించి లక్షా 65 వేల 722 మంది తల్లుల ఖాతాలకు 13 వేల రూపాయలు చొప్పున తల్లికి వందనం నిధులను రాష్ట్ర ప్రభుత్వం జమ చేసిందన్నారు. జీవితంలో ఉన్నత అవకాశాలకు 10వ తరగతి ఫలితాలు ఒక టర్నింగ్ పాయింట్ అని, కష్టంతో కాకుండా ఇష్టంతో చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలన్నారు. 10వ తరగతి ఇంటర్ ఫలితాలలో మండల స్థాయిలో ప్రధమ స్థాయి సాధించిన విద్యార్థినీ, విద్యార్థులు ఈ పాఠశాలకు చెందినవారే కావడంతో వారిని కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. రానున్న 10వ తరగతి ఫలితాలలో నూరుశాతం ఉత్తీర్ణత సాధించే దిశగా విద్యార్థులు కృషిచేయాలన్నారు. పాఠశాలలోని విద్యార్థినీ, విద్యార్థులను అన్నివిధాలుగా ప్రోత్సహిస్తున్న ఉపాధ్యాయులను కలెక్టర్ ఈ సందర్భంగా అభినందించారు. అర్హత ఉండి తల్లికి వందనం సొమ్ము జమకాని తల్లితండ్రుల వివరాలు తీసుకుని వాటిని పరిష్కరించాలన్నారు.

**అలరించిన 'డ్రగ్స్ వద్దు బ్రో' ప్రదర్శన**

డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాల వినియోగం కారణంగా భవిష్యత్తు ఎంత అంధకారం అవుతుందో తెలియజేస్తూ పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులు ప్రదర్శించిన ప్రదర్శన కలెక్టర్ ని, సభికులను ఆకట్టుకుంది . ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ ఇటీవల పాఠశాల స్థాయిలో విద్యార్థులు మత్తుపదార్థాలకు బానిసలవుతున్నారని, డ్రగ్స్, మాదకద్రవ్యాల వినియోగం విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తును నాశనం చేస్తాయన్నారు. విద్యార్థులు డ్రగ్స్ కి సంబందించిన సమాచారాన్ని 1972 నెంబర్ ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని, ఫిర్యాదీదారుల వివరా లు గోప్యంగా ఉంచుతామన్నారు. జిల్లాలో డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాల నియంత్రణకు పోలీస్ శాఖ పెద్దఎత్తున పనిచేస్తోందన్నారు. రహదారి, భద్రతా నియమాలు, హెల్మెట్ వాడకంపై పాఠశాల స్థాయి నుండి అవగాహన కలిగించాలన్నారు. చక్కని ప్రదర్శనను అందించిన చిన్నారులను కలెక్టర్ ఈ సందర్భంగా అభినందించారు. ఈ సందర్భంగా లీప్ అప్ డౌన్లోడ్ గురించి పాఠశాల ఉపాధ్యాయురాలు విద్యార్థులు తల్లులకు తెలియజేసారు. 10వ తరగతి, ఇంటర్ లలో అత్యధిక మార్కులు సాధించిన పాఠశాల, కళాశాలకు చెందిన తభిత, హేమామాధురి, కీర్తన లు పాఠశాల, కళాశాలలో విద్యా ప్రమాణాల స్థాయిని వివరించారు. అనంతరం కళాశాలలో 10వ తరగతి పరీక్షలలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు, తల్లితండ్రులకు దుశ్శాలువాలతో కలెక్టర్ సన్మానించారు.ఈ సందర్భంగా పాఠశాలకు అవసరమైన సౌకర్యాలను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కోరగా, పరిశీలిస్తానని కలెక్టర్ చెప్పారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో కలెక్టర్ వెట్రిసెల్వి మొక్కలను నాటారు. అనంతరం పాఠశాలలోని పలు విభాగాలను కలెక్టర్ పరిశీలించారు.కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణజ్యోతి, ఎంపిడిఓ అమీన్ జమ, ఎంఈఓ సబ్బితి నరసింహమూర్తి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జి. విజయ, ఎస్ఎంసి చైర్మన్ సుబ్రహ్మణ్యం, కమిటీ సభ్యులు, గ్రామ ప్రముఖులు కాశీబాబు, మరడాని రవి, గారపాటి స్టాలిన్, అక్కినేని వంశి, పాఠశాల ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.





# ఆస్తుల కంటే విద్యే గొప్ప సంపద : ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

- మెగా పేరెంట్ మీట్-4.0లో తల్లిదండ్రులకు పిలుపు..
- ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని వెల్లడి.



ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట.

ఆస్తులున్న వారి కంటే చదువుకున్న వారే సమాజంలో గొప్పవారని, పిల్లలకు ఆస్తులు కూడబెట్టడం కంటే మంచి విద్య అందించ డంపైనే తల్లిదండ్రులు దృష్టి సారించాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతి విద్యార్థి ఉన్నత స్థాయికి ఎదగాలన్నదే రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యమని పేర్కొన్నారు. శుక్రవారం కొత్తపేట జూనియర్ కళాశాల, వానపల్లి ప్రభు త్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మెగా పేరెంట్ మీట్-4.0 కార్యక్రమంలో కొత్తపేట జనసేన ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్‌తో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యా ర్థులు, తల్లిదండ్రులతో ముఖాముఖి నిర్వహిం చి వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. అనంతరం జరిగిన సమావేశంలో మాట్లాడు తూ, మెగా పేరెంట్ మీట్ తల్లిదండ్రులు తమ పిల్లల విద్యా ప్రగతిని తెలుసుకునేందుకు, వారు ఏ అంశాల్లో ముందున్నారో, ఏ అంశా ల్లో మరింత శ్రద్ధ అవసరమో గుర్తించేందుకు ఎంతో ఉపయోగపడే వేదిక అని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో సీట్లు దొరకని స్థాయికి వాటిని తీర్చిదిద్దాలన్నదే విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ముందుచూపు అని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం విద్యా రంగానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, డొక్కా సీతమ్మ మధ్యా హ్న భోజన పథకం, సర్వేపల్లి రాధాకృష్ణ విద్యా ర్థి కిట్లు, తల్లికి వందనం, క్రీడా కిట్లు వంటి కార్యక్రమాలు విద్యార్థుల అభివృద్ధికి దోహద పడుతున్నాయని చెప్పారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం అనేక సంస్కరణలు చేపడుతోందన్నారు. ప్రస్తు త సమాజంలో మత్తు పదార్థాల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని, పిల్లలపై నిరంతరం పర్యవేక్షణ అవసరమని ఎమ్మెల్యే సూచించారు. విద్యార్థుల ముందు డ్రగ్స్ గురించి మాట్లాడా ల్సిన పరిస్థితి రావడం బాధాకరమైనా, వారి భవిష్యత్తు కోసం అవగాహన కల్పించడం అవసరమని అన్నారు. కార్పొరేట్ పాఠశాలల్లో చదివితేనే మంచి విద్య వస్తుందనుకోవడం సరైంది కాదని, మంచి ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల ప్రోత్సాహం, విద్యార్థుల కృషే విజయానికి మూలమని చెప్పారు. ఇటీవల పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రతిభ కనబర్చడం ఇందుకు నిదర్శనమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విద్యార్థుల భవిష్యత్తు కోసం సమగ్ర ప్రణాళికతో పనిచేస్తున్నారని పేర్కొన్నారు. విద్యార్థుల విద్యా ప్రగతిని తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు లీప్ యాప్ అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. వానపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు విద్య, క్రీడల్లో సాధించిన విజయాలను ఎమ్మెల్యే అభినందించారు. టెన్నికాయిట్ జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థినికి ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. పాఠశాలలో సైకిల్ స్టాండ్ నిర్మాణంతో పాటు గ్రౌండ్ లెవెలింగ్ పనులు త్వరలో చేపడతామని హామీ ఇచ్చారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు.

## ప్రభుత్వ సేవలను ప్రజలకు చేరువ చేసేందుకే ప్రజా దర్బార్

కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు



ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట.

ప్రభుత్వ సేవలను ప్రజలకు చేరువ చేసే కార్యక్రమమే ప్రజా దర్బార్ అని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. శు క్రవారం వానపల్లిలో ఎమ్మెల్యే బండారు ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విశేష స్పందన లభిం చింది. అధిక సంఖ్యలో ప్రజలు హాజర య్యారు. ఎమ్మెల్యే ప్రజల నుంచి వినతులు, అభ్యర్థనలు స్వీకరించారు. ప్రజలు నేరుగా తనను కలుసుకుని తమ సమస్యలను తెలియజేయడానికి ప్రజా దర్బార్ కార్యక్ర మం ఉపయోగపడుతుందని, ప్రజలు తమ దృష్టికి తెచ్చిన ప్రతి సమస్యను పరిష్కరించేం దుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. మొత్తం 58 వినతులు అందాయి. పలు సమస్యలను అక్కడికక్కడే అధికారులతో మాట్లాడి పరిష్క రించారు. మిగిలిన అర్జీలు త్వరగా పరిష్కారం అయ్యే విధంగా చూడాలని అధికారులను ఆదేశించారు.

## ఘనంగా తల్లిదండ్రులు ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం


ప్రజా భూమి ప్రతినిధి-కూనవరం..



మండలంలోని జిల్లా పరిషత్ హై స్కూల్ రాష్ట్ర ప్రభుత్వం వారు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ 4.0 జూలై 24, 2026 శుక్రవారం నాడు ప్రధానోపా ధ్యా యులు సిహెచ్ అప్పారావు ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించబడినది . ఈ కార్యక్రమంలో భాగంగా తల్లిదండ్రులు వారి పిల్లల పురోగతి తరగతి ఉపాధ్యాయుల నుండి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో 2025. 26 సంవత్సరంలో పదో తరగతిలో 500 మార్కులు దాటిన అయిదుగురు విద్యా ర్థులకు ప్రధానోపాధ్యాయులు తనవంతుగా ఒక్కొక్కరికి 2000 రూపాయలు చొప్పున నగ దు బహుమతి అందించారు. అదేవిధంగా స్కూల్ కమిటీ చైర్మన్ ఒక్కొక్కరికి 500 రూపా యలు నగదు బహుమతి అందించారు. అదేవి ధంగా సిహెచ్ కాంతారావు ప్రతిభ చూపిన విద్యార్థులకు 5000 రూపాయలు అందించా రు .విజయ సాధన పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ శ్రీనివాస్ ప్రతిభ చూపిన విద్యార్థులకు తను వంతుగా 5116 రూపాయలు అందించా రు.అదేవిధంగా కే సురేష్ 3000 రూపాయ లు, కే రవి 2000 రూపాయలు నగదు బహు మతిగా అందించారు. అదేవిధంగా 2005. 2006 విద్యా సంవత్సరంలో చదివిన పూర్వపు విద్యార్థులు స్కూలు కోసం ప్రింటర్ అందించడం జరిగింది. గ్రామ ప్రజలు, పంచాయతీ సిబ్బంది, వైద్య సిబ్బంది, యం డి యం సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## వాలీబాల్ గేమ్ లో గోల్డ్ మెడల్ సాధించిన కార్తిక్‌కు ఆర్. ఎస్. ఎస్. సన్మానం

ప్రజాభూమి ప్రతినిధి-తాళ్లపూడి



తాళ్లపూడి మండలం తాడిపూడి గ్రామానికి చెందిన వేములూరి కార్తీక్ 2026 లో స్టేట్ మీట్ బీచ్ వాలీబాల్ గేమ్ లో గోల్డ్ మెడల్ సాధించి, తదుపరి నేషనల్ ఆడడం జరిగిందని, మరియు 2026 ఏ వి సి ఆసియాన్ వాలీబాల్ ఛాంపియన్ లో ఇండియా అండర్ 18 బాలురు టీమ్ లో స్థానం సంపాదించి చైనా లో అండర్ -18 బాలుర ఛాంపియన్ ఇండియా టీమ్ తరుపున ఆడి మన మండలానికి దేశానికి గర్వకారణం గా నిలిచాడని ఆర్. ఎస్. ఎస్. ప్రతినిధి బొర్ర శ్రీరామ్ మూర్తి పేర్కొన్నారు. ఇలాంటి ప్రతిభ ఉన్న క్రీడాకారులను ప్రోత్సహించడం మన భాధ్యత గా భావించి రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ తాళ్ళపూడి వారి ఆధ్వర్యంలో అతనిని శాలువాతో మరియూ పూల మాలతో సత్కరించి 4500/- ఆర్థిక సహాయం అందచేయటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో అడ్డా శ్రీరామ్ మోహన్, చింతపల్లి శివ,రామకృష్ణ మాస్టారు తదితరులు పాల్గొన్నారు.

# రెండు పంటలకు సాగు నీరు అందించడమే ప్రభుత్వం లక్ష్యం

- వేగేశ్వరపురం ఎత్తిపోతల పథకం అధ్యక్షుడిగా కైగాల శ్రీనివాస్ బాధ్యతల స్వీకరణ
- ఎత్తిపోతల పథకాల అభివృద్ధికి రూ.32 కోట్లు ప్రతి పాదనలు : ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు



ప్రజాభూమి ప్రతినిధి-తాళ్లపూడి

తాళ్లపూడి మండలం వేగేశ్వరపురం ఎత్తిపోత ల పథకం అధ్యక్షుడిగా కైగాల శ్రీనివాస్ బాధ్య తలు స్వీకరించారు. ఈ కార్యకమానికి ముఖ్య అతిధిగా కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటే శ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు వేగేశ్వర పురం మాట్లాడుతూ ఎత్తిపోతల పథకం ద్వారా 7 నుంచి 8 గ్రామాలకు చెందిన రైతు లకు సాగునీరు అందుతున్నట్లు తెలిపారు. రైతులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రెండు పంటలు సాగు చేసుకునే విధంగా సాగునీటి సరఫరా చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. కొవ్వూరు నియోజకవర్గ పరిధిలో ఐదు నుంచి ఆరు ఎత్తిపోతల పథకాలు ఉన్నాయని, వాటిలో కొన్ని మరమ్మతులు అవసరమైన పరిస్థితిలో ఉన్నాయని తెలిపారు. ఎత్తిపోతల పథకాల సమస్యలను పెండ్యాల అచ్చిబాబు సహకారంతో ఆంధ్రప్రదేశ్ ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వం రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని నియోజకవర్గంలోని ఎత్తిపోతల పథకాల అభివృద్ధి, మరమ్మతుల కోసం రూ.32 కోట్లలతో ప్రతిపాదనలు పంపినట్లు తెలిపా రు. రైతులు సక్రమంగా నీటి తీరువా కట్టి పంపింగ్ స్కీమ్ అభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే కోరారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులతో రైతులకు శాశ్వతంగా సాగునీటి సమస్యలు పరిష్కారమై వ్యవసాయ ఉత్పత్తి మరింత పెరుగుతుందని అధ్యక్షులు ఆశాభావం వ్యక్తం చేశారు.

నూతనంగా హడాక్ కమిటీ అధ్యక్షునిగా ఎన్నికైన కైగాల శ్రీనివాస్ మాట్లాడుతూ నాపై ఎంతో నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన కొవ్వూరు టిడిపి నాయకులు పెండ్యాల అచ్చిబాబు, ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు గార్లకు ధన్యవాద ములు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో రైతులు ఇరిగేషన్ ఈ ఈ గురవయ్య, కాకర్ల శ్రీనివాస్, టిడిపి మండల అధ్యక్షుడు సిద్దా దుర్గారావు, బిజెపి మండల అధ్యక్షుడు ఇందుగుల రామకృష్ణ, అన్నమరెడ్డి సత్తిబాబు, గన్నిన సత్తిబాబు, వెంపా నాగేశ్వర రావు, బోడపాటి గంగరాజు పోతుల దుర్గా ప్రసాద్, దేవన సత్యనారాయణ, తైలం బాబ్జి, మద్దుకూరి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

### పోష్ చట్టం అమలుపై సమీక్ష నిర్వహించిన

# ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ

ప్రజాభూమి ప్రతినిధి-అమలాపురం





ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌ప ర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ శుక్రవారం నాడు జిల్లా కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో పని ప్రదేశాలలో మహిళలపై లైంగిక వేధింపు ల నిరోధక చట్టం - 2013 అమలుపై పీడీ కె. నాగమణి అధ్యక్షతన జిల్లా స్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి కార్యాలయం, సంస్థ, విద్యాసంస్థలో మహిళలకు సురక్షితమైన, గౌరవప్రదమైన, వివక్షలేని పని వాతావరణం కల్పించడం ప్రతి సంస్థ యొక్క బాధ్యత అని పేర్కొన్నారు. పది మంది లేదా అంతకంటే ఎక్కువ మంది ఉద్యోగులు ఉన్న ప్రతి సంస్థలో తప్పనిసరిగా అంతర్గత ఫిర్యాదుల కమిటీ ఏర్పాటు చేసి, చట్ట నిబంధనలకు అనుగుణం గా సమర్థవంతంగా నిర్వహించాలని సూచిం చారు. ఐసీసీలు కేవలం పేరుకే కాకుండా సమర్థవంతంగా పనిచేయాలని, ఉద్యోగులకు పోష్ చట్టంపై అవగాహన కార్యక్రమాలు నిర్వ హించాలని, కమిటీ వివరాలను కార్యాల యాలలో ప్రదర్శించాలని, ఫిర్యాదుల గోప్యత ను కాపాడుతూ నిర్ణీత కాలవ్యవధిలో విచారణ పూర్తి చేయాలని ఆమె అధికారులను ఆదేశిం చారు. అలాగే, కేంద్ర ప్రభుత్వం రూపొందిం చిన ఎస్‌హీ-బాక్స్ ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా మహిళలు కార్యాలయాలలో ఎదురయ్యే లైంగిక వేధింపులపై ఫిర్యాదులు నమోదు చేసుకోవచ్చని, ప్రతి ఉద్యోగికి ఈ పోర్టల్‌పై అవగాహన కల్పించాలని సూచించారు. సమీక్ష సమావేశంలో జిల్లా అధికారులు పోష్ చట్టం అమలు పురోగతిని వివరించారు. కొనసీమ జిల్లాలో ఇప్పటివరకు 1039 అంతర్గత ఫిర్యాదుల కమిటీలు చట్టం ప్రకారం ఏర్పాటు చేయబడినట్లు తెలిపారు. ప్రతి కమిటీలో ప్రిసైడింగ్ ఆఫీసర్, మహిళా సభ్యులు, ఇతర సభ్యులు మరియు బాహ్య సభ్యులు నియమిం చబడినట్లు వెల్లడించారు. ఇప్పటివరకు జిల్లాలో ఎటువంటి పోష్ ఫిర్యాదులు నమోదు కాలేదని అధికారులు తెలిపారు.

జిల్లాలో ఐసీసీల ఏర్పాటు మరియు పోష్ చట్టం అమలులో తీసుకుంటున్న చర్యలను డాక్టర్ రాయపాటి శైలజ అభినందిస్తూ, అన్ని శాఖలు నిరంతరం సమీక్షలు నిర్వహించి, ఉద్యోగులకు శిక్షణ, అవగాహన కార్యక్రమాలు చేపట్టి, మహిళలకు భద్రతతో కూడిన పని వాతావరణాన్ని కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్ సలహాదారు ఆర్. సుయాజ్ మరియు జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్‌ఓ) శ్రీ పి. సుబ్బారావు పాల్గొన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధికారులు, వివిధ ప్రభుత్వ శాఖల అధిపతులు, ఐసీసీ ప్రిసైడింగ్ అధికారులు, సభ్యులు, విద్యాసంస్థల ప్రతినిధులు మరియు ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఆనెం సాయి హత్య కేసు దర్యాప్తుకు ఐపీఎస్ అధికారితో ప్రత్యేక బృందం ఏర్పాటు చేయాలి: మందకృష్ణ మాదిగ

ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట.



ఇటీవల సంచలనం సృష్టించిన ఆనెం సాయి హత్య కేసులో బాధిత కుటుంబాన్ని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగ శుక్రవారం పరామర్శిం చారు. కుటుంబ సభ్యులను కలిసి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకుని ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ ఆనెం సాయి హత్య అత్యంత దుర దృష్టకర ఘటన అని పేర్కొన్నారు. కేసులో నిందితులపై కఠిన చర్యలు తీసుకుని బాధిత కుటుంబానికి త్వరితగతిన న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి ఎమ్మార్పీఎస్ అన్ని విధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ హత్య కేసు దర్యాప్తు కోసం ఐపీఎస్ అధికారి ఆధ్వర్యంలో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పా టు చేసి, సమగ్ర విచారణ నిర్వహించాలని అధికారులను కోరారు. కేసులోని అన్ని వాస్తవాలను వెలికితీసి, దోషులను చట్టం ముందు నిలబెట్టి కఠినంగా శిక్షించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. అదేవిధంగా బాధిత కుటుంబానికి తగిన నష్టపరి హారం అందించడంతో పాటు వారి భద్రతకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ పరామర్శ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా, నియోజకవర్గ, మండల నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, గ్రామస్థులు, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## శాకాంబరి దేవిగా కనకదుర్గ అమ్మవారు

ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట.



కొత్తపేట మారుతి సెంటర్లో వేంచేసి ఉన్న కనకదుర్గ అమ్మవారిని శుక్రవారం శాకంబరీ దేవిగా అలంకరించారు. ప్రతి ఏడాది ఆషాడ మాసంలో అమ్మవారిని సాకాంబరిగా అలంకరించటం ఆనవాయితీ. అదే క్రమంలో ఆషాడ మాసం శుక్రవారం సందర్భంగా ఈరోజు భక్తులు సహకా రంతో కమిటీ సభ్యులు కనకదుర్గ అమ్మవారిని వివిధ రకాల కాయగూ రలు, ఆకుకూరలు పం డ్లు,డ్రై ఫ్రూట్స్ వంటి వాటితో అమ్మవారిని శాకంబరీ దేవిగా అలంకరించారు. ఆలయ అర్చకులు పుల్లేరికుర్తి కృష్ణ శర్మ పూజాది కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. సాయంత్రం లలితా పారాయణం జరుపుతారని అర్చకులు తెలిపారు. ఉదయం నుండి అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## తల్లిదండ్రుల ఉపాధ్యాయుల ఆత్మీయత సమావేశం 4.0.



ప్రజాభూమి ప్రతినిధి-వి.ఆర్.పురం.

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ ఎస్ సాయి రమణ అధ్యక్ష తన శుక్రవారం తల్లిదండ్రులు ఉపాధ్యాయుల ఆత్మీయత సమావేశం 4.0 ఉత్సాహంగా కార్యక్ర మాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి తల్లిదండ్రులు ఉపాధ్యాయుల మధ్య సమన్వయం ఎంతో అవసరమని అన్నారు. విద్యార్థులకు చదువుతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు, సమయపాలన, పరిశుభ్రత వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఇంటి వద్ద పిల్లల చదువుపై తల్లిదండ్రులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని, మొబైల్ ఫోన్ల వినియోగాన్ని నియంత్రించి చదువుకు అనుకూలమైన వాతావరణాన్ని కల్పించాలని కోరారు. విద్యార్థుల హాజరు శాతం పెరగడంతో పాటు ప్రతి రోజు సమయానికి పాఠశాలకు పంపించాలని తెలిపారు. విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపా యాలను సద్వినియోగం చేసుకుని చదువుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. క్రమశిక్షణ, కృషి, పట్టుదలతో విద్యను అభ్యసిస్తే జీవితంలో ఉన్నత స్థానాలను చేరుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి ముత్యాల రామారావు, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు ముల కాల సాయి కృష్ణ, జనసేన వీర మహిళ బి ప్రమీలరాణి , అంజన రావు , పి పవన్ కళ్యాణ్, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆర్.ఆర్. హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

- 200 మందికి ఉచితంగా మందులు, రక్త పరీక్షలు




ప్రజాభూమి ప్రతినిధి-తాళ్లపూడి

గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో శ్రీ ఆర్.ఆర్. మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో అన్నదేవరపేట గ్రామంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేయడంతో పాటు రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా హాస్పిటల్ డాక్టర్ ఆర్. రవికుమార్ రెడ్డి మాట్లాడుతూ, పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను చేరువ చేయాలనే ఉద్దేశంతో గ్రామీణ ప్రాంతాల్లో ఇటువంటి ఉచిత వైద్య శిబిరాలను నిర్వహి స్తున్నట్లు తెలిపారు. హాస్పిటల్ మేనేజింగ్ పార్ట్నర్ అల్లూరి విక్రమాదిత్య మాట్లాడుతూ, ఆరోగ్య సేవలు ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశామని చెప్పారు. అలాగే రాజమండ్రి గౌతమి నేత్రాలయం సహకారంతో ఉచిత కంటి పరీక్షలు నిర్వ హించి, అవసరమైన వారికి తదుపరి చికిత్సపై సూచనలు అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్ర మంలో పైడిమెట్ట ఎత్తిపోతల పథకం అధ్యక్షులు ముళ్ళపూడి శ్రీరామచంద్రమూర్తి, కోటారు జగపతి, కూచిపూడి గణపతి, చెవ్వూరి బంగారురాజు, చెవ్వూరి రాము, వెలుగుబంటి బాలకృష్ణ, రాఘు, కవల రామాంజనేయులు, ఇంజరపు అబ్బులు, వెలగ శ్రీరామమూర్తి, సాయిబాబా, పోసిన పటేల్, పోసిన నాగార్జున, క్యాంపులో సేవలందించిన డాక్టర్ ఆర్. సూరిబాబు, చింటూ, పీఆర్వోలు సాగర్, రాజు, వెంకట్, గౌతమి నేత్రాలయం ప్రతినిధులు వల్లి, గోపి తదితరులు పాల్గొన్నారు. ఉచిత వైద్య శిబిరం ద్వారా గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో ప్రయోజనం పొందగా, నిర్వాహకులకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని ఎంచుకొని లక్ష్యసాధన దిశగా ముందుకు వెళ్లాలి

- తల్లిదండ్రులు గర్వించే విధంగా విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలి • రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి పెద్దపీట
- ప్రభుత్వ పాఠశాలలలో ప్రైవేటు పాఠశాలలకు దీటుగా మౌలిక వసతులు
- పదవ తరగతి విద్యార్థులు 100% ఉత్తీర్ణత సాధించాలి • పండుగ వాతావరణంలో మెగా పీటీఎం
- తల్లిదండ్రులు గురువులతో పాటు విద్యార్థుల అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలి జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్

ప్రజాభూమి, ప్రతినిధి అనంతపురం

ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని ఎంచుకొని ఆ లక్ష్యసాధన దిశగా ముందుకు వెళ్లినట్లయితే అనుకున్నది సాధించవచ్చునని జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ పేర్కొన్నారు. శుక్రవారం గార్లదిన్నె జిల్లా పరిషత్ పాఠశాలలో తల్లి తండ్రుల ఆత్మీయ సమావేశం మెగా పిటిఎం 4.0 కార్యక్రమం అత్యంత ఘనంగా పండుగ వాతావరణంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఇప్పటి నుంచే ఒక లక్ష్యాన్ని ఎంచుకొని ఆ లక్ష్యసాధన దిశగా ముందుకు వెళ్లి తల్లిదండ్రులు గర్వించే విధంగా ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి అధిక నిధులు ఖర్చు చేస్తూ పెద్దపీట వేయడం జరుగుతోందన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలలో ప్రైవేటు పాఠశాలలకు దీటుగా అన్ని మౌలిక వసతులు కల్పించడం జరిగిందన్నారు. ఈసారి పదవ తరగతి పరీక్షలలో విద్యార్థులు మంచి మార్కులతో 100% ఉత్తీర్ణత సాధించాలన్నారు. నేడు పండుగ వాతావరణంలో మెగా పీటీఎం నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందని తల్లి దండ్రులు కూడా గురువులతో పాటు విద్యార్థుల విద్యాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలన్నారు. మెగా పేరెంట్ టీచర్ సమావేశం ఏర్పాటు చేయడం వల్ల తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు





మధ్య సహృద్భావం ఏర్పడుతుందన్నారు. మరియు తల్లిదండ్రులకు తమ పిల్లల విద్యా స్థాయి, స్పోర్ట్స్ తదితర అంశాలలో ఏ విధమైన స్థాయిలో తమ పిల్లలు ఉన్నారని ఒక అవగాహన కలుగుతుందన్నారు. తల్లిదండ్రులు కూడా పిల్లలు ఇంటికి వచ్చిన తర్వాత వారు హోమ్ వర్క్, స్టడీ చేసేలా చూడాలన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు పుస్తకాలు, సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్, షూ, యూనిఫాం, పుస్తకాలు, బ్యాగ్ తదితర వాటిని అందించడం జరుగుతోందన్నారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా మంచి నాణ్యమైన, రుచికరమైన భోజనం ఇవ్వడం జరుగుతుందన్నారు. తల్లికి వందనం పథకం ద్వారా కుటుంబంలో ఎంత మంది చదువుకుంటున్న విద్యార్థులు ఉంటే వారందరికీ ఏడాదికి రూ.15 వేల చొప్పున విద్యార్థుల తల్లుల అకౌంట్ కు జమచేసి విద్యను ప్రోత్సహిస్తోందన్నారు. నేను చదువుకునే సమయంలో సివిల్స్ రాయాలనే కోరిక ఉండేదని నేను ఆ రంగంలో రాణించాలనే ఒక గట్టి పట్టుదలతో ముందుకు వెళ్లడం వల్ల సివిల్స్ పరీక్షలు పాసై కలెక్టర్ ను అయ్యానన్నారు. విద్యార్థులకు కూడా ఒక్కొక్కరికి ఒక్కో నైపుణ్యం ఉంటుందని, మీ నైపుణ్యాలకు పదును పెట్టి ముందుకు వెళ్ళినట్లయితే అనుకున్నది సాధించవచ్చునన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలో అన్ని మౌలిక వసతులు కల్పించి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో మన జిల్లాలో ఈసారి 4,000 మంది విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల నుంచి ప్రభుత్వ పాఠశాలలలో చేరడం జరిగిందన్నారు. అదేవిధంగా రాష్ట్ర వ్యాప్తంగా లక్ష మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చేరారన్నారు. విద్యార్థుల చదువు, విద్యా సామాగ్రి, భోజన సదుపాయం మెరుగ్గా ఉండేందుకు స్కూల్ మేనేజ్మెంట్ కమిటీల పర్యవేక్షణలో ముందుకు వెళ్లడం జరుగుతుందన్నారు. తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశం సందర్భంగా విద్యార్థినిలు వారి తల్లిదండ్రులకు పూలతో పాదాభివందనం చేయగా తమ పిల్లలను తల్లిదండ్రులు ఆశీర్వదించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు తమ పాఠశాలకు హిందీ ఉపాధ్యాయుల కొరత ఉందని, ప్రహరీ గోడ నిర్మించాలని, ప్లే గ్రౌండ్ చదును చేయించాలని మంచినీటి సమస్య పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ను కోరారు. ఈ సమస్యలన్నీ పరిష్కరిస్తామని జిల్లా కలెక్టర్ వారికి తెలిపారు. కలెక్టర్ చేతుల మీదుగా మెమెంటో ప్రశంసా పత్రం అందుకున్నారు. పి రాహుల్ గార్లదిన్నె జిల్లా పరిషత్ హైస్కూల్ లో 9వ తరగతి చదువుతున్న పి రాహుల్ అనే దివ్యాంగ విద్యార్థి స్టేట్ ఒలంపిక్స్ 400 మీటర్స్ లో గోల్డ్ మెడల్, 100 మీటర్స్‌లో సిల్వర్ మెడల్, సాధించడంతో జిల్లా కలెక్టర్ అతనికి మేమేంటో, ప్రశంసా పత్రం అందజేసి సన్మానించారు. గార్లదిన్నె గ్రామానికి చెందిన హనుమంతరావు, గౌరమ్మ దాతలు జిల్లా పరిషత్ పాఠశాలలో దాదాపు రూ 40 లక్షలతో ఒకేసారి 250 మంది భోజనం చేయడానికి సరిపడే విధంగా విశాలమైన భోజన శాలను నిర్మించారని ప్రధాన ఉపాధ్యాయులు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం పాఠశాల ప్రగతి నివేదికను చదివి సభకు వినిపించారు. ఈ కార్యక్రమంలో ఏడిసిసి బ్యాంకు చైర్మన్ కేశవరెడ్డి, మండల విద్యాశాఖ అధికారి తారచంద్ర నాయక్, జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు సుంకన్న, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వజ్రకరూరు మండల కేంద్రంలోని కెవి.జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం మంత్రి పయ్యావుల కేశవ్..

ప్రజాభూమి, ప్రతినిధి అనంతపురం

గత ప్రభుత్వం పాలనలో పూర్తిగా అప్పుల్లోకి నెట్టారు..10 లక్షల కోట్లు అప్పులు ఇచ్చారు.. ఇప్పుడు నేను అప్పులు చేయాల్సిన పరిస్థితుల్లోకే ప్రభుత్వాన్ని నెట్టిపోయారు.. అప్పుల సంసారాన్ని నడపడానికి నాకు స్ఫూర్తి తల్లే మొట్టమొదటి గురువు ఎవరికైనా కూడా తల్లే అనేటువంటిది తాము గుర్తించాం కాబట్టే, ఈరోజు ఈ పథకానికి 'తల్లికి వందనం' పేరుతో పెట్టాం.. మంత్రి నారా లోకేష్ గారు ఈ రంగంలో మార్పులు తెస్తున్నారు. నాకు కూడా గురువు మా అమ్మే.. రాజకీయంగా మా నాన్న వారసత్వం వచ్చి ఉండొచ్చు గానీ.. మనిషిగా తయారు కావడంలో నా తల్లి పాత్ర అద్భుతం, బ్రహ్మండం గవర్నమెంట్ స్కూల్లో చదివే పిల్లలు ప్రైవేట్ స్కూళ్ల కన్నా గొప్పగా తయారు చేయాలనేటువంటి దానితో మేము పనిచేస్తా ఉన్నాం మంత్రి నారా లోకేష్ మనసు పెట్టి ఈరోజు విద్యాశాఖ మీద పనిచేస్తున్నారు.. మంత్రిని నేను ప్రత్యేకంగా అభినందిస్తున్నా.. నారా లోకేష్ విద్యా శాఖల్లో సమూలంగా మార్పులు తీసుకొస్తున్నారు. మంత్రి ఉరవకొండ నియోజకవర్గంలో 87 గదులు తక్కువ ఉన్నాయి. అన్ని మనము మంజూరు చేసుకున్నాం. నిర్మాణం మొదలు పెట్టేది మాత్రమే మిగిలింది.. గదులకు 12-14 కోట్ల రూపాయలు మనం ఇప్పుడు విడుదల చేశాం. అంగన్వాడీ కేంద్రాలు





నిర్మాణానికి 7 కోట్ల రూపాయలు మంజూరు చేశాము. నేను ఎంత దూరంలో ఉన్నా, నా మనసు మాత్రం ఉరవకొండ అభివృద్ధి మీదే ఉంటుంది. ఎల్.నినో నేపథ్యంలో ఈసారి దేశం మొత్తం కూడా కరువు. ఏ పేరు పెట్టినా కూడా భయంకరమైన కరువు.. తాగునీళ్ల ఎక్కడ నుంచి ఇవ్వాలి అనేటువంటి ఇబ్బందికరమైన పరిస్థితి హంద్రీ-నీవా కాలువలో వేగంగా పనులు చేసాం.. 100 రోజుల్లోనే 6 పంపులు పనిచేసే దగ్గర నుంచి 12 పంపులు పనిచేసే స్థాయికి హంద్రీ-నీవాను తీసుకుపోయాం.. పోయిన ఏడాది బ్రహ్మండంగా నీళ్లు ఇచ్చాం.. శ్రీశైలం నుంచి ఇక్కడికి నీళ్లు తెచ్చేదానికి కాలువ వెడల్పు చేశాం.. 12 మోటార్లు అంటే పూర్తి స్థాయిలో నీళ్లు తీసుకొచ్చేందుకు ఇప్పుడు సిద్ధం చేశాం. ఈరోజు సీఎం చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఉరవకొండ మీద ప్రత్యేకంగా కరుణ చూపించి, మనకొక సపరేట్ ప్యాకేజీ 300 పైన కోట్లతో శాంక్షన్ చేశారు. ప్రతి గ్రామానికి కూడా డ్యామ్ నుంచి డైరెక్ట్‌గా నీళ్లు వస్తాయి. ప్రతి ఇంటికీ కొళాయి ఏదైతే ఎలక్షన్‌లో చెప్పామో, దాన్ని కూడా అతి తొందర్లోనే ప్రారంభం చేస్తాం. రెండేళ్లు పట్టింది, ఒకవైపు రాష్ట్రాన్ని సరిదిద్దుకునే ప్రయత్నం చేస్తున్నాం...అప్పుల సంసారంలో కష్టాలు పడుతూనే, అప్పులు చేస్తూనో, అభివృద్ధిని మాత్రం ఎక్కడా కూడా తక్కువ చేయకుండా తీసుకొచ్చాం. ఉరవకొండలో అభివృద్ధికి ఏమేం హామీలిచ్చామో దాదాపు అన్నీ పూర్తి చేసేస్తామన్న నమ్మకం మాకొచ్చింది.. ఇరిగేషన్ కెనాల్స్ పూర్తి చేస్తున్నాం, రోడ్లేస్తున్నాం.. అప్పుడు 'తల్లికి వందనం', 'అన్నదాత సుఖీభవ' ఇవ్వచ్చు... రాష్ట్ర ప్రభుత్వ ఆదాయాల్ని ఇప్పుడు ఇప్పుడే పెంచుకోగలుగుతున్నాం. ఒక 10 శాతం పెంచుకోగలుగుతున్నాం. 'తల్లికి వందనం', 'అన్నదాత సుఖీభవ', ఉచిత బస్సు, గ్యాస్ సిలిండర్లు, ఎన్టీఆర్ వైద్య సేవ, రైతులకు డ్రిప్, రోడ్లు, ప్రాజెక్టులు, కాలువలు కావచ్చు... ఇటు పథకాలు అమలు, అటు అభివృద్ధి చేస్తున్నాం. పరిశ్రమలు రాష్ట్రంలోకి బ్రహ్మండంగా వస్తున్నాయి.. ఉరవకొండలో పరిశ్రమల ఏర్పాటుకు పట్టువదలని విక్రమార్కుడి లాగా పనిచేస్తున్నా.. పరిశ్రమలు వస్తే కనీసం ముందు మనకు ఉద్యోగాలు వస్తాయి. మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ లో టీచర్లు, పిల్లలు, తల్లులు పాల్గొన్నారు. రెండేళ్లలో నా ప్రోగ్రెస్ రిపోర్ట్ మీకు ఇస్తున్నా.. రెండేళ్లలో ఉరవకొండ నియోజకవర్గంలో నేను చేస్తున్నది ఇది, నేను చేయాలనుకుంటున్నది ఇది అనేటువంటిది ఈరోజు తల్లిదండ్రులు, టీచర్ల ముందు నా ప్రోగ్రెస్ రిపోర్ట్ మీ ముందు పెడతా ఉన్నాం. పిల్లలపై ఒత్తిడి పెంచొద్దండి... పిల్లలు బ్రహ్మండంగా చదువుతున్నారు, వారిని మోటివేట్ చేయండి.. సమస్యని పరిష్కారం చేసే శక్తి, సమస్యలకి తట్టుకొని నిలబడే శక్తి పల్లెల్లో చదివిన మన పిల్లలకి ఉంది. బ్రహ్మండంగా ఉంది.. మన పిల్లలు ఆణిముత్యాలు. వాళ్లని కొంచెం మనం గైడ్ చేయాలి.. మన పిల్లల్ని తయారుచేసుకునేదానికి అందరం కలిసి పనిచేయాలని ఈ 'మెగా పేరెంట్ టీచర్' పెట్టాం.. అందరం కూర్చొని ఒక ఆలోచనతో పోతే పిల్లోడి భవిష్యత్తు, పిల్ల భవిష్యత్తు బాగుంటుందనే ప్రధానమైనటువంటి ఉద్దేశంతో ఈ మెగా పేరెంట్ టీచర్ పెట్టాం.

# సమ సమాజ స్వాప్నికుడు జాషువా

ప్రజాభూమి, ప్రతినిధి అనంతపురం

జాషువా తన సాహిత్యం ద్వారా కుల పీడన, మతమౌఢ్యం, అస్పృశ్యత, సామాజిక దురన్యాయం లాంటి రుగ్మతలకు వ్యతిరేకంగా తన కలాన్ని, గలాన్ని వినిపించిన మహోన్నత సాహితీ శిఖరం అని వక్తలు కొనియాడారు. కవి కోకిల, కవి దిగ్గజం, మధుర శ్రీనాథ, నవయుగ కవి చక్రవర్తి, పద్మభూషణ్, డాక్టర్ మహాకవి గుర్రం జాషువా గారి 55 వ, వర్ధంతి సందర్భంగా "మహాకవి గుర్రం జాషువా సాహిత్య పీఠం" ఆధ్వర్యంలో అనంతపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రధాన గేటుకు ఎదురుగా ఉన్న మహాకవి గుర్రం జాషువా గారి విగ్రహానికి పుష్పమాలతో ఘనంగా నివాళులర్పించడం జరిగింది. మహాకవి గుర్రం జాషువా సాహిత్య పీఠం ఉపాధ్యక్షుడు శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం తెలుగు శాఖ అకడమిక్ కన్సల్టెంట్ డాక్టర్ నానీల నాగేంద్ర మాట్లాడుతూ, పేదరికం, వేదనాభరితమైన జీవితం నుండి సాహితీ శిఖరం గా ఎదిగిన జాషువా జీవితం ఎందరికో ఆదర్శమని, కుల మతాలు లేని, ఆర్థిక అసమానతలు లేని, సమ సమాజం కోసం నిరంతరం సాహిత్యాన్ని సృజించిన దార్శనికుడు జాషువా. గబ్బిలం, అనాథ, ముంతాజ్ మహల్, కొత్త లోకం, బాపూజీ, నేతాజీ, గిజిగాడు వంటి ఖండ కావ్యాల ద్వారా సమాజాన్ని జాగృత పరిచిన దార్శనికుడు, సమాజ అభివృద్ధికి సమ సమాజ నిర్మాణమే భూమిక పోషిస్తుందని, ఆర్థిక అసమానతలు లేని, కుల, మత పీడన లేని కొత్త లోకం ఏర్పడాలని ఆకాంక్షించిన స్వాప్నికుడు జాషువా అని కొనియాడారు. తెలుగు వెలుగు సాహిత్య, సామాజిక సేవా సంస్థ అధ్యక్షుడు టివి రెడ్డి, ఉమర్ అలీషా సాహితీ సంస్థ ఉపాధ్యక్షులు



డాక్టర్ జూటూరు షరీఫ్, తెలుగు అధ్యాపకులు డాక్టర్ పూజారి ఈరన్న ప్రసంగిస్తూ, ఆర్తి, ప్రతిఘటన, నిజాయితీ జాషువా సాహిత్యంలో కనిపిస్తాయి. జాషువా తన పద్యాలలో అపురూపమైన పదబంధాలను ఉపయోగించి తెలుగు భాషకు సొగసులు అద్దారు, జాషువా రచించిన పౌరాణిక, చారిత్రక, సాంఘిక నాటకాలలో మహిళల స్వేచ్ఛ కోరుకుంటూ, పురుషాధిక్యతలేని సమాజం ఏర్పడాలని, మహిళా పక్షపాతిగా నాటకాలు రచించాడని కొనియాడారు. సర్ అర్థర్ కాటన్ 127 వ వర్ధంతిని పురస్కరించుకొని, తెలుగు ప్రాంత ప్రజలకు, తమిళ ప్రాంత ప్రజలకు ఆయన చేసిన సేవలు చిరస్మరణీయం. రాజమండ్రి వద్ద గోదావరి నదిపై ధవలేశ్వరం ఆనకట్ట కట్టించి గోదావరి డెల్టాను సస్యశ్యామలం చేశారు. కృష్ణా నదిపై ప్రకాశం బ్యారేజీ నిర్మించి నీటిపారుదల వ్యవస్థను మెరుగుపరిచారు కర్నూలు కడప సాగునీటి కోసం కాలువలు నిర్మించిన మహనీయుడు కాటన్ దొర అని అలాగే తమిళనాడు ప్రజలకు కావేరి కొల్లిడం నదులపై పనులు చేయించి కరువు నివారణకు కృషిచేసిన మహోన్నతుడు సర్ అర్థర్ కాటన్ దొర అని ఆయన సేవలను కొనియా డడం జరిగింది. కార్యక్రమంలో విశాలాంధ్ర బుక్ హౌస్ సిబ్బంది పాటిల్ హరీష్, చెట్ల ప్రవీణ్, పి సాయి ప్రసాద్, డాక్టర్ ఈ. కమలాకర్ పాల్గొన్నారు.

# బంద్ ను అడ్డుకోవడం తగదు-ఐక్య విద్యార్థి సంఘాల నిరసన

ప్రజాభూమి, హిందూపురం టౌన్

నీట్ పేపర్ లీకేజీకి నిరసనగా స్వచ్ఛందంగా ప్రైవేట్ విద్యాసంస్థలు బంద్ ప్రకటిస్తే ప్రభుత్వ విద్యాసంస్థలు మాత్రం పోలీసులను కాపలా పెట్టుకుని బంద్ ను అడ్డుకోవడం దుర్మార్గపు చర్యని పిడిఎస్ యూ, ఏఐఎస్ఎఫ్, ఏఐఎస్ బి, ఏఐవైఎఫ్ విద్యార్థి సంఘాల నాయకులు పేర్కొన్నారు. పోలీసుల చర్యలను నిరసిస్తూ శుక్రవారం స్థానిక అంబేద్కర్ సర్కిల్ లో ఐక్య విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు నరసింహమూర్తి, బాబావలి, చంద్రశేఖర్ రెడ్డి, రాజా మాట్లాడుతూ, నీట్ పేపర్ లీకేజ్ పై శాంతియుతంగా బంద్ నిర్వహించారు నీట్ పేపర్ లీకేజ్ కు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ



మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. పేపర్ లీకేజీలతో విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేస్తున్న బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా బంద్ నిర్వహిస్తే, నిరసన తెలిపే హక్కును కాలరాస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నీట్ లీకేజ్ వల్ల దేశవ్యాప్తంగా 22 మంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటే, ప్రశ్నించిన వారిపై కేసులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.లిస్వచ్ఛందంగా బంద్ కు మద్దతు తెలిపిన ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు పోలీసులను కాపలా పెట్టుకుని బంద్ ను అడ్డుకున్నట్టు ఆరోపించారు. 2014 నుండి దేశవ్యాప్తంగా 152 పరీక్షా పేపర్లు లీక్ అయ్యాయని, రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు ఈ అంశంపై స్పందించలేదని పేర్కొన్నారు. విద్యార్థుల పక్షాన నిలబడాల్సిన రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి తొత్తుగా మారి అక్రమ అరెస్టులు చేయిస్తోందని నాయకులు విమర్శించారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, అరెస్టు చేసిన నాయకులను వెంటనే విడుదల చేసే వరకు ఉద్యమాలు కొనసాగిస్తామని హెచ్చరించారు. బిజేపీకి వత్తాసు పలుకుతున్న రాష్ట్ర ప్రభుత్వానికి రానున్న స్థానిక ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కమల్ భాషా, బద్రీనాథ్, నాగేంద్ర, పవన్, అనుదీప్, అరవింద్, మహేష్, అనిల్, నయీమ్ నందీష్, రయాన్, షాహిద్, అభి, మంజునాథ్, మోహన్, వెంకటేష్, వలిసాబ్, తదితరులు పాల్గొన్నారు.

# జీ.వో.నెం.396 రద్దు చేయాలి

## -దస్తావేఖరులను అన్ని విధాలా ఆదుకోవాలి

## -నిరసనకు మద్దతు పలికిన కాంగ్రెస్

ప్రజాభూమి, హిందూపురం టౌన్



దస్తావేజులేఖరులను ఇబ్బందులకు గురి చేస్తున్న జీవో నెంబర్. 396ను వెంటనే రద్దు చేయాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. దస్తావేజులేఖరులు చేస్తున్న నిరసనకు శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు జమీల్ ఆధ్వర్యంలో మద్దతు పలికి శిబిరంలో బైఠాయించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఎన్నోఏళ్లుగా దస్తావేజులేఖరులుగా పనిచేస్తూ పొట్ట పోసుకుంటున్న వారి పొట్ట కొట్టే దుర్మార్గమైన చట్టాన్ని కూటమి ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.వీరికి ప్రభుత్వం నుండి జీతం లేదు, ప్రోత్సాహకాలు, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత లేదు, పి.ఎఫ్. వంటి సౌకర్యాలు లేకపోవడం దురదృష్టకరమన్నారు. కేవలం సాంకేతికతను పెంచే నెపంతో తమ అనుచరులకు మైంటెనెన్సు కాంట్రాక్టులను ఇవ్వాలనే తపన తప్ప ప్రజలకు సులభతరమైన సేవ చేయాలని కాదన్నారు. నిజంగా ఉద్యోగాలు ఇచ్చేమనసే ఉంటే వాలంటీర్లను ఎందుకు తొలగించారని ప్రశ్నించారు. పీపీపీ విధానం రాష్ట్ర ప్రయోజనాలకు అభివృద్ధికి ఆటంకం అవుతుందే తప్ప ఏమాత్రం ప్రయోజనం ఉండదన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం పునరాలోచించి జీవో నెంబర్.396ను రద్దు చేసి దస్తావేజులేకరులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సబ్ రిజిస్ట్రార్ ని కలిసి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో,కాంగ్రెస్ నాయకులు యూనస్, అమానుల్లా, రవూఫ్ సాబ్, పీరుసాబ్, తిరుపాల్, ముబారక్, కోటిపన్న, నాగిరెడ్డి, సంజీవప్ప, దస్తావేజులేఖర్ల సంఘం నాయకులు హరీష్, లక్ష్మీనారాయణ, అతావుల్లా, బాలాజీ, జయరాం తదితరులు పాల్గొన్నారు.

## ప్రధానమంత్రి పంటల బీమా యోజన ప్రీమియం, బీమా మొత్తాన్ని ప్రభుత్వమే పూర్తిగా చెల్లించాలి

### - రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వీటీ రామాంజనేయులు

ప్రజాభూమి, పుట్లూరు.



ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మరియు ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘాల ఆధ్వర్యంలో పుట్లూరు మండల తహసిల్దార్ కి రైతుల సమస్యలపై వినతిపత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వీటి రామాంజనేయులు మాట్లాడుతూ, ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌లో రైతుల పరిస్థితి అత్యంత దయనీయంగా మారిందన్నారు. ఇప్పటికే రైతులు అప్పులు చేసి విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు కొనుగోలు చేసి సాగు పనులు ప్రారంభించారని, ప్రకృతి వైపరీత్యాలు, వర్షాభావం, అధిక వర్షాలు వంటి అనిశ్చిత పరిస్థితుల్లో రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం, పంటల బీమా పేరుతో రైతుల నుంచే ప్రీమియం వసూలు చేయడం అన్యాయమని విమర్శించారు.ప్రధానమంత్రి పంటల బీమా యోజన (పి ఎం ఎఫ్ బి వై)లో రైతుల నుంచి ఒక్క రూపాయి కూడా వసూలు చేయకుండా ప్రీమియం మరియు బీమా మొత్తాన్ని ప్రభుత్వమే పూర్తిగా భరించాలని ఆయన డిమాండ్ చేశారు. రైతులను ఆర్థిక భారం నుంచి గట్టెక్కించాలంటే ఈ విధానాన్ని వెంటనే అమలు చేయాలని కోరారు. అనేక మంది రైతులు నమోదు చేసుకోలేకపోయారని, గడువు పెంపు వల్ల వేలాది మంది రైతులకు ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం పుట్లూరు మండల గౌరవ అధ్యక్షులు బుసగాని చిన్ని కృష్ణుడు యాదవ్, అధ్యక్షులు ఎన్ గోపాలకృష్ణ, కార్యదర్శి సత్తార్ గోపాల్ యాదవ్, సహాయ కార్యదర్శి ఎం.చంద్రశేఖర్ యాదవ్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఎ.చిన్నకుల్లాయప్ప, కమిటీ నాయకులు బి.ఓబుల్ రెడ్డి, రైతులు నాగలింగేశ్వర్ రెడ్డి,వెంకట్రాముడు,చిన్న ఓబులపతి తదితరులు పాల్గొన్నారు.

## విధుల్లో ఉదాశీనత ఉపేక్షించం

### -జిల్లా ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఫైరోజ బేగం




ప్రజాభూమి, హిందూపురం టౌన్ ఆరోగ్యకేంద్రాల పరిధిలోని ప్రజలకు ఆరోగ్యశాఖ లక్ష్యాలను అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠినచర్యలు తీసుకోనున్నట్లు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఫైరోజాబేగం పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో హిందూపురం, పెనుకొండ నియోజక వర్గాల పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రభుత్వ పథకాలను అందించుటలోనూ విధుల నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలన్నారు. సిబ్బంది నిర్లక్ష్యం, ఉదాశీనత వుండకూడదని, ఆరోగ్యశాఖ లక్ష్యాలను అందించడంలో వైద్యాధికారులు, సిబ్బంది ముందుండాలని ఆదేశించారు. ప్రస్తుత వర్షాకాల సీజన్ లో సీజనల్ వ్యాధులు అరికట్టడంతో పాటు సుఖ ప్రసావాలపై దృష్టి సారించాలన్నారు. నిర్దేశించిన ప్రగతి లక్ష్యాలను నూరుశాతం సాధించాలని తెలిపారు. ఈ సమావేశం లో మాతాశిశు సేవలు, టీకాలు, ఆర్.సి.హెచ్, ఎన్.సి.డి. సర్వే తదితర కార్యక్రమాలతో పాటు ఆన్ లైన్ నిర్వహణపై సూచనలు చేశారు. అలాగే డెంగ్యూవ్యతిరేక మాసోత్సవం సందర్భంగా లార్వా నిల్వలు, దోమలనివారణ, కీటక జనిత వ్యాధులపై అప్రమత్త గురించి ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. జ్వర పీడుతులకు తక్షణవైద్య సేవలు అందేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ ఓ డాక్టర్ మంజువాణితో పాటు ఎన్టీఆర్ వైద్యశాల జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ శ్రీదేవి, డిపిఎంఓ డాక్టర్ పద్మజ, జిల్లా క్షయ నివారణధికారి డాక్టర్ అనుపమ, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ చెన్నారెడ్డి, ఎన్.సి.డి.జిల్లా అధికారి డాక్టర్ సునీల్, డిపిఓ నాగరాజు, ఏఎంఓ లక్ష్మి నాయక్, డిపిహెచ్ ఎన్ వీరమ్మ, సిహెచ్ఓ వన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ మద్యం రవాణాపై దృష్టి సారించాలి

### -ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ ఎస్.కే.డి.వి. ప్రసాద్

ప్రజాభూమి, హిందూపురం టౌన్



అక్రమ మద్యం రవాణాపై ప్రత్యేక దృష్టి సారించి అరికట్టాలని ఎక్సైజ్, ప్రొహిబిషన్ డిప్యూటీ కమిషనర్ ఎస్.కే.డి.వి. ప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని వివిధ రికార్డులను పరిశీలించి పెండింగ్ కేసుల వివరాలను క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. కేసుల దర్యాప్తు పురోగతి, చార్జ్‌షీట్ల తయారీ తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. అలాగే పెండింగ్‌లో ఉన్న వాహనాల కేసులను పరిశీలించి, నిబంధనల ప్రకారం వాటి క్లియరెన్స్ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. కేసులకు సంబంధించిన కెమికల్ శాంపిల్స్‌ను చిత్తూరు ల్యాబ్‌కు సకాలంలో పంపించాలని ఆదేశించారు. అలాగే కల్లు, ఇతర నమూనాలను నిబంధనల ప్రకారం సేకరించి పరీక్షలకు పంపించాలని అధికారులకు సూచించారు. అనంతరం సిబ్బందికి ఆయా అంశాలపై డిప్యూటీ కమిషనర్ తగిన సూచనలు, సలహాలు, మార్గదర్శకాలు చేశారు. విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉంటూ, అక్రమ మద్యం రవాణా, ఇతర ఎక్సైజ్ నేరాలను అరికట్టేందుకు సమర్థవంతంగా పనిచేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ.పృథ్వీరాజ్, హెడ్ కానిస్టేబుళ్లు రమణ, వెంకటేష్, నరసింహ, సతీష్, కానిస్టేబుళ్లు సుధాకర్ రెడ్డి, రంగధామ, ఆంజనేయులు, కుమార్, రవీంద్ర, శివకుమార్, విశాలాక్షి తదితరులు పాల్గొన్నారు.

# నల్లపురెడ్డిపల్లెలో ఘనంగా మెగా పేరెంట్స్ మీటింగ్ 4.0 కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టిడిపి ఇన్చార్జ్ బీటెక్ రవి

### విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు తల్లిదండ్రులు-ఉపాధ్యాయుల సమన్వయం అవసరం

ప్రజాభూమి,పులివెందుల





విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పులివెందుల టీడీపీ ఇన్చార్జ్, మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి అన్నారు. పులివెందుల మండలం నల్లపురెడ్డిపల్లె గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన మెగా పేరెంట్స్ అండ్ టీచర్స్ మీటింగ్ మెగా పేరెంట్స్ మీటింగ్ 4.0 కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పులివెందుల జడ్పీటీసీ మారెడ్డి లతారెడ్డి, సింహాద్రిపురం మాజీ జడ్పీటీసీ సభ్యుడు పోరెడ్డి ప్రభాకర్ రెడ్డి కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా బీటెక్ రవి పాఠశాలను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. విద్యార్థుల విద్యా ప్రగతి, పాఠశాలలో అందుతున్న సౌకర్యాలు, బోధన విధానంపై ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో చర్చించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో తల్లిదండ్రుల భాగస్వామ్యం అత్యంత కీలకమని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న మెగా పి టి ఎమ్ వంటి కార్యక్రమాలు పాఠశాలలు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల మధ్య సత్సంబంధాలు పెంపొందించడానికి దోహదపడతాయని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో పులివెందుల మండల టీడీపీ అధ్యక్షుడు మర్తల జగన్మోహన్ రెడ్డి, పుష్పనాథ్ రెడ్డి, పుష్పగిరి స్కూల్ కరస్పాండెంట్ ఓబుల్ రెడ్డి, యర్రబల్లె సింగిల్ విండో అధ్యక్షుడు ఈశ్వర్ రెడ్డి, యోగానంద రెడ్డి, జయరామిరెడ్డి, బాబురెడ్డి, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కొత్తమాధవరంలో వైభవంగా శ్రీ నడివీధి గంగమ్మ అమ్మవారి ఉత్సవాలు

- మూడురోజుల ప్రత్యేక పూజలు
- చండీ హోమం, కుంకుమార్చనలో మహిళల పూజలు



ప్రజాభూమి, సిద్ధవటం: సిద్ధవటం మండలం కొత్తమాధవరం గ్రామంలోని 1, 2, 3 వార్డుల్లో వెలసిన శ్రీ నడివీధి గంగమ్మ అమ్మవారికి మూడు రోజుల పాటు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామం సుభిక్షంగా ఉండాలని, సకాలంలో వర్షాలు కురిసి ప్రజలు ఆరోగ్యంగా, సిరిసంపదలతో జీవించాలని అమ్మవారిని ప్రార్థించినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. పురోహితులు కంభలూరు కోటేశ్వర శర్మ ఆధ్వర్యంలో మొదటి రోజు జలాభిషేకం, రెండో రోజు పెద్ద సంఖ్యలో మహిళలతో కుంకుమార్చన, చివరి రోజు చండీ హోమాన్ని వైదికంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేయగా, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీర్వాదాలు పొందారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# వైఎస్ వీఆర్ఎం ప్రభుత్వ బాలికల కళాశాలలో తల్లిదండ్రుల-అధ్యాపకుల సమావేశం

ప్రజాభూమి,పులివెందుల,




పట్టణంలోని వైఎస్ వీఆర్ఎం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో గురువారం తల్లిదండ్రులు-అధ్యాపకుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ బి. శ్రీనివాసులు అధ్యక్షత వహించారు. మొదట విద్యార్థినులు తల్లిదండ్రులకు సాదర స్వాగతం పలికారు. అనంతరం తల్లిదండ్రులను వారి పిల్లలతో కలిసి తరగతి గదుల్లో కూర్చోబెట్టి సమావేశం నిర్వహించారు. సమావేశంలో అధ్యాపకులు విద్యార్థినుల పురోగతిని తల్లిదండ్రులకు వివరించారు. కళాశాలలో ఉచిత పాఠ్యపుస్తకాలు, పోటీ పరీక్షల మెటీరియల్, సంకల్ప్ మెటీరియల్ ప్రదర్శనను తల్లిదండ్రులకు చూపించారు. తల్లిదండ్రుల కోసం వినోదాత్మక పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం ప్రధాన వేదిక వద్ద ప్రిన్సిపాల్ శ్రీనివాసులు మాట్లాడుతూ కళాశాల ఫలితాలు, సదుపాయాలను వివరించారు. గత సంవత్సరం ఫలితాల్లో మొదటి సంవత్సరం జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో తృతీయ స్థానం సాధించినట్లు తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినులను అభినందించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థినులు తల్లిదండ్రులకు పాదాభివందనం సమర్పించారు. పెద్దలు విద్యార్థినులకు విలువైన సందేశాలు అందించారు. సమావేశం అనంతరం తల్లిదండ్రులు, విద్యార్థినులు అందరూ డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు అనిత, నాగేంద్రమ్మ, సుధాకర్ రెడ్డి, రామసుబ్బయ్య, త్రివేణి చంద్రమౌళి, విజయభారతి, రామచంద్రా రెడ్డి, జయతి, సత్యవతి, సమత, బాల దస్తగిరి, రామయ్య, సునీత, రమాదేవి తదితర అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

# రాజీవ్ నగర్ పాఠశాలలో ఘనంగా మెగా పేరెంట్స్ మీటింగ్ 4.0

### తల్లులకు పాదపూజ చేసిన విద్యార్థులు -66 మందికి నోట్ పుస్తకాల పంపిణీ

ప్రజాభూమి,పులివెందుల



పులివెందుల మండలం రాజీవ్ నగర్ కాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మెగా పేరెంట్స్ మీటింగ్ 4.0 కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు . సరళదేవి ఆధ్వర్యంలో, ఉపాధ్యాయుడు అంగడి నాగేంద్ర సౌజన్యంతో పాఠశాలను రంగవల్లులతో, మామిడి తోరణాలు, అరటి ఆకులు, టెంకాయ పట్టలతో అందంగా అలంకరించారు. విచ్చేసిన మాతృమూర్తు లకు విద్యార్థులు పూలు చల్లి స్వాగతం పలికారు. అనంతరం విద్యార్థులందరూ తమ తల్లులకు "తల్లికి వందనం" కార్యక్రమంలో భాగంగా పాదపూజ చేసి ఆశీస్సులు తీసుకున్నారు. తల్లిదండ్రుల కోసం మ్యూజికల్ చైర్స్ పోటీలు నిర్వహించారు. తల్లిదండ్రుల సమావేశంలో ప్రధానోపాధ్యాయురాలు సరళదేవి మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి తల్లిదండ్రుల సహకారం అవసరమని కోరారు. ఉపాధ్యాయులు గౌతంరెడ్డి, అంగడి నాగేంద్ర మాట్లాడుతూ విద్యా విధానం, పిల్లల బాధ్యతల గురించి వివరించారు. ఇంటి వద్ద పిల్లలు ఏమి చేస్తున్నారో గమనించాలని, టీవీలు, ఫోన్లకు అతీతులు కాకుండా చూడాలని సూచించారు. ఈ సందర్భంగా దాత నేరేళ్ల శివప్రసాద్ 66 మంది విద్యార్థులకు దాదాపు 240 నోట్ పుస్తకాలను అందజేశారు. పోటీల్లో గెలుపొందిన మాతృమూర్తులకు బహుమతులు ప్రదానం చేశారు. చివరగా తల్లిదండ్రులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు అందరూ కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అంగడి నాగేంద్ర, గౌతంరెడ్డి, హేమలత, మాధవిలత, స్రవంతి, సీఆర్పీలు ఉమామహేశ్వరి, రామ్మోహన్ రెడ్డి, లైన్మెన్ శివశంకర్, అంగన్వాడీ సిబ్బంది, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# జెడ్పీ బాలుర పాఠశాలలో మెగా పేరెంట్స్--టీచర్స్ సమావేశం

### - కూటమి ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమానికి పెద్దపీట
### - టిడిపి మండల కన్వీనర్ రామముని రెడ్డి

ప్రజాభూమి, వేంపల్లె



స్థానిక పట్టణంలోని తలిశెట్టి సుబ్రహ్మణ్యం జిల్లా పరిషత్ (జెడ్పీ) బాలుర ఉన్నత పాఠశాలలో మెగా పేరెంట్స్--టీచర్స్ సమావేశం ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి పాఠశాల కమిటీ



చైర్మన్ బుజ్జి, తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ రామముని రెడ్డి, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్ లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రామముని రెడ్డి మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో ప్రభుత్వం తల్లికి వందనం, సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కానుక, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం, షైనింగ్ స్టార్, రైజింగ్ స్టార్ వంటి పథకాల ద్వారా విద్యార్థులను ప్రోత్సహిస్తోందని తెలిపారు. అలాగే పాఠశాలలో కొరతగా ఉన్న డైనింగ్ హాల్, తాగునీటి శుద్ధి సౌకర్యం, బాత్రూములు తదితర మౌలిక వసతులను కల్పించేందుకు అధికారుల దృష్టికి తీసుకెళ్లి సత్వర పరిష్కారానికి కృషి చేస్తానని, పూర్వ విద్యార్థిగా పాఠశాల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని చెప్పారు. అనంతరం మహమ్మద్ షబ్బీర్ మాట్లాడుతూ విద్యార్థులకు తల్లిదండ్రులు అందించే గొప్ప ఆస్తి విద్యేనని, పిల్లలను క్రమం తప్పకుండా పాఠశాలకు పంపిస్తూ వారి చదువుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల ఉపాధ్యక్షుడు పసుపులేటి వీరభద్ర, పట్టణ అధ్యక్షుడు నామా వేమకుమార్, ఉపాధ్యాయులు నాగసుబ్బా రెడ్డి, గోపాల్ నాయక్, వెంకట మోహన్, లత, వాణి, పద్మజ, అరవింద్, వసంతకుమారి, మేరీ, అంజనమ్మతో పాటు తల్లిదండ్రులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల అభ్యున్నతే పీటీఎం లక్ష్యం

### -: బాలిశెట్టి హరిప్రసాద్, కుప్పాల వెంకటసుబ్బయ్య

### సిద్ధవటం బెటాలియన్ జడ్పీ హైస్కూల్‌లో తల్లిదండ్రులు-ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం, 'తల్లికి వందనం' కార్యక్రమం



ప్రజాభూమి, సిద్ధవటం: సిద్ధవటం 11వ బెటాలియన్ ఆవరణలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన తల్లిదండ్రులు-ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం (పీటీఎం), 'తల్లికి వందనం' కార్యక్రమంలో టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు బాలిశెట్టి హరిప్రసాద్, రాష్ట్ర పంచాయతీ రాజ్ ఆర్గనైజేషన్ సెక్రెటరీ కుప్పాల వెంకటసుబ్బయ్య ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాలిశెట్టి హరిప్రసాద్ మాట్లాడుతూ, విద్యార్థుల విద్యా ప్రగతి, క్రమశిక్షణ, నడవడికను సమీక్షించడంలో పీటీఎం కీలక పాత్ర పోషిస్తుందన్నారు. విద్యార్థుల అభ్యున్నతి కోసం తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాల్సిన బాధ్యత ఉందని పేర్కొన్నారు. కుప్పాల మాట్లాడుతూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో రాష్ట్రంలో విద్యా రంగంలో సంస్కరణలు వేగంగా అమలవుతున్నాయని, విద్యా ప్రమాణాలు మెరుగుపడుతున్నాయని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన 'తల్లికి వందనం' పథకం ద్వారా విద్యార్థుల చదువుకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నారని, ఆ నిధులను పిల్లల విద్యాభివృద్ధికే వినియోగించాలని తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఏ. కృష్ణ, రాజంపేట అసెంబ్లీ అధికార ప్రతినిధి రామ్మోహన్ నాయుడు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యా కమిటీ చైర్మన్ బండి హరి, ఎంపిడిఓ మెహతాబ్ యాస్మిన్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# పార్ట్ టైం నుండి కాంట్రాక్టు పద్ధతిలోకి తీసుకోవాలి -ఎమ్మెల్సీ సతీమణికి వినతి

ప్రజాభూమి,పులివెందుల




పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో మెగా పేరెంట్స్, టీచర్స్ 4.0 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి సతీమణి భూమిరెడ్డి ఉమాదేవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. కష్టపడి చదివితే ఏదైనా సాధించవచ్చు అన్నారు. సెల్ ఫోన్లకు, మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలన్నారు. తల్లిదండ్రులకు మన ఏ విధంగా నడుచుకుంటున్నారో చూసుకోవలసిన బాధ్యత మనపై ఉందన్నారు. ఈ సందర్భంగా కళాశాలలో పనిచేస్తున్న పార్ట్ టైం ఉపాధ్యాయులు గత పది నుంచి పదిహేను సంవత్సరాలు గా పనిచేయడంజరుగుతుంది అని, కావున మాకు కేజీబీవీ స్కూల్స్ లో పార్ట్ టైమ్ నుంచి కాంట్రాక్టుకు కన్వర్ట్ చేయడం జరిగినది ఆమెకు వివరించారు. కావున మమ్ములను కూడా పార్టటైం నుంచి కాంట్రాక్టుకు మార్చే విధంగా మీ సహాయ సహకారాలు అందించాలన్నారు. ఇందుకు ఆమె స్పందిస్తూ మీ సమస్యను ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్తే ఆయన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లి మీకు న్యాయం జరిగే విధంగా చూస్తారన్నారు.

# ముళ్ల పొదలతో రహదారి మూసుకుపోయి ప్రజలకు ఇబ్బందులు

ప్రజాభూమి, సిద్ధవటం: మండలంలోని ఉప్పరపల్లి గ్రామంలో వున్న బీసీ సంక్షేమ వసతి గృహం సమీపంలో రహదారి ఇరువైపులా ముళ్ల పొదలు విస్తరించి రహదారి కనిపించకుండా పోవడంతో గ్రామస్తులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోజువారీ రాకపోకలకు ఆటంకం ఏర్పడటమే కాకుండా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రమాదాలు సంభవించేలోపే ముళ్ల పొదలను తొలగించి రహదారిని వినియోగానికి అనువుగా మార్చాలని అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయంపై ఉప్పరపల్లి పంచాయతీ కార్యదర్శి సునీల్‌ను వివరణ కోరగా, ప్రస్తుతం విధి నిర్వహణలో భాగంగా శ్రీకాళహస్తిలో శిక్షణలో ఉన్నట్లు తెలిపారు. నాలుగు రోజుల్లో జేసీబీ యంత్రంతో రహదారి ఇరువైపులా పెరిగిన ముళ్ల పొదలను తొలగించి ప్రజల రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు చేపడతామని ఆయన వెల్లడించారు.



# డెంగ్యూ నివారణకు ప్రతి శుక్రవారం 'ఫ్రైడే--డ్రై డే' పాటించాలి

ప్రజాభూమి, సిద్ధవటం:



డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా సిద్ధవటం మండల కేంద్రంలోని ఎగువపేట, రత్న సభాపతి నగర్ ప్రాంతాల్లో శుక్రవారం డెంగ్యూపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పి.కొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మురళీమోహన్ మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా డెంగ్యూ, ఇతర సీజనల్ వ్యాధులను నివారించవచ్చన్నారు. జలుబు, దగ్గు, విరేచనాలు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులను సంప్రదించాలనిసూచించారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి ఇండ్ల సుబ్బరాయుడు మాట్లాడుతూ జూలై 1 నుంచి 31 వరకు నిర్వహిస్తున్న డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా ప్రతి శుక్రవారం 'ఫ్రైడే--డ్రై డే' పాటించాలని సూచించారు. ఇంటి పరిసరాల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించి, నీటి పాత్రలను శుభ్రం చేయడం ద్వారా దోమల వ్యాప్తిని అరికట్టవచ్చన్నారు. రాత్రి వేళల్లో దోమల నుంచి రక్షణ కోసం పూర్తి వస్త్రాలు ధరించాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ అధికారి లక్ష్మీ నరసమ్మ, సూపర్‌వైజర్లు మౌలాలి, శారదాదేవి, హెల్త్ అసిస్టెంట్ వెంకటసుబ్బయ్య, వైద్య సిబ్బంది లోకేశ్వరి, ఆదిలక్ష్మి, ఆశా వర్కర్లు పద్మజ, విజయభారతి, కళావతి, ఓబులమ్మ, 104 వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# ఏవీఎస్ పాఠశాలలో మెగా పేరెంట్స్-టీచర్స్ సమావేశం

### - విద్యార్థుల ప్రగతి, పాఠశాల అభివృద్ధిపై తల్లిదండ్రులకు అవగాహన



ప్రజాభూమి, ఒంటిమిట్ట: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన మెగా పేరెంట్స్--టీచర్స్ సమావేశాల్లో భాగంగా ఒంటిమిట్ట మండలం కొత్తమాధవరం గ్రామంలోని ఏవీఎస్ ఎయిడెడ్ పాఠశాలలో గురువారం ప్రధానోపాధ్యాయులు అవ్వారు వెంకట వరప్రసాద్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. విద్యార్థుల విద్యా పురోగతి, పాఠశాల అభివృద్ధిలో తల్లిదండ్రుల భాగస్వామ్యాన్ని పెంపొందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రోగ్రెస్ కార్డులను తల్లిదండ్రులకు అందజేసి, వారి అభ్యాస స్థాయి, హాజరు, ప్రతిభతో పాటు మెరుగుపరచాల్సిన అంశాలపై ఉపాధ్యాయులు వివరించారు. విద్యార్థుల్లో క్రమశిక్షణ, పరిశుభ్రత, నైతిక విలువల పెంపుతో పాటు పాఠశాల అభివృద్ధిలో తల్లిదండ్రుల పాత్రపై అవగాహన కల్పించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యా సంస్కరణలు, పాఠశాలల్లో కల్పిస్తున్న మౌలిక సదుపాయాలు, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాల గురించి కూడా వివరించారు. అనంతరం కార్యక్రమానికి హాజరైన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు భోజన సదుపాయం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులతో పాటు పెద్ద సంఖ్యలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఏపీఎస్పీ 11వ పోలీస్ పటాలయంలో డీఐజీ ఉదయ్ భాస్కర్ వార్షిక తనిఖీలు

### పోలీసుల సంక్షేమానికి కృషి చేస్తానని హామీ




ప్రజాభూమి, సిద్ధవటం: వార్షిక తనిఖీల్లో భాగంగా కర్నూలు రేంజ్ డీఐజీ ఉదయ్ భాస్కర్ శుక్రవారం సిద్ధవటం మండలం భాకరాపేట సమీపంలోని ఏపీఎస్పీ 11వ పోలీస్ పటాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా నిర్వహించిన దర్బార్ కార్యక్రమంలో పోలీసు సిబ్బందితో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకుని, పోలీసుల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం పటాలయంలోని మోటార్ ట్రాన్స్‌పోర్ట్ విభాగాన్ని తనిఖీ చేసి, విధులు నిర్వహిస్తున్న సిబ్బంది పనితీరు, ఎదుర్కొంటున్న సమస్యలపై ఆరా తీశారు. కార్యక్రమంలో కమాండెంట్ ఆనందరెడ్డి, అసిస్టెంట్ కమాండెంట్లు రాజశేఖర్, వెంకటప్ప, ప్రసాద్‌తో పాటు ఇతర అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# బూచుపల్లెలో 'ఫ్రైడే - డ్రైడే' కార్యక్రమము

### సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య

ప్రజా భూమి తొండూరు:తొండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని బూచుపల్లె గ్రామంలో శుక్రవారం సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య ఆధ్వర్యంలో 'ఫ్రైడే - డ్రైడే' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్య సిబ్బంది గ్రామంలో విస్తృతంగా ఇంటింటా ఫీవర్ (జ్వరం) సర్వే, లార్వా సర్వే నిర్వహించారు. దోమల లార్వా, ప్యూపా దశల్లో ఉండగానే నిర్మూలించేందుకు ఆంటీ లార్వాల్ ఆపరేషన్ చేపట్టారు. నిల్వ ఉన్న నీటి గుంటలు, పాత్రలలో లార్వా వృద్ధి చెందకుండా అబేట్ మందును పిచికారీ చేశారు. అనంతరం గ్రామస్తులతో సమావేశమై దోమకాటు వల్ల వ్యాపించే డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా వంటి వ్యాధులపై మరియు వాటి నివారణ మార్గాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం అనంతరం తొండూరు పి.హెచ్.సి లో నిర్వహిస్తున్న సెక్టార్ మీటింగ్ హాజరయ్యారు. ఈ సమావేశంలో సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు మరియు ఆరోగ్య సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలి. పరిసరాల పరిశుభ్రతను పాటించడం ద్వారానే దోమల ద్వారా వ్యాపించే వ్యాధులను సమర్థవంతంగా అరికట్టవచ్చు. ప్రతీ శుక్రవారం ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి అని కోరారు. వర్షాకాలం దృష్ట్యా ఆరోగ్య సిబ్బంది క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ ఎప్పటికప్పుడు ఫీవర్ సర్వే నిర్వహించాలని పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో విజయ, సూపర్ వైజర్ షీబారాణి, ఎం.ఎల్.హెచ్.పి / సీహెచ్‌వోలు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.



## దగ్గవోలు ఎగువ మిట్టలో సిమెంట్ రోడ్డుపై మురుగు నీరు.. ప్రజలకు తీవ్ర ఇబ్బందులు



ప్రజా భూమి ప్రతినిధి, గూడూరు,
దక్కిలి మండలం దగ్గవోలు గ్రామంలోని ఎగువ మిట్ట ప్రాంతంలో సిమెంట్ రోడ్డుపై మురుగు నీరు నిల్వ ఉండడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాలు కురిసిన ప్రతిసారి నీరు రోడ్డుపైనే నిలిచిపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. ముఖ్యంగా పాఠశాల విద్యార్థులు, వృద్ధులు, ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మురుగు నీరు నిల్వ ఉండటం వల్ల దోమలు పెరిగి వ్యాధులు వ్యాపించే ప్రమాదం కూడా ఉందని స్థానికులు చెబుతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి నీరు సక్రమంగా వెళ్లేలా కాలువలు ఏర్పాటు చేసి, రోడ్డును మరమ్మతు చేయాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. ప్రస్తుతం ఈ సమస్యతో ప్రజలు నిత్యం ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## ప్రభుత్వ ఆదేశాలను తూచా తప్పకుండా అమలు చేయాలి - గొడ్డిండ్ల వెంకటేశ్వర్లు




ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి
తిరుపతి అర్బన్ మండల పరిధిలోని జిల్లా పరిషత్ హైస్కూల్, సత్యనారాయణపురంలో నిర్వహించిన మెగా పేరెంట్--టీచర్ మీటింగ్ సందర్భంగా ప్రభుత్వం నిర్దేశించిన సమయం, మార్గదర్శకాలను పాటించకుండా కార్యక్రమాన్ని నిర్వహించడం బాధాకరమని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు అడ్వకేట్, మన తిరుపతి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు గొడ్డిండ్ల వెంకటేశ్వర్లు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి 10:45 గంటల వరకు ముఖ్య అతిథి రవి నాయుడు, శాప్ చైర్మన్ రాక కోసం విద్యార్థులను నేలపై కూర్చోబెట్టి వేచి ఉంచడం వల్ల వారి విలువైన విద్యా సమయంతో పాటు తల్లిదండ్రుల సమయం కూడా వృథా అయిందన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన సమయానికే కార్యక్రమాన్ని ప్రారంభించి ఉంటే ఇటువంటి పరిస్థితి ఏర్పడేదే కాదని పేర్కొన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా కూడా ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాలను పూర్తిగా అమలు చేయకుండా, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సంధ్యారాణి మరియు సంబంధిత సిబ్బంది తమ స్వంత విధానంలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంపై గతంలో పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి మార్పు కనిపించలేదని అన్నారు. ముగ్గురు విద్యార్థుల తండ్రిగా, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు అడ్వకేట్‌గా, మన తిరుపతి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా, లీగల్ కౌన్సిలర్‌గా తన బాధ్యతలో భాగంగా పాఠశాలకు వెళ్లి ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం కార్యక్రమాన్ని సమయానికి ప్రారంభించాలని కోరినా, అది జరగకపోవడంతో నిరాశతో అక్కడి నుంచి వెనుదిరిగినట్లు తెలిపారు. ప్రభుత్వం జారీ చేసే ఆదేశాలు, విద్యాశాఖ మార్గదర్శకాలను ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తూచా తప్పకుండా అమలు చేసి, విద్యార్థులు మరియు తల్లిదండ్రుల సమయానికి విలువ ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## గూడూరు లో బంద్ విజయవంతం

**ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు స్వచ్ఛందంగా మూసి వేత.**



ప్రజా భూమి ప్రతినిధి, గూడూరు,
డిల్లీ లో విద్యార్థులు , యువత పై జరిగిన దాడిని నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్త బంద్ లో భాగంగా శుక్రవారం గూడూరు పట్టణంలోని టవర్ క్లాక్ సెంటర్ నందు ఏ. ఐ.ఎస్. ఎఫ్, పి.డి. ఎస్. యు , యు.ఎస్.ఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. అనంతరం అర్ధనగ్న ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఏ. ఐ.ఎస్.ఎఫ్ నియోజకవర్గ కార్యదర్శి యశ్వంత్, రిజ్వాన్ లు మాట్లాడుతూ నీట్ పేపర్ లీకేజీ తో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్ గందరగోళంగా మారిందన్నారు. నీట్ పరీక్ష పేపర్ లీకేజీ కి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా శాంతియుతంగా విద్యార్థులు , యువత పై దాడి చేసిన వారి పై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి జి.శశి కుమార్ , పట్టణ కన్వీనర్ వై. సునీల్ మాట్లాడుతూ శాంతియుతంగా ధర్నా చేస్తున్న విద్యార్థుల పై కేంద్ర ప్రభుత్వం దాడి చేయడం ఎంత వరకు సమంజసం అని పేర్కొన్నారు. అదేవిధంగా నీట్ పేపర్ లీకేజీ కారకులను కఠినంగా శిక్షించాలని పేర్కొన్నారు. ఈరోజు దేశంలో విద్యార్థులు , యువత భవిష్యత్ అధంకారంలో ఉందన్నారు. విద్యార్థులు ,యువత పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. నీట్ పేపర్ లీకేజీ బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీ నామ చేయాలన్నారు. అనంతరం విద్యాసంస్థల బంద్ సందర్భంగా పలు పాఠశాలలు , కళాశాలలు స్వచ్ఛందంగా మూసి వేశారు. ఈ బంద్ కు సీపీఐ , ఏ. ఐ.టి. యు.సి , సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజక వర్గ సహాయ కార్యదర్శి జమాలుల్లా, ఏ.ఐ.టి. యు.సి నియోజకవర్గ కార్యదర్శి సి.వి.ఆర్ కుమార్ , ఏ. ఐ.టి. యు. సి జిల్లా అధ్యక్షులు నారాయణ , పి.డి. ఎస్ . యు జిల్లా నాయకులు సునీల్,యు.ఎస్.ఎఫ్ నాయకులు ఉద్దాల మణి, తదితరులు పాల్గొన్నారు.




## తల్లికి వందనం పేదలకు వరం ఎమ్మెల్యే సునీల్ కుమార్

ప్రజా భూమి ప్రతినిధి, గూడూరు,
ఎన్నికలకు ముందు చెప్పిన విధంగా రెండవ విడత తల్లికి వందనం పథకం ద్వారా నిన్నటి రోజున ప్రభుత్వం తల్లుల ఖాతాల్లో నగదు జమ చేయడం జరిగిందని ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను మంత్రి నారా లోకేష్ తీర్చిదిద్దుతున్నారని గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ వెల్లడించారు. గూడూరు పట్టణంలోని చిల్లకూరు శేషమ్మ మున్సిపల్ హైస్కూల్లో తల్లిదండ్రులు ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ విచ్చేశారు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు చిన్నారుల సాంస్కృతి కార్యక్రమాలు అందరినీ అలరించాయి పాఠశాల ఆవరణలో మొక్కలను నాటారు మధ్యాహ్నం భోజనం లో చిన్నారులతో కలిసి భోజనం చేశారు ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ ఎన్నికలకు ముందు చెప్పిన విధంగా సూపర్ సిక్స్ పథకాలను కూటమి ప్రభుత్వం అమలు చేస్తుందని రెండో విడత తల్లికి వందనం నిన్నటి రోజున తల్లుల ఖాతాల్లో జమ చేయడం జరిగిందని తెలిపారు గతంలో ఎప్పుడూ లేనివిధంగా ఉపాధ్యాయులు తల్లిదండ్రులతో సమావేశాన్ని ముఖ్యమంత్రి నారా లోకేష్ ప్రవేశపెట్టారని దీనివల్ల తమ పిల్లలు ఎలా చదువుతున్నారో తెలుసుకునే అవకాశం ఉందని అన్నారు తల్లికి వందనం నగదు రానివారు సచివాలయాల్లో సంప్రదించాలని సూచించారు ఈ సమావేశంలో డిప్యూటీ డిఇఓ సనత్ కుమార్, ఎంఈఓ లు మాధవరావు, కాంచన,పాఠశాల కమిటీ చైర్మన్ పోలయ్య ,నాయకులు శ్రీనివాసులు, రహీం,ముత్తుజ ,నాజరుద్దీన్ ,సద్దాం ,అల్లి భాష, రవీందర్ రెడ్డి,చంద్రమౌళి , ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.




### ఆషాఢ గుప్త నవరాత్రుల వేళ శ్రీ ఆదివారాహి అమ్మవారి ఆలయంలో ఉద్రిక్తత..

# ఆలయ పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని భక్తుల విజ్ఞప్తి

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి రూరల్
ఆషాఢ గుప్త నవరాత్రుల సందర్భంగా ప్రత్యేక పూజలు, హోమాలు, ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న తిరుచానూరులోని శ్రీ ఆదివారాహి అమ్మవారి దేవాలయంలో చోటుచేసుకున్న ఘటనలు భక్తులను తీవ్ర ఆవేదనకు గురిచేశాయి. తమిళనాడు, రాయలసీమ జిల్లాలతో పాటు వివిధ ప్రాంతాల నుంచి అమ్మవారి దర్శనానికి విచ్చేసిన భక్తులు ఆలయ ప్రాంగణంలో నెలకొన్న పరిస్థితులను చూసి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆలయ పూజారి శ్రీ మహా రుద్ర వారాహి స్వామి తెలిపిన వివరాల ప్రకారం, ఆషాఢ గుప్త నవరాత్రుల సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అలంకరణలు, ఉత్సవాల ఏర్పాట్లు జరుగుతున్న సమయంలో కొందరు వ్యక్తులు ఆలయ ప్రాంగణంలోకి ప్రవేశించి ఏర్పాటు చేసిన పూల అలంకరణలు, పందిళ్లు, పూజా సామగ్రిని ధ్వంసం చేసి చెల్లాచెదురు చేశారని తెలిపారు. దీంతో పూజా కార్యక్రమాలకు అంతరాయం కలగడంతో పాటు దర్శనానికి వచ్చిన భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఆయన పేర్కొన్నారు. కొంతమంది భక్తులను ఆలయ ప్రాంగణంలోకి రానీయకుండా అడ్డుకోవడంతో పాటు వారితో దురుసుగా ప్రవర్తించి దుర్భాషలాడినట్లు కూడా ఆరోపించారు. గత ఏడాది కూడా ఇదే దేవాలయంలో అమ్మవారి విగ్రహం ధ్వంసానికి గురై ఆలయానికి నష్టం వాటిల్లిందని, అయినప్పటికీ భక్తుల సహకారంతో తిరిగి నిత్య పూజలు ప్రారంభించి ఈ ఏడాది ఆషాఢ గుప్త నవరాత్రులను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్న సమయంలో మళ్లీ ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడం అత్యంత బాధాకరమని అక్కడికి వచ్చిన భక్తులు ఆవేదన వ్యక్తం చేశారు. పవిత్రమైన ఆలయాల్లో ఇటువంటి సంఘటనలు పునరావృతం కావడం హిందూ భక్తుల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీస్తోందని వారు అన్నారు. ఈ వ్యవహారానికి సంబంధించి సివిల్ కోర్టు నుంచి ఇంజక్షన్ ఆర్డర్‌తో పాటు ఆలయ పరిరక్షణకు సంబంధించిన ఉత్తర్వులు ఉన్నప్పటికీ వాటిని బేఖాతరు చేస్తూ కొందరు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుని దేవాలయ కార్యకలాపాలకు ఆటంకం కలిగిస్తున్నారని భక్తులు ఆరోపించారు. కోర్టు ఉత్తర్వులను కూడా పట్టించుకోకుండా ఆలయ పరిసరాల్లో ఉద్రిక్త పరిస్థితులు సృష్టించడం అత్యంత ఆందోళనకరమని వారు పేర్కొన్నారు. పూజా కార్యక్రమాలు ముగించుకుని దర్శనానికి వస్తున్న భక్తులు, పాదయాత్రగా వచ్చిన భక్తులు కూడా ఆలయ ప్రాంగణంలో జరిగిన ఘటనలను చూసి తమ ఆవేదన వ్యక్తం చేశారు. పూజల కోసం సిద్ధం చేసిన పూలమాలలు, పూజా సామగ్రిని ధ్వంసం చేయడం, భక్తులను అడ్డుకోవడం వంటి చర్యలు ఒక పవిత్ర క్షేత్రంలో జరగడం బాధాకరమని వారు అభిప్రాయపడ్డారు. ఈ ఘటనలో పాల్గొన్న కొందరు వ్యక్తులు తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ఉత్సవమూర్తులను మోసే బేరర్లుగా ఉన్నారని భక్తులు ఆరోపిస్తున్నారు. ఈ ఆరోపణలపై సంబంధిత అధికారులు నిష్పక్షపాతంగా విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని వారు కోరుతున్నారు. హిందూ సంప్రదాయాలు, ఆలయ ఆచారాలు, భక్తుల విశ్వాసాలను దెబ్బతీసే విధంగా ఎవరైనా వ్యవహరిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు, జిల్లా యంత్రాంగం, పోలీసు శాఖ వెంటనే జోక్యం చేసుకుని శ్రీ ఆదివారాహి అమ్మవారి ఆలయానికి పూర్తి రక్షణ కల్పించాలని భక్తులు విజ్ఞప్తి చేశారు. కోర్టు ఉత్తర్వులకు అనుగుణంగా ఆలయంలో నిత్యపూజలు, ఉత్సవాలు, ధార్మిక కార్యక్రమాలు ఎలాంటి ఆటంకం లేకుండా కొనసాగేలా చర్యలు తీసుకోవాలని, ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. శ్రీ ఆదివారాహి అమ్మవారి ఆలయం భక్తుల విశ్వాసానికి ప్రతీకగా నిలిచే పవిత్ర క్షేత్రమని, దాని పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని భక్తులు స్పష్టం చేశారు.



# స్వర్ణముఖి నది ఒడ్డున భారీ నీటి దోపిడీ?

- అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా స్పందన శూన్యం..!
- రైతు బోర్ల పేరుతో అక్రమంగా నీటి వ్యాపారం.. రాత్రింబవళ్లు ట్యాంకర్లలో తరలింపు..
- భూగర్భ జలాలు అడుగంటుతున్నాయంటూ ప్రజల ఆవేదన






ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి రూరల్
తిరుపతి జిల్లాకు జీవనాధారంగా నిలిచిన స్వర్ణముఖి నది ఒడ్డున భారీ స్థాయిలో నీటి దోపిడీ జరుగుతోందని స్థానిక ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైతుల పేరుతో బోర్లు ఏర్పాటు చేసి, ఆ నీటిని వాణిజ్య అవసరాలకు వినియోగిస్తూ ట్యాంకర్ల ద్వారా పట్టణ ప్రాంతాలకు విక్రయిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారంపై సంబంధిత అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం అధికార యంత్రాంగం నిర్లక్ష్యానికి నిదర్శనమని మండిపడుతున్నారు. తిరుపతి జిల్లా తిరుచానూరు పంచాయతీ పరిధిలోని సర్వే నెంబర్ 458లో సుమారు 149 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న స్వర్ణముఖి నది పరివాహక ప్రాంతం ప్రస్తుతం అక్రమ నీటి వ్యాపారానికి కేంద్రంగా మారిందని గ్రామస్తులు చెబుతున్నారు. నది ఒడ్డున రైతు బోర్ల పేరుతో పెద్ద సంఖ్యలో బోర్లు ఏర్పాటు చేసి, భారీ మోటార్లతో రాత్రింబవళ్లు భూగర్భ జలాలను వెలికితీసి ట్యాంకర్లలో నింపి తిరుపతి నగరంలోని హోటళ్లు, రెస్టారెంట్లు, ఫంక్షన్ హాళ్లు, శుభకార్యాలు మరియు ఇతర వాణిజ్య అవసరాలకు సరఫరా చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. స్థానికుల సమాచారం ప్రకారం నది పరిసర ప్రాంతాల్లో సుమారు 20 బోర్లు పనిచేస్తున్నాయి. ఒక్కో బోరు నుంచి రోజుకు ఆరు నుంచి ఏడు ట్యాంకర్ల వరకు నీటిని తరలిస్తున్నట్లు చెబుతున్నారు. దీంతో ప్రతిరోజూ లక్షల లీటర్ల భూగర్భ జలాలు అక్రమంగా తరలిపోతున్నాయని ఆరోపిస్తున్నారు.

**ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా స్పందించని అధికారులు**

ఈ అక్రమాలపై గ్రామస్తులు, రైతులు, సామాజిక కార్యకర్తలు పలుమార్లు మండల, జిల్లా స్థాయి అధికారులకు రాతపూర్వకంగా ఫిర్యాదులు అందజేసినట్లు తెలిపారు. రెవెన్యూ, భూగర్భ జలాలు, నీటిపారుదల, పంచాయతీ, పోలీసు శాఖల అధికారులను కలిసి వివరించినా ఎలాంటి స్పందన రాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని సందర్భాల్లో అధికారులు వస్తామని హామీ ఇచ్చినా క్షేత్రస్థాయిలో తనిఖీలు జరపలేదని, మరికొన్ని సందర్భాల్లో ఫిర్యాదులను ఒక శాఖ నుంచి మరో శాఖకు పంపిస్తూ కాలయాపన చేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. నది ఒడ్డున బహిరంగంగానే ట్యాంకర్లు నీటిని నింపుకుని వెళ్తున్నా అధికారులు చూడనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శిస్తున్నారు. స్థానికులు పలుమార్లు వీడియోలు, ఫొటోలు, వాహనాల వివరాలు అందజేసినా ఇప్పటి వరకు ఒక్క అక్రమ బోరునైనా మూసివేయలేదని, ఒక్కరిపైనా కేసు నమోదు కాలేదని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రజల విజ్ఞప్తులను పట్టించుకోకుండా అధికారులు కళ్లుమూసుకుని వ్యవహరిస్తున్నారా? లేక అక్రమాలకు అండగా నిలుస్తున్నారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని గ్రామస్తులు అంటున్నారు.

**భూగర్భ జలాలు అడుగంటుతున్నాయంటున్న రైతులు**

అక్రమ నీటి పంపింగ్ కారణంగా పరిసర ప్రాంతాల్లో భూగర్భ జల మట్టం గణనీయంగా పడిపోయిందని రైతులు చెబుతున్నారు. గత ఏడాది 80 నుంచి 120 అడుగుల లోతులో లభించిన నీరు ప్రస్తుతం 180 నుంచి 250 అడుగులకు పడిపోయిందని, ఇప్పటికే అనేక బావులు ఎండిపోయాయని, కొత్తగా బోర్లు వేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాగునీరు లేక పంటలు దెబ్బతింటున్నాయని రైతులు వాపోతున్నారు.

**చట్టాల ఉల్లంఘనపై ప్రశ్నలు**

వాటర్, ల్యాండ్ అండ్ ట్రీ ఆక్ట్ (వాల్టా) ప్రకారం నదులు, చెరువులు, వాగుల పరిసర ప్రాంతాల్లో అనుమతి లేకుండా కొత్త బోర్లు తవ్వడం నిషేధం. అలాగే భూగర్భ జలాలను వాణిజ్య ప్రయోజనాలకు వినియోగించాలంటే సంబంధిత అధికారుల ప్రత్యేక అనుమతి తప్పనిసరి. అయినప్పటికీ ఈ నిబంధనలను బేఖాతరు చేస్తూ బహిరంగంగానే నీటి వ్యాపారం కొనసాగుతున్నా చర్యలు లేకపోవడంపై ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

**పర్యావరణ నిపుణుల హెచ్చరిక**

నదీ పరివాహక ప్రాంతంలో నిరంతరంగా భూగర్భ జలాలను వెలికితీయడం వల్ల ఆక్విఫర్లు శాశ్వతంగా దెబ్బతినే ప్రమాదం ఉందని పర్యావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే భవిష్యత్ తరాలకు తాగునీటి కొరతతో పాటు వ్యవసాయం కూడా తీవ్రంగా దెబ్బతినే ప్రమాదం ఉందని పేర్కొంటున్నారు. ప్రజల ప్రధానంగా డిమాండ్ చేస్తున్న అంశాలు స్వర్ణముఖి నది ఒడ్డున ఏర్పాటు చేసిన అక్రమ బోర్లను తక్షణమే మూసివేయాలి. వాణిజ్య అవసరాలకు అక్రమంగా నీటిని తరలిస్తున్న ట్యాంకర్లను స్వాధీనం చేసుకోవాలి. బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలి. ఇప్పటి వరకు ఫిర్యాదులు వచ్చినా స్పందించని అధికారుల పాత్రపై సమగ్ర విచారణ జరపాలి. నదీ పరివాహక ప్రాంతంలో ప్రత్యేక పర్యవేక్షణ బృందాన్ని ఏర్పాటు చేసి నిరంతర తనిఖీలు నిర్వహించాలి. భూగర్భ జలాలను సంరక్షించేలా శాశ్వత కార్యాచరణ చేపట్టి ప్రజల జీవనాధారాన్ని కాపాడాలని స్థానికులు, రైతులు, సామాజిక సంఘాలు ప్రభుత్వాన్ని కోరుతున్నాయి.

# మెగా పేరెంట్--టీచర్ సమావేశాలు విద్యార్థుల సమగ్రాభివృద్ధికి బలమైన పునాది

### -ప్రగతిలో తల్లిదండ్రుల భాగస్వామ్యం కీలకం





ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి
విద్యార్థుల విద్యా ప్రగతిలో తల్లిదండ్రుల భాగస్వామ్యం అత్యంత కీలకమని, మెగా పేరెంట్--టీచర్ సమావేశాల ద్వారా విద్యా నాణ్యత మరింత మెరుగుపడుతుందని జిల్లా కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్ అన్నారు. తిరుపతిలోని శ్రీ పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ మునిసిపల్ హైస్కూల్‌లో నిర్వహించిన మెగా పేరెంట్--టీచర్ మీటింగ్ 4.0 కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, క్లీన్ అండ్ గ్రీన్ బ్యూటిఫికేషన్ చైర్‌పర్సన్ సుగుణమ్మ, ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ శారదాదేవి, జిల్లా విద్యాశాఖ అధికారి కె.వి.ఎన్. కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగంలో సమగ్ర సంస్కరణలు చేపట్టి విద్యార్థుల అభ్యాస స్థాయిని పెంపొందించేందుకు లీప్ యాప్, ఎఫ్ఎల్ఎన్, రీమిడియల్ బోధన వంటి కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. జిల్లా వ్యాప్తంగా 2,550 పాఠశాలల్లో సుమారు 1.52 లక్షల మంది విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ సమావేశాల్లో పాల్గొన్నారని తెలిపారు. డోనర్ యాప్ ద్వారా పాఠశాలల మౌలిక వసతుల అభివృద్ధికి దాతలు, పూర్వ విద్యార్థులు పారదర్శకంగా విరాళాలు అందించవచ్చని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ తన నెల జీతంలో సగం మొత్తాన్ని, ఎమ్మెల్యే రూ.50 వేలు, సుగుణమ్మ రూ.50 వేలు, జిల్లా విద్యాశాఖ తరపున రూ.20 వేలు పాఠశాల అభివృద్ధికి విరాళంగా ప్రకటించారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ, పిల్లలపై ఒత్తిడి కాకుండా ప్రోత్సాహం అందించడం ద్వారా వారి ప్రతిభ వికసిస్తుందని అన్నారు. ప్రతి ఆరు నెలలకు నిర్వహించే మెగా పేరెంట్--టీచర్ సమావేశాలు విద్యార్థుల పురోగతిని సమీక్షించేందుకు ఉపయోగపడతాయని తెలిపారు. పాఠశాల అభివృద్ధికి రూ.50 వేలు అందజేస్తున్నట్లు ప్రకటించడంతో పాటు, మెగాస్టార్ చిరంజీవి జన్మదినం సందర్భంగా మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. సుగుణమ్మ మాట్లాడుతూ, విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు ఆధునిక మౌలిక సదుపాయాలు అందుబాటులోకి వస్తున్నాయని తెలిపారు. జిల్లా విద్యాశాఖ అధికారి కె.వి.ఎన్. కుమార్ మాట్లాడుతూ, మెగా పేరెంట్--టీచర్ సమావేశాలు విద్యార్థుల అభ్యాస స్థాయిని తల్లిదండ్రులకు వివరించే ఉత్తమ వేదికగా నిలుస్తున్నాయని, పిల్లల ప్రతిభకు అనుగుణంగా ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రధానోపాధ్యా యులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# వ్యవసాయ, పాడి, ఆక్వా రంగాలను దెబ్బతీసే

### అమెరికాతో మోడీ ప్రభుత్వం చేసుకున్న వాణిజ్య ఒప్పందాన్ని రద్దు చేయాలి -సిపిఐ (ఎంఎల్)న్యూడెమోక్రసీ

### జిల్లా కార్యదర్శి డి పి పోలయ్య డిమాండ్



ప్రజా భూమి ప్రతినిధి, గూడూరు,
వ్యవసాయ, పాడి, ఆక్వా రంగాలను దెబ్బతీసే అమెరికాతో మోడీ ప్రభుత్వం చేసుకున్న వాణిజ్య ఒప్పందాన్ని వెంటనే రద్దు చేయాలని సైదాపురంలో నేడు ఓ ప్రకటనలో సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి డి పి పోలయ్య డిమాండ్ చేశారు. ఆసందర్భంగా సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి డి పి పోలయ్య మాట్లాడుతూ దేశంలో నూటికి 70 శాతం మంది ఆధారపడి జీవిస్తున్న వ్యవసాయ రంగాన్ని పాలకవర్గాలు సంక్షోభంలోకి నెడుతున్నాయని విమర్శించారు. రైతాంగ పంటలకు గిట్టుబాటు ధరలు లేక, అప్పుల ఊబిలో కూరుకుపోయి ప్రతిరోజు 31 మంది రైతులు ఆత్మహత్యలు పాలవుతున్నారని అన్నారు. మోడీ ప్రభుత్వ హయాంలో సుమారు 1,40,000 మంది రైతులు బలైపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ రంగాన్ని సామ్రాజ్యవాద, బడా కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టడానికి కేంద్రం పూనుకుందని దుయ్యబట్టారు. 2026 ఫిబ్రవరిలో అమెరికాతో మోడీ ప్రభుత్వం చేసుకున్న వాణిజ్య ఒప్పందం దేశద్రోహకరమని, ఆహార భద్రతకు తీవ్ర ముప్పు ఏర్పడుతుందని అన్నారు. ఈ ఒప్పందంతో వ్యవసాయ, పాడి, ఆక్వారంగాలు, రైతాంగం మరింత సంక్షోభంలో పడతాయని అన్నారు. ఈ ఒప్పందం అసమాన ఒప్పందమని అన్నారు. ఈ ఒప్పందం ప్రకారం 45 లక్షల కోట్లు (500 బిలియన్ డాలర్లు) విలువైన అమెరికా వస్తువులు మన దేశంలోకి దిగుమతి కానున్నాయని, వాటిపై దిగుమతి సుంకం లేదని, కానీ మన దేశ వస్తువులు అమెరికాలో అమ్మాలంటే మాత్రం 15% సుంకాలు చెల్లించాలని అన్నారు. అంతేకాకుండా రష్యా నుండి తక్కువ ధరకు వస్తున్న ముడి చమురు దిగుమతులపై కూడా అమెరికా ఆంక్షలు విధించిందని తెలిపారు. అమెరికా నుండి సోయాబీన్ ఆయిల్, సోయాబీన్ చెక్క దిగుమతి కానుందని, దీనితో సోయాబీన్ పండించే మన దేశ 40 లక్షల రైతు కుటుంబాలు ఏం కావాలని ప్రశ్నించారు. పత్తిపై ఉన్న 11% దిగుమతి సుంకాన్ని కేంద్రం రద్దు చేయడంతో విదేశీ పత్తికి గేట్లు బార్ల తెరవడంతో మన పత్తి రైతులు సుమారు 36,518 కోట్లు నష్టపోయారని అన్నారు. సోయాబీన్, పత్తి, చెరకు, మొక్కజొన్న, యాపిల్, డ్రై ఫ్రూట్స్, పప్పు ధాన్యాలు పండించే రైతులు, పాడి, ఆక్వారంగ రైతులు ఈ ఒప్పందంతో తీవ్రంగా నష్టపోతారని, వెంటనే ఈ ఒప్పందాన్ని రద్దు చేయాలని డి పి పోలయ్య కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంతేకాకుండా అమెజాన్, బేయర్ వంటి కంపెనీలు విత్తన వ్యాపారాన్ని తమ గుప్పెట్లోకి తెచ్చుకోవడానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నాయని అన్నారు. రైతాంగ పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని, స్వామినాథన్ కమీషన్ సిఫారసులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

# మరింత భక్తి భావాన్ని పెంచేలా ఎస్వీబీసీ ప్రసారాలు

## సృజనాత్మకత, నాణ్యతతో భక్తులను ఆకట్టుకునే కార్యక్రమాలు రూపొందించాలి - టిటిడి ఈవో శ్రీ ముద్దాడ రవిచంద్ర





ప్రజా భూమి ప్రతినిధి తిరుమల

ప్రపంచవ్యాప్తంగా ఉన్న శ్రీవారి భక్తుల్లో మరింత భక్తి భావాన్ని పెంపొందించేలా ఎస్వీ వేంకటేశ్వర భక్తి ఛానల్ కార్యక్రమాలను సృజనాత్మకంగా, నాణ్యంగా రూపొందించాలని టిటిడి ఈవో శ్రీ ముద్దాడ రవిచంద్ర అధికారులను ఆదేశించారు. శుక్రవారం టిటిడి జేఈవో డా. ఎ. శరత్ తో కలిసి ఎస్వీబీసీ రోజువారీ ప్రసారాలు, భవిష్యత్ కార్యక్రమాల రూపకల్పనపై ఈవో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ, తిరుమల క్షేత్రంలోని స్థూపాలు, మండపాలు, ప్రాకారాలు, తీర్థాలు, ఉపాలయాలు, శ్రీవారి ప్రసాదాల విశిష్టత తదితర అంశాలను భక్తులకు సులభంగా అర్థమయ్యేలా కార్యక్రమాలు రూపొందించాలని సూచించారు. తిరుమల ఆధ్యాత్మిక వైభవం, శ్రీవారి మహిమను ప్రతి భక్తుడి హృదయానికి చేరేలా ఆకర్షణీయమైన కార్యక్రమాలను రూపొందించాలని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది భక్తులు ఎస్వీబీసీని వీక్షిస్తున్నారని, ప్రతి కార్యక్రమం భక్తులను చివరి వరకు ఆసక్తిగా చూసేలా ఉండాలని, నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేశారు. భక్తి, భావం, సరళత కలగలిపిన కార్యక్రమాలతో రోజురోజుకు ప్రేక్షకాదరణ పెరిగేలా కొత్త ఆలోచనలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రస్తుతం ప్రసారమవుతున్న కార్యక్రమాలను సమీక్షించి, భక్తుల అభిరుచికి అనుగుణంగా మరిన్ని వినూత్నమైన ఆధ్యాత్మిక కార్యక్రమాలను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. అంతకుముందు ఎస్వీబీసీ సీఈవో, టిటిడి జేఈవో డా. ఎ. శరత్ మాట్లాడుతూ, ప్రస్తుతం ప్రసారమవుతున్న కార్యక్రమాల వివరాలను ఈవోకు వివరించారు. హెచ్‌డీపీపీ సహకారంతో ప్రారంభించిన "మహాలక్ష్మీ దీపపూజ" కార్యక్రమానికి మంచి స్పందన లభించిందని, దీనిని గ్రామీణ స్థాయి వరకు విస్తరించనున్నట్లు తెలిపారు. రానున్న శ్రీ వేంకటేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవాల సందర్భంగా దేశంలోని ప్రముఖ కళాకారులతో ఆధ్యాత్మిక, ధార్మిక, సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ముందుగా నమూనా ఆలయాన్ని సందర్శించి స్వామి వారిని దర్శించుకున్నారు. సమీక్షకు ముందు ఆధ్యాత్మిక విశేషాల విభాగం, ఎడిట్ విభాగం, పలు స్టూడియో విభాగాలను పరిశీలించి ఈవో పలు సూచనలు చేశారు. విద్యుత్, ఎయిర్ కండిషనర్లను అవసరమైన మేరకే వినియోగించాలని సూచించారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులతో మాట్లాడి వారి బాగోగులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్వీబీసీ సీపీవో ఏ.సి. శ్రీ, ఎస్ఈ మనోహరం, అకౌంట్స్ ఆఫీసర్ శ్రీ విశ్వనాథ రాయల్తో పాటు ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# హోంశాఖ మంత్రిపై అనుచిత వ్యాఖ్యలు ఖండనీయం.. అంబటి రాంబాబు బహిరంగ క్షమాపణ చెప్పాలి: సొట్ట నరేంద్ర బాబు మాదిగ




ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి

రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనితపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి అంబటి రాంబాబు చేసిన వ్యాఖ్యలు పూర్తిగా తప్పని, వెంటనే వాటిని ఉపసంహరించుకుని బహిరంగ క్షమాపణ చెప్పాలని మహాజన సోషలిస్ట్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సొట్ట నరేంద్ర బాబు మాదిగ డిమాండ్ చేశారు. మంద కృష్ణ మాదిగ పిలుపు మేరకు తిరుపతి ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మహాజన రాజ్యాధికార పోరాట సమితి, మహాజన సోషలిస్ట్ పార్టీ నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. ప్రతిపక్షాలకు ప్రభుత్వ విధానాలను విమర్శించే హక్కు ఉన్నప్పటికీ, ఆ విమర్శలు ప్రజాస్వామ్య బద్ధంగా, పార్లమెంటరీ భాషలో ఉండాలని, వ్యక్తిగతంగా లేదా ఒక కులాన్ని, వర్గాన్ని కించపరిచేలా వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. ప్రభుత్వ లోపాలను విమర్శించడం పట్ల తమకు ఎలాంటి అభ్యంతరం లేదని, కానీ ఆ పేరుతో మాదిగ సమాజ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే ప్రయత్నాలను సహించబోమన్నారు. దళిత మహిళగా, హోంశాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్న వంగలపూడి అనితను వ్యక్తిగతంగా అవమానించే విధంగా మాట్లాడటం అత్యంత బాధ్యతారాహిత్యమని, ఇటువంటి వ్యాఖ్యలు ప్రజాస్వామ్య విలువలను దెబ్బతీస్తాయని అన్నారు. మహిళలను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, రాజకీయ విభేదాలు ఉన్నప్పటికీ వ్యక్తిగత దూషణలు చేయడం సమాజానికి మంచిది కాదని పేర్కొన్నారు. ఎవరినో మెప్పించడానికో, నొప్పించడానికో మాట్లాడిన చరిత్ర తమ సంస్థకు లేదని, ఉండబోదని స్పష్టం చేశారు. కూటమి భాగస్వామిగా ఉన్న తమ సంస్థ, కూటమి నాయకుడు పవన్ కళ్యాణ్ హోంశాఖ మంత్రిపై అసమర్థతను సూచించేలా వ్యాఖ్యలు చేసినప్పుడు కూడా రాష్ట్ర సచివాలయంలోనే వాటిని బహిరంగంగా ఖండించిన విషయాన్ని గుర్తు చేశారు. ఇప్పుడు అవసరం వచ్చినందుకే అంబటి రాంబాబు తన విలేకరుల సమావేశంలో మాదిగలను పక్కన పెట్టుకున్నారని, గతంలో నిర్వహించిన అనేక సమావేశాల్లో మాదిగలు కనిపించలేదని విమర్శించారు. అంబటి రాంబాబు వెంటనే తన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని హోంశాఖ మంత్రి వంగలపూడి అనితకు, రాష్ట్ర మహిళలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జగన్ జోక్యం చేసుకుని క్షమాపణ చెప్పించాలని డిమాండ్ చేశారు. అది కూడా జరగకపోతే ఆ వ్యాఖ్యలు పార్టీ సమ్మతితోనే జరిగాయని ప్రజలు భావించే పరిస్థితి వస్తుందని, రాజకీయంగా తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో వర్ల దేవదాస్ మాదిగ, పులికుంట్ల గోపి మాదిగ, వెంబడి రాధాకృష్ణ మాదిగ, వావిళ్ల శివయ్య మాదిగ, పునబాకు మునివేలు మాదిగ, మాసారపు గోపికృష్ణ, రవి మాదిగ, ఆదయ్య మాదిగ, చెంగయ్య, వెంకటగిరి రవి, లక్ష్మయ్యతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో మెగా పేరెంట్స్ మీటింగ్

## ముఖ్యఅతిథిగా తుడా చైర్మన్ డా॥డాలర్స్ దివాకర్ రెడ్డి



ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి

తిరుపతి నగరంలోని చిన్నబజార్ వీధిలో ఉన్న ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల లో నిర్వహించిన మెగా పేరెంట్స్ మీటింగ్ కార్యక్రమంలో తుడా చైర్మన్, తిరుమల తిరుపతి దేవస్థానం ఎక్స్ అఫిషియో సభ్యులు, తిరుపతి జిల్లా పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి డా॥ డాలర్స్ దివాకర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా డా॥ డాలర్స్ దివాకర్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న "తల్లికి వందనం" పథకం కింద విద్యార్థుల తల్లిదండ్రుల బ్యాంకు ఖాతాల్లో రూ.15,000 ఆర్థిక సహాయాన్ని జమ చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ సంక్షేమ కార్యక్రమాన్ని అమలు చేసిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి, విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ కి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి రాష్ట్రంలోని విద్యార్థుల తల్లిదండ్రుల తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో మాట్లాడిన డా. డాలర్స్ దివాకర్ రెడ్డి పాఠశాలలో ఉన్న మౌలిక వసతుల అవసరాలను తెలుసుకున్నారు. విద్యార్థులు ఎండ, వర్షాల సమయంలో ఇబ్బందులు పడకుండా ఉండేందుకు అవసరమైన సీలింగ్ ఫ్యాన్లు ఏర్పాటు చేయడంతో పాటు, రేకుల షెడ్‌ను నిర్మించి అందిస్తానని హామీ ఇచ్చారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధిలో తల్లిదండ్రుల పాత్ర అత్యంత కీలకమని ఆయన అన్నారు. పాఠశాలలు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పరస్పర సమన్వయంతో పనిచేస్తే విద్యార్థులు విద్యలోనే కాకుండా క్రమశిక్షణ, నైతిక విలువలు, సామాజిక బాధ్యతలను కూడా అలవర్చుకుని ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, మెరుగైన మౌలిక సదుపాయాలు, ఆధునిక వసతులు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. ప్రతి విద్యార్థిలోని ప్రతిభను వెలికితీసి, వారి భవిష్యత్తును మరింత ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కలిసి పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు డా॥ డాలర్స్ దివాకర్ రెడ్డి ని ఘనంగా సత్కరించి తమ కృతజ్ఞతలను తెలియజేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, విద్యాశాఖ అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యా యులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మెగా పేరెంట్స్ అండ్ టీచర్స్ మీటింగ్‌లో విద్యార్థినులకు విస్తృత అవగాహన కార్యక్రమం

- శక్తి టీమ్ -- మహిళా పోలీస్ సంయుక్తంగా మహిళలు, బాలికల భద్రతపై చైతన్యం.
- శక్తి యాప్, సైబర్ నేరాలు, సోషల్ మీడియా మోసాలు, డ్రగ్స్‌పై అవగాహన
- క్రమశిక్షణ, నైతిక విలువలు, చదువు ప్రాముఖ్యత, తల్లిదండ్రులు--ఉపాధ్యాయుల పట్ల గౌరవం పెంపొందించుకోవాలని సూచన.





ప్రజా భూమి ప్రతినిధి,తిరుపతి

తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, ఐపీఎస్., ఆదేశాల మేరకు, మహిళా పోలీస్ స్టేషన్ అదనపు ఎస్పీ శ్రీలత ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహిళల, బాలికల భద్రతా కార్యక్రమాల్లో భాగంగా మెగా పేరెంట్స్ అండ్ టీచర్స్ మీటింగ్ సందర్భంగా తిరుపతిలోని పద్మావతి గర్ల్స్ హైస్కూల్, బాలాజీ కాలనీలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్ స్టేషన్ ఎస్ఐ శ్రీమతి దీపిక గారు, శక్తి టీమ్ సిబ్బంది పాల్గొని విద్యార్థినులకు సమాజంలో ఎదురయ్యే వివిధ నేరాలు, వాటి నుంచి ఎలా అప్రమత్తంగా ఉండాలనే అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు. విద్యార్థినులకు శక్తి యాప్ వినియోగం, అత్యవసర పరిస్థితుల్లో 112, 1930, 1098, 181 వంటి టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్ల ప్రాముఖ్యతను వివరించారు. అదేవిధంగా ఈవ్ టీజింగ్, మహిళలపై జరిగే నేరాలు, సైబర్ మోసాలు, తెలియని లింకులు, వీడియో కాల్స్, సోషల్ మీడియాలో వ్యక్తిగత ఫోటోలు, సమాచారం పంచుకోవడం వల్ల కలిగే ప్రమాదాల గురించి అవగాహన కల్పించారు. డ్రగ్స్ దుష్పరిణామాలు, యుక్తవయస్సులో ప్రేమ సంబంధాల వల్ల తలెత్తే సమస్యలు, మొబైల్ గేమ్స్‌కు బానిస కావడం వల్ల కలిగే నష్టాలు, ట్రాఫిక్ నిబంధనలను పాటించాల్సిన అవసరం, అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాల్సిన విధానం వంటి అంశాలను వివరించారు. ప్రస్తుతం సమాజంలో మహిళలు, చిన్నారులపై జరుగుతున్న నేరాలకు సంబంధించిన వాస్తవ సంఘటనలు (కేస్ స్టడీస్) ద్వారా విద్యార్థినులకు చైతన్యం కల్పించారు. మహిళల అక్రమ రవాణా, బాలలపై లైంగిక వేధింపులు, బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ, పిల్లల అదృశ్యం, కిడ్నాప్ వంటి అంశాలపై అవగాహన కల్పిస్తూ, ఇటువంటి ఘటనలు ఎదురైతే వెంటనే పోలీసులను ఆశ్రయించాలని సూచించారు. విద్యార్థులు మంచి స్నేహాలను ఏర్పరుచుకోవడం, మంచి ప్రవర్తన, మంచి అలవాట్లు అలవరుచుకోవడం, క్రమశిక్షణతో ఉండడం, వ్యక్తిత్వ వికాసం, నైతిక విలువలను పెంపొందించుకోవడం, చదువుపై పూర్తి దృష్టి పెట్టడం, తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయులను గౌరవించడం ద్వారా ఉన్నత లక్ష్యాలను సాధించవచ్చని వివరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, ఐపీఎస్ సమాచారం ఇస్తూ విద్యార్థులు చదువుతో పాటు వ్యక్తిత్వ వికాసం, సైబర్ భద్రత, మహిళల రక్షణకు సంబంధించిన అంశాలపై అవగాహన కలిగి ఉండాలని, ఏదైనా అత్యవసర పరిస్థితి ఎదురైతే వెంటనే పోలీసు హెల్ప్‌లైన్ సేవలను వినియోగించాలని సూచించారు. సమాజంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉంటేనే మహిళలు, చిన్నారులపై జరిగే నేరాలను అరికట్టగలమని పేర్కొన్నారు.

# విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు





ప్రజా భూమి ప్రతినిధి, గూడూరు,

చిల్లకూరు గురుకుల పాఠశాల నందు గూడూరు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో లయన్స్ డిస్ట్రిక్ట్ చైర్మన్ షేక్ రియాజ్ అహ్మద్ సౌజన్యంతో విద్యార్థులకు శాంతి పోస్టర్లపై జరిగిన డ్రాయింగ్ కాంపిటీషన్లో రియాజ్ అహ్మద్ మాట్లాడుతూ లయన్స్ ఇంటర్నేషనల్ యువతను శాంతి మార్గాన పయనింప చేయాలని ఉద్దేశంతో విద్యార్థి దశ నుంచి 11 నుంచి 13 సంవత్సరాల విద్యార్థులకు పీస్ పోస్టర్, పీస్ ఎస్సే రైటింగ్ కాంపిటీషన్ ( శాంతి సందేశాల పైన) నిర్వహిస్తూ విద్యార్థి దశ నుంచి యువతకు మానవత్వము, సామరస్యముపై అవగాహన కల్పిస్తూ ఉన్నది. అందులో భాగంగానే ఈరోజు చిల్లకూరు గురుకుల పాఠశాల నందు విద్యార్థులకు డ్రాయింగ్ కాంపిటేషన్ నిర్వహించి వారికి బహుమతులు అందించడమైనదని, ప్రస్తుత పరిస్థితులలో యువత శాంతి మార్గంలో పయనించడం అవసరమని తెలిపారు. లయన్స్ క్లబ్ అధ్యక్షులు కే శివయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో లయన్ జోన్ చైర్మన్ ఎం రూపేష్ రెడ్డి లైన్స్ క్లబ్ ట్రెజరర్ ఆర్ రవిచంద్ర లయన్స్ క్లబ్ సభ్యులు రమణయ్య కళ్యాణ సాయి వై సనత్ రెడ్డి వై రమేష్ ఎంఈఓ రఘు పాల్గొన్నారు.

# చంద్రగిరి హైవేపై ప్రమాదాల పరంపర.. అధికారుల నిర్లక్ష్యమే కారణమా?



ప్రజా భూమి ప్రతినిధి చంద్రగిరి

చంద్రగిరి జాతీయ రహదారిపై తరచూ జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో వాహనదారులు ప్రాణాలు కోల్పోతుండడం ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా మల్లవరం జంక్షన్ నుంచి టోల్ ప్లాజా వరకు వందలాది మంది ప్రమాదాలకు బలైనప్పటికీ, శాశ్వత భద్రతా చర్యలు చేపట్టడంలో హైవే అధికారులు విఫలమవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. హైవేపై ఉన్న పెట్రోల్ బంకులు, డాబాలు, హోటళ్ల వద్ద రోడ్లపైనే వాహనాలను పార్క్ చేయడం వల్ల రాత్రి వేళల్లో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని వాహనదారులు చెబుతున్నారు. ముఖ్యంగా పెండిస్ కిచెన్, విష్ణుప్రియ హోటల్ ప్రాంతాల్లో అర్ధరాత్రి తర్వాత మద్యం సేవించే వారి వాహనాల పార్కింగ్ కారణంగా ప్రమాదాల ముప్పు మరింత పెరుగుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హైవే నిబంధనలకు విరుద్ధంగా ఫుట్‌పాత్‌లను తొలగించి అనధికారిక దారులు ఏర్పాటు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. పనపాకం వద్ద సరైన సూచిక బోర్డులు లేకపోవడంతో రాంగ్‌రూట్‌లో వచ్చే వాహనాలను ఢీకొనే ఘటనలు తరచూ చోటుచేసుకుంటున్నాయని పేర్కొంటున్నారు. రెండు నెలల క్రితం జిల్లా కలెక్టర్, ఎస్పీ ఆధ్వర్యంలో టోల్ ప్లాజా నుంచి తిరుపతి వరకు రోడ్డు భద్రత వారోత్సవాలు నిర్వహించినప్పటికీ, ఆ సమయంలో కేవలం కంటితుడుపు చర్యలుగా సోలార్ లైట్లు ఏర్పాటు చేయడం తప్ప శాశ్వత చర్యలు చేపట్టలేదని స్థానికులు విమర్శిస్తున్నారు. హైవేపై స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసినా వాటిపై తెల్లటి హెచ్చరిక పెయింట్ వేయకపోవడం వల్ల రాత్రి సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రమాదం జరిగిన తర్వాతే అధికారులు స్పందించే పరిస్థితి నెలకొన్నదని వాహనదారులు అంటున్నారు. ఇప్పటికైనా హైవే అధికారులు స్పందించి సూచిక బోర్డులు ఏర్పాటు చేయడం, అక్రమ పార్కింగ్‌ను నివారించడం, రోడ్డు భద్రతా ప్రమాణాలను కట్టుదిట్టంగా అమలు చేయడం ద్వారా ప్రమాదాలను అరికట్టాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.

# శ్రీ రాజరాజేశ్వరి వారాహి దేవిగా భక్తులకు కటాక్షం

## శ్రీ శ్యామల వారాహి దేవి ప్రత్యేక హోమం



ప్రజా భూమి ప్రతినిధి రామచంద్రపురం

ప్రపంచంలోని అత్యంత మహిమాన్వితమైన ఏకైక శ్రీ పాతాళ శ్వేత వారాహీ మహాక్షేత్రమైన తిరుపతి జిల్లా రామచంద్రాపురం మండలం రాయల చెరువు కట్ట దగ్గర ఉన్న శ్రీ శక్తిపీఠంలో నిర్వహించబడుతున్న శ్రీ వారాహీ నవరాత్రి మహోత్సవములలో 10వ రోజున అమ్మవారికి పంచామృతాభిషేకం, విశేష పూజలు అత్యంత వైభవంగా నిర్వహించబడినవి. ఈ సందర్భంగా కుటుంబ సఖ్యత, సౌభాగ్యం, భూ/గృహ సమస్యా పరిష్కారం కొరకు విశేష ఫలదాయకమైన శ్రీ రాజరాజేశ్వరి, శ్యామల, వారాహీ మంత్ర హోమంప్రత్యేక మంత్ర హోమం నిర్వహించబడినది. స్త్రీమూర్తులకు సువాసిని పూజా, మధ్యాహ్నం అమ్మవారికి మహా హారతి సమర్పించబడగా, సాయంత్రం 750 స్త్రీమూర్తులకు సువాసినీ పూజ నిర్వహణ,కళా నివేదన రూపంలో సంగీత, నాట్య, సాహిత్య సేవలు అమ్మవారికి అంకితం చేయబడినవి. రాత్రి వేళ పరమపూజ్య శ్రీ మాతాజీ వారి సమక్షంలో నవరాత్రి పూజ, దర్బారు సేవ జరుగగా, నడిచే దైవం జగద్గురువుల వారిచే మహా హారతి, అనంతరం అమ్మవారికి ఏకాంత సేవ నిర్వహించబడినవి. ఈ పుణ్యదినాన సుమారు 15,000 మందికి పైగా భక్తులు క్షేత్రాన్ని సందర్శించి అమ్మవారి దివ్య దర్శన భాగ్యాన్ని పొందారు. వచ్చిన భక్తులందరికీ అన్నప్రసాద వితరణ సమృద్ధిగా జరిగినది, ఇది గురు-దైవానుగ్రహానికి, పీఠం సేవాతత్పరతకు నిదర్శనంగా నిలిచింది.

# విద్యా వ్యవస్థను పటిష్టం చేయడమే ప్రభుత్వ లక్ష్యం

## ఎం ఎస్ఎంఈ డైరెక్టర్ చినబాబు





ప్రజా భూమి ప్రతినిధి,రామచంద్రాపురం

విద్యా వ్యవస్థను పటిష్టం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఏపీ ఎంఎస్ఎంఈ కార్పొరేషన్ డెవలప్మెంట్ డైరెక్టర్ చినబాబు అన్నారు. శుక్రవారం ఆయన రామచంద్రపురం మండలంలోని కుప్పం బాదూరు, జిహెచ్ఎస్ కమ్మపల్లి, కమ్మ కండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న మెగా పీటీఎం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు చెప్పారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థుల సమన్వయంతో ప్రభుత్వ పాఠశాలలకు పూర్వవైభవం చేకూరిందని పేర్కొన్నారు. తల్లికి వందనం డబ్బులను తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. లీప్ యాప్ వంటి సాంకేతిక వినూత్న విధానాల ద్వారా ప్రతి ఒక్క విద్యార్థి ప్రతిభను వెలికితీసేలా ప్రభుత్వం చర్యలను చేపట్టిందన్నారు. విద్యార్థులు చదువుతో పాటు నైతిక విలువలు పెంపొందించుకోవాలన్నారు, తల్లిదండ్రులు తమ పిల్లల చదువుపై రోజూ దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ లు మార్కొండయ్య నాయుడు, జయవేలు, హెచ్ఎం సుజనీకుమారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# మినీ గురుకులంలో మెగా పిటిఎం కార్యక్రమం



ప్రజా భూమి ప్రతినిధి, గూడూరు,

గూడూరు లోని మినీ గురుకుల బాలికల పాఠశాల నందు మెగా పి.టి.యమ్ . కార్యక్రమం చాలా ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీ కృష్ణ సేవా సమితి అధ్యక్షుడు డాక్టర్ మయూరి శ్యామ్ యాదవ్ పాల్గొని తల్లి తండ్రులను ఉద్దేశించి మాట్లాడుతూ మీరు మీ పిల్లలను ఇష్టపడి చదివించినప్పుడే వాళ్ళు భవిష్యత్తులో ఉన్నత స్థాయికి వచ్చి సమాజంలో గౌరవం మైన జీవితం లభిస్తుందని అన్నారు ఇదేవిధంగా తల్లిదండ్రులుగా మీకు కూడా సమాజంలో గౌరవం వారి ద్వారానే లభిస్తుందని, హెడ్మాస్టర్ కె వి రజని కుమారి మాట్లాడుతూ తల్లిదండ్రులు బాల్య వివాహాల జరిపితే కలిగే నష్టాలను గురించి గంజాయి, మత్తు పదార్థాలు వాడితే కలిగే అనర్థాలు గురించి ప్రసంగించి ఆ తదుపరి అందరి చేత ప్రతిజ్ఞ చేయించడం జరిగింది. ఆ తదుపరి మయూరి శ్యామ్ యాదవ్ దాతృత్వంతో ప్రతి నెల క్రమం తప్పకుండా జరిగే సామూహిక జన్మదినాలను జూలై నెలలో జన్మించిన 10 మంది విద్యార్థునులతో ఘనంగా నిర్వహించడం జరిగింది.... ఈ కార్యక్రమంలో తలిదండ్రులకు ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి ముఖ్య అతిథి మయూరి శ్యామ్ యాదవ్ చేతుల మీదుగా భహుమతులు అందించడం జరిగింది. హెడ్ మాస్టర్ కె వి . రజని కుమారి కార్యక్రమాన్ని ఎంతో ఆడంబరంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లలిత, పద్మావతి, రాజేశ్వరమ్మ , చంద్ర, అంకమ్మ, కల్పన, నాగూరమ్మ, లావణ్య , రమణమ్మ, తల్లిదండ్రులు, విద్యార్థునులు పాల్గొని జయప్రదం చేయడం జరిగింది....

# చిన్నారి యశ్విన్ పెద్ద మనసు: 'తల్లికి వందనం' నిధులతో బడికి సాయం!

**దివిపాలెం మెయిన్ పాఠశాలలో ఆదర్శ ఘటన: ప్రభుత్వ సాయంలో కొంత భాగం బడి అభివృద్ధికి అందజేసిన మూడో తరగతి విద్యార్థి**

**'మా బడి కోసం మా వంతు సాయం': చిన్న వయసులోనే గొప్ప ఆలోచనలతో ఆకట్టుకున్న యశ్విన్**



ప్రజా భూమి ప్రతినిధి, గూడూరు,

"చదువుకున్న బడికి, మనకోసం శ్రమించే గురువులకు మనవంతు సాయం చేయాలి" అనే గొప్ప ఆలోచన కేవలం పెద్దలకే వస్తుందనుకుంటే పొరపాటే! గూడూరు నియోజకవర్గం పరిధిలోని గూడూరు మండలం దివిపాలెం గ్రామంలో స్థానిక మండల ప్రజా పరిషత్ ఆదర్శ పాఠశాల లో మూడో తరగతి చదువుతున్న చిన్నారి తుపాకుల యశ్విన్ తన చిరుప్రాయంలోనే ఆదర్శనీయమైన నిర్ణయంతో అందరినీ ఆశ్చర్యపరిచాడు. ప్రభుత్వం అందించిన 'తల్లికి వందనం' పథకం ద్వారా తన బ్యాంకు ఖాతాలో పడిన 13000/- ఆర్థిక సహాయం నుండి ఏకంగా రూ. 5,000/- లను తాను చదువుతున్న పాఠశాల అభివృద్ధి కోసం, ఉపాధ్యాయుల సేవలను అభినందిస్తూ హెచ్ఎం కుందర్తి ప్రతాప్ కు అందజేసి తన గొప్ప మనసును చాటుకున్నాడు.

అభినందనల వెల్లువ: శుక్రవారం పాఠశాలలో నిర్వహించిన పేరెంట్-టీచర్ మీటింగ్ సందర్భంగా ఈ ఘటన చోటుచేసుకుంది. ఇంత చిన్న వయసులో సామాజిక స్పృహ, బడిపై మమకారం ప్రదర్శించిన యశ్విన్‌ను చూసి ఆ సమావేశానికి హాజరైన తల్లిదండ్రులు, గ్రామస్తులు ఆశ్చర్యపోయారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్ఈఓ లు మాధవరావు , మరియు కాంచన ప్రత్యేకంగా స్పందించి చిన్నారిని అభినందించారు. ?ఈ సేవా కార్యంలో చిన్నారికి అతని తల్లి సురేఖ పూర్తి మద్దతునిచ్చి, తన చేతుల మీదుగా ఈ మొత్తాన్ని పాఠశాలకు అందజేయడంలో సహకరించారు. ఈ అరుదైన మరియు స్ఫూర్తిదాయక కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు లత గ్రామ పెద్దలు పెరిమి కృష్ణ , అంగన్‌వాడీ ఇన్‌స్ట్రక్టర్ విజయలక్ష్మి , విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. చిన్న వయసులో విత్తిన ఈ సేవాభావం రేపు సమాజానికి ఒక పెద్ద వృక్షమై నీడనివ్వాలని ఆశిద్దాం. తోటి విద్యార్థులకు, భావి తరాలకు యశ్విన్ ఒక నిజమైన స్ఫూర్తి ప్రదాతగా నిలిచాడు.

# జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో "నంది విద్యా నటేశ్వరి" సాంస్కృతిక కార్యక్రమం ఘనంగా నిర్వహణ



ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి

తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలోని హిందూ ధర్మ ప్రచార పరిషత్, కంచి కామకోటి పీఠాధిపతుల ఆశీస్సులతో నిర్వహిస్తున్న "నంది విద్యా నటేశ్వరి" సాంస్కృతిక కార్యక్రమం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా శివ్ నాట్య కళా నిలయం నాట్య గురువు శ్రీమతి సంధ్య ఆధ్వర్యంలో ఆమె శిష్యులు రంజిత, తనయ, యువనకృతి, మాధురి, నిహారిక భరతనాట్య ప్రదర్శనలతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. భారతీయ సనాతన సంస్కృతి, సంప్రదా యాలను ప్రతిబింబించే విధంగా విద్యార్థి నులు ప్రదర్శించిన నృత్యాలు సభికుల నుంచి విశేష ప్రశంసలు అందుకున్నాయి. భక్తి, సంస్కృతి, నైతిక విలువలను విద్యార్థుల్లో పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని నిర్వాహకులు తెలిపారు. విద్యార్థుల్లో కళల పట్ల ఆసక్తిని పెంపొందించడంతో పాటు భారతీయ సాంస్కృతిక వారసత్వాన్ని తదుపరి తరాలకు చేరవేయడమే "నంది విద్యా నటేశ్వరి" కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని భరతనాట్య ప్రదర్శనలను ఆస్వాదించారు. కార్యక్రమం ముగింపులో నాట్య గురువు శ్రీమతి సంధ్యతో పాటు ప్రతిభ కనబరిచిన విద్యార్థినులను అభినందించి, వారి కళా ప్రతిభను కొనియాడారు.

# ప్రోత్సాహానికే సన్మానం - శాప్స్ చైర్మన్ రవి నాయుడు

## రాష్ట్ర స్థాయి విజేతకు నగదు పురస్కారం

## శిశు వికాస్ యోజన సేవలు అద్వితీయం



ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి

ప్రతి వ్యక్తి ప్రగతిని ప్రోత్సహించేందుకే సన్మాన కార్యక్రమాలు జరుగుతాయని, వారి సమగ్రాభివృద్ధికి నగదు పురస్కారాలు అందజేస్తారని, పివిఆర్ గ్రూప్ ఆర్గనైజేషన్ శిశువికాస్ యోజన సేవలు అద్వితీయమని సాప్స్ చైర్మన్ అనిమిని రవి నాయుడు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక సత్యనారాయణపురంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన మెగా పేరెంట్స్ మీట్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆ పాఠశాలకు చెందిన ఎనిమిదవ తరగతి విద్యార్థిని మణి రాష్ట్రస్థాయిలో 100,400 మీటర్ల రన్నింగ్ రేస్, లాంగ్ జంప్ లో విజయం సాధించడం అభినందనీయమన్నారు. వీరిని ప్రోత్సహిస్తూ అభినందించిన హెడ్మాస్టర్ సంధ్యారాణి, ఉపాధ్యాయ బృందాన్ని, శాలువా కప్పి నగదు పురస్కారాన్ని అందజేసిన శిశు వికాస్ యోజన రాష్ట్ర సూపర్వైజర్ పి వెంకటరమణ, జిల్లా కోఆర్డినేటర్ గుండ్రాజు సుకుమార్ రాజు ఇంచార్జ్ ధరణి కుమార్, ఉమాపతి లను అభినందించారు. ఈ సందర్భంగా శిశు వికాస్ యోజన విద్యార్థులకు అందిస్తున్న సేవలను సుకుమార్ వివరించారు. ఈ కార్యక్రమంలో సాప్స్ చైర్మన్ అని మినీ రవి నాయుడు, హెడ్మాస్టర్ సంధ్యారాణి, ఎడిఫై స్కూల్ అధినేత ప్రణీత్,తాజా మాజీ కార్పొరేటర్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి అనిత యాదవ్, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వాసు, సర్వ శిక్ష అభియాన్ ప్రతినిధి మేఘనాథ్, శిశు వికాస్ యోజన ప్రతినిధులు పూసపాటి వెంకటరమణ, సుకుమారి రాజు,ధరణి కుమార్, పి ఈ టి మాస్టర్లు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# విద్యాభివృద్ధికి అండగా ఉంటాం

## -: భాస్కర్ ముదిరాజ్,బాలసుబ్రమణ్యం



ప్రజాభూమి ప్రతినిధి తొట్టంబేడు

తొట్టంబేడు మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో మెగా పేరెంట్స్-టీచర్స్ మీటింగ్ 4.0 ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన తంగేళ్లపాలెం సింగిల్ విండో బ్యాంకు చైర్మన్ బీమాల భాస్కర్ ముదిరాజ్, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి చిల్లకూరు బాలసుబ్రమణ్యం(మణి) మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమన్వయం అవసరమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థ బలోపేతానికి కృషి చేస్తోందని, విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నతంగా ఎదగాలని సూచించారు. పాఠశాల అభివృద్ధికి సహకరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం పాఠశాలలో ఏర్పాటు చేసిన మంచినీటి శుద్ధి ప్లాంట్‌ను వారు పరిశీలించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ అయ్యప్ప, ఎ. వెంకటేష్, చందు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# నేడు తొలి ఏకాదశి శ్రీమహావిష్ణువు యోగ నిద్రలోకి ఎందుకు వెళ్తారు?

## ఈ పర్వదినం వెనుకున్న విశిష్టత, పురాణ కథ ఇదే!

**(ఇసక పల్లి శివ ప్రసాద్ శర్మ)**

ప్రజా భూమి ప్రతినిధి, గూడూరు,

2026లో జూలై 25న తొలి ఏకాదశి- ఈ రోజు శ్రీమహావిష్ణువు యోగనిద్రలోకి ప్రవేశిస్తారని పురాణ విశ్వాసం- తొలి ఏకాదశి ప్రాముఖ్యత, ఏకాదశి ఆవిర్భావ కథ ఈ కథనంలో తెలుసుకుందాం.

హిందూ ధర్మచక్రం: తెలుగు పంచాంగం ప్రకారం తిథుల్లో ఏకాదశి విశిష్టమైనది. ఒక సంవత్సరంలో వచ్చే 24 ఏకాదశుల్లో కొన్ని చాలా పవిత్రమైనవి. వాటిల్లో ఆషాఢ మాసంలో వచ్చే తొలి ఏకాదశి, కార్తీక శుద్ధ ఏకాదశి, మార్గశిర మాసంలో వచ్చే ముక్కోటి ఏకాదశి అత్యంత పవిత్రమైనవి. పురాణాల ప్రకారం ఈ మూడు ఏకాదశులు శ్రీ మహావిష్ణువుకు అత్యంత ప్రీతికరమైనవని తెలుస్తోంది.

తొలి ఏకాదశి ఎప్పుడు? ఆషాఢ మాసంలో శుక్ల పక్షంలో వచ్చే ఏకాదశిని తొలి ఏకాదశి అంటారు. ఈ ఏడాది జులై 25, శనివారం ఆషాఢ శుద్ధ ఏకాదశి సందర్భంగా ఈ రోజునే తొలి ఏకాదశి పర్వదినాన్ని జరుపుకోవాలి.

తొలి ఏకాదశితో తోసుకొచ్చే పండుగలు:హిందూ సంప్రదాయంలో పండుగలకు అత్యంత ప్రాధాన్యం ఉంది. తొలి ఏకాదశి హిందువులకు అత్యంత విశిష్టమైన పండుగ. ఈ ఏకాదశినే శయన ఏకాదశి అని దేవశయని ఏకాదశి అని కూడా అంటారు. అతి ప్రాచీన తెలుగు పంచాంగం ప్రకారం తొలి ఏకాదశి నుంచి తెలుగు సంవత్సరంలో పండుగలు ప్రారంభం అవుతాయి. అందుకే 'తొలి ఏకాదశితో పండుగలు తోసుకొస్తాయి' అనే నానుడి ప్రచారం లోకి వచ్చింది. ఈ తొలి ఏకాదశి రోజున ఉపవాస జాగారాలతో శ్రీమహావిష్ణువును పూజిస్తే కోరిన కోర్కెలన్నీ నెరవేరుతాయని ప్రతీతి.

తొలి ఏకాదశి విశిష్టత: శ్రీ మహా విష్ణువు యోగ నిద్రలోకి ప్రవేశించే పుణ్యతిథి తొలి ఏకాదశి. ఈ ఏకాదశి రోజు స్వామి నిద్రకు ఉపక్రమిస్తాడు కనుక ఈ రోజును శయనేకాదశి అని కూడా అంటారు. తొలి ఏకాదశి రోజున శ్రీ మహావిష్ణువు క్షీరసాగరంలో శేషతల్పంపై యోగనిద్రలోకి వెళ్తాడని పురాణాలు కూడా చెబుతున్నాయి. తొలి ఏకాదశి రోజు యోగనిద్రలోకి వెళ్లే శ్రీ మహావిష్ణువు తిరిగి 4 నెలల తరువాత అంటే కార్తిక శుద్ధ ఏకాదశి రోజు మేల్కొంటాడని విష్ణు పురాణంలో, స్కంద పురాణంలో వివరించి ఉంది. ఈ నాలుగు నెలల కాలాన్ని చాతుర్మాసం అని అంటారు. ఈ ఈ చాతుర్మాసం నాలుగు నెలల కాలం ఆధ్యాత్మిక సాధనకు, పూజలు, వ్రతాలకు, దానధర్మాలకు అత్యంత పవిత్రమైనదిగా భావిస్తారు. అలాగే శ్రీమహావిష్ణువు యోగనిద్రలోకి వెళ్లడంతో సృష్టి, స్థితి, లయ కారకత్వాలు పరమ శివుడికి, ఇతర దేవతలకు అప్పగించబడతాయని కూడా విశ్వాసం.

ఏకాదశి ఎలా ఏర్పడింది?

పురాణాల ప్రకారం శ్రీ మహావిష్ణువు మురాసురుడనే రాక్షసునితో యుద్ధం చేస్తూ అలిసిపోయి సింహావతి అనే గుహలో విశ్రాంతి తీసుకుంటున్న సమయంలో ఆ రాక్షసుడు మాయోపాయంతో శ్రీ మహావిష్ణువును సంహరించాలని చూస్తాడు. అప్పుడు విష్ణుమూర్తి శరీరం నుంచి యోగమాయ శక్తి రూపంలో వెలువడి మురాసురుని సంహరించింది. ఈ శక్తి స్వరూపం పౌర్ణమి నుంచి 11వ రోజు జన్మించినందున విష్ణువు ఆ శక్తిని ఏకాదశి తిథిగా ఉంటూ పూజలందుకోమని వరాన్ని అనుగ్రహించాడు. ఆనాటి నుంచి ఆ శక్తి స్వామికి ప్రియమైన ఏకాదశి తిథిగా పూజలందుకుంటోంది.

తొలి ఏకాదశి పూజా విధానం:తొలి ఏకాదశి రోజున ఉపవాసం ఉండి, విష్ణుమూర్తిని పూజించడం వల్ల సకల పాపాలు తొలగిపోయి, కోరిన కోరికలు నెరవేరుతాయని భక్తుల ప్రగాఢమైన విశ్వాసం. ఈ ఒక్క ఏకాదశి రోజున ఉపవాసం, జాగరణ దీక్ష చేస్తే కోటి పుణ్యాలు లభిస్తాయని




పండితులు చెబుతారు. ఈ రోజున సూర్యోదయంతో నదీస్నానం చేయాలి. వీలుకాని వారు ఇంట్లో స్నానం చేసే నీటిలో సమస్త నదీ జలాలు ఆవాహన చేసుకుని స్నానం చేస్తే నదీ స్నానం చేసిన ఫలితం దక్కుతుంది. పూజామందిరంలో ఆవునేతితో దీపారాధన చేసి, లక్ష్మీ నారాయణులను ప్రతిష్ఠించుకోవాలి. విష్ణుమూర్తిని పంచామృతాలతో, గంగా జలంతో అభిషేకించాలి. పసుపు రంగు పూలతో, తులసి దళాలతో శ్రీమన్నారాయణుని పూజించాలి. విష్ణు సహస్రనామ పారాయణ విధిగా చేయాలి. శ్రీ మహావిష్ణువుకు ప్రీతికరమైన చక్రపొంగలి, కొబ్బరికాయ, అరటిపండ్లు వంటి ప్రసాదాలు నివేదించాలి. చివరగా మంగళ హారతి ఇచ్చి నమస్కరించుకోవాలి.

ఆలయ దర్శనం: సాయంకాల సమయంలో విష్ణువు ఆలయానికి వెళ్లి విష్ణువును దర్శించి, తులసి మాలను సమర్పించాలి. ఈ రాత్రంతా భగవంతుని కీర్తనలు పాడుతూ, భాగవత కథలు వింటూ జాగారం చేయాలి.

తొలి ఏకాదశి ప్రత్యేకం పేలపిండి:

తొలి ఏకాదశి రోజు వడ్లతో చేసిన పేలాల్లో బెల్లం, యాలకులు వేసి దంచి మెత్తని పిండిగా చేసి శ్రీ మహావిష్ణువుకు నివేదించి ప్రసాదంగా స్వీకరిస్తారు. ఆరోగ్యప్రదాయిని అయిన ఈ పేలపిండిని సేవించడం వలన వర్షాకాలంలో వచ్చే వ్యాధుల నుంచి రక్షణ లభిస్తుందని విశ్వాసం. అలాగే రైతులు తమ పంట పొలాల్లో ఈ పేలపిండిని చల్లుతారు. ఇలా చేయడం వలన వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండుతాయని నమ్మకం.

ఏకాదశి ఉపవాసం సమయం:ఉపవాసం చేసేవారు శుక్రవారం సాయంత్రం అనగా జూలై 24 వ తేదీ సూర్యాస్తమయం నుండే ఉపవాసం ప్రారంభం చేయాలి.

శుక్రవారం సాయంత్రం నుండి నియమాలు వర్తిస్తాయి. శుక్రవారం సాయంత్రం తేలికపాటి సాత్విక పదార్థాలు స్వీకరించాలి కానీ, భోజనం చేయకూడదు.

రాత్రి బ్రహ్మచర్యం పాటించాలి.

శనివారం విధులన్నీ నియమంగా చేయాలి.

ఆదివారం ఉదయం స్వామికి అర్చన చేసి నివేదన చేసిన పదార్థాన్ని ద్వాదశి ఘడియలు ముగియక ముందే ఎంత త్వరగా అయిన ఫరవాలేదు కానీ మ. 1:30 లోపు భోజనం చేసేయాలి.

ద్వాదశి పారణ:మరుసటి రోజు ఉదయాన్నే తలారా స్నానం చేసి నిత్య పూజాదికాలు ముగించుకోవాలి. ద్వాదశి ఘడియలు సమీపించగానే ఒక సద్బ్రాహ్మణునికి భోజనం పెట్టి దక్షిణ తాంబూలాలు సమర్పించి నమస్కరించాలి. అనంతరం భోజనం చేసి ఉపవాసాన్ని విరమించవచ్చు. ఏకాదశి నియమాలు పాటించేవారు జ్ఞానవంతులు అవుతారని, గత జన్మ పాపాలు తొలగి మోక్షానికి అర్హులు అవుతారని పురాణాలు చెబుతున్నాయి. ఈ తొలి ఏకాదశి పండుగను మనం కూడా శాస్త్రోక్తంగా జరుపుకొని శ్రీహరి అనుగ్రహానికి పాత్రులవుదాం.

# రవాణా రంగానికి డిజిటల్ వేదిక - ఆంధ్రప్రదేశ్ ట్రాన్స్‌పోర్ట్ కనెక్ట్

## లారీ యజమానులు, ట్రాన్స్‌పోర్ట్ ఆపరేటర్లు, ఫ్లీట్ ఓనర్లకు సమగ్ర డిజిటల్ లాజిస్టిక్స్ వేదిక

**-జిల్లా రవాణా శాఖ అధికారి కొర్రపాటి మురళీమోహన్**

ప్రజా భూమి ప్రతినిధి,తిరుపతి

రాష్ట్ర రవాణా కమిషనర్ ఆదేశాల మేరకు ఆంధ్రప్రదేశ్ మారిటైమ్ బోర్డు (ఏపీ ఎంబి) మరియు యూనిఫైడ్ లాజిస్టిక్స్ ఇంటర్‌ఫేస్ ప్లాట్‌ఫామ్ (యు ఎల్ ఐ పి) సంయుక్త ఆధ్వర్యంలో రూపొందిస్తున్న "ఆంధ్రప్రదేశ్ ట్రాన్స్‌పోర్ట్ కనెక్ట్ డిజిటల్ వేదిక ద్వారా రాష్ట్రంలోని లారీ యజమానులు, ట్రాన్స్‌పోర్ట్ ఆపరేటర్లు, ఫ్లీట్ ఓనర్లు, సరుకు రవాణా సంస్థలు మరియు ఇతర రవాణా భాగస్వాములను ఒకే డిజిటల్ లాజిస్టిక్స్ వేదికపైకి తీసుకురావడమే ప్రధాన లక్ష్యమని తిరుపతి జిల్లా రవాణా శాఖ అధికారి కొర్రపాటి మురళీమోహన్ తెలిపారు. సరుకు రవాణా సంస్థలు, లారీ యజమానులు మరియు ట్రాన్స్‌పోర్ట్ ఆపరేటర్లు పోర్టల్‌లో తమ సంస్థలను నమోదు చేసుకోవచ్చని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ డిజిటల్ వేదిక లిలిజాతీయ యూనిఫైడ్ లాజిస్టిక్స్ ఇంటర్‌ఫేస్ ప్లాట్‌ఫామ్ తో అనుసంధానమై రవాణా రంగంలో వేగం, పారదర్శకత, సామర్థ్యాన్ని పెంపొందించే విధంగా రూపొందించబడిందన్నారు. పోర్టల్‌లో నమోదు చేసుకోవడం ద్వారా ట్రాన్స్‌పోర్టర్లు, లారీ యజమానులు, ఫ్లీట్ ఓనర్లు తమ వివరాలను ప్రభుత్వ ఆధారిత డిజిటల్ లాజిస్టిక్స్ వ్యవస్థలో నమోదు చేసుకునే అవకాశం లభిస్తుందని తెలిపారు. ఈ పోర్టల్ ద్వారా భవిష్యత్తులో డిజిటల్ సేవలను వేగవంతంగా పొందడంతో పాటు, ఆన్‌లైన్ ధ్రువీకరణ, తక్కువ పేపర్‌వర్క్, ప్రభుత్వ శాఖల మధ్య వేగవంతమైన సమాచార మార్పిడి, సమర్థవంతమైన సమన్వయం, పారదర్శక సేవల అందుబాటు, విస్తృత వ్యాపార అవకాశాలు వంటి అనేక ప్రయోజనాలు కలుగనున్నాయని పేర్కొన్నారు. రవాణా రంగంలో డిజిటలీకరణను ప్రోత్సహిస్తూ, ప్రభుత్వ సేవలను మరింత



సులభతరం చేయడంలో ఈ డిజిటల్ వేదిక కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు. ఈ కార్యక్రమం దేశవ్యాప్తంగా అమలవుతున్న యూనిఫైడ్ లాజిస్టిక్స్ ఇంటర్‌ఫేస్ ప్లాట్‌ఫామ్ మరియు జాతీయ లాజిస్టిక్స్ విధానం లక్ష్యాలకు అనుగుణంగా అమలు చేయబడుతోందని రాష్ట్ర రవాణా కమిషనర్ పేర్కొన్నట్లు ఆయన తెలిపారు. తిరుపతి జిల్లాలోని ట్రాన్స్‌పోర్టర్లు, లారీ యజమానులు, సరుకు రవాణా సంస్థలు, పరిశ్రమల ప్రతినిధులు, ఫ్లీట్ ఓనర్లు మరియు ఇతర వాహన యజమానులు పోర్టల్‌లో నమోదు చేసుకొని ప్రభుత్వం అందిస్తున్న డిజిటల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. "సాంకేతికతను సమర్థవంతంగా వినియోగించి ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన, నాణ్యమైన రవాణా సేవలను అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం. ఆంధ్రప్రదేశ్ ట్రాన్స్‌పోర్ట్ కనెక్ట్ డిజిటల్ వేదిక ఆ లక్ష్య సాధనలో కీలక మైలురాయిగా నిలుస్తుంది. రవాణా రంగానికి చెందిన ప్రతి ఒక్కరూ ఈ పోర్టల్‌లో నమోదు చేసుకొని ప్రభుత్వ డిజిటల్ సేవలను సులభంగా పొందడంతో పాటు, రవాణా రంగ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరుతున్నాను" అని తిరుపతి జిల్లా రవాణా శాఖ అధికారి కొర్రపాటి మురళీమోహన్ తెలిపారు.

# మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మేగా పిటిఎం4.0 కార్యక్రమం..!

ప్రజా భూమి ప్రతినిధి, చంద్రగిరి:

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖ అభివృద్ధి కోసం చేపడుతున్న కార్యక్రమాల్లో భాగంగా "ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యను అందించడంతో పాటు, సమగ్ర అభివృద్ధి సాధించాలనే లక్ష్యంతో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మధ్య భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడమే ముఖ్య ఉద్దేశంగా" రాష్ట్రవ్యాప్తంగా ప్రతి ప్రభుత్వ మరియు ఎయిడెడ్ పాఠశాలల్లో , కళాశాలల్లో "మెగా పిటిఎం 4.0 కార్యక్రమం"ను నిర్వహించాలన్న ఆదేశాలతో చంద్రగిరి మండల విద్యాశాఖ అధికారుల ఆధ్వర్యంలో చంద్రగిరి మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాల నందు "మెగా పిటిఎం 4.0 కార్యక్రమం" ఘనంగా





నిర్వహించడం జరిగినది. పలు గ్రామాల్లో ఉపాధ్యాయులు ఇంటింటికి వెళ్లి ఈ కార్యక్రమంకు హాజరు కావాలంటూ విద్యార్థుల తల్లిదండ్రులను స్వయంగా ఆహ్వానించడం వలన పెద్ద సంఖ్యలో కార్యక్రమం కు హాజరు కావడం జరిగినది. అదేవిధంగా ఈ కార్యక్రమంకు ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, దాతలు,పూర్వ విద్యార్థులు పాల్గొనే విధంగా సమన్వయం చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శింప చేశారు. అలాగే విద్యార్థుల తల్లిదండ్రులకు వివిధ రకాల ఆటల పోటీలను నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా చంద్రగిరి మండల విద్యాశాఖ అధికారులు ఎస్. లలిత కుమారీ, మరియు కె.భాస్కర్ బాబు సంయుక్తంగా మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చదువులో ప్రగతి,హోలిస్టిక్ ప్రోగ్రెస్ రిపోర్టులు, ఆరోగ్య కార్డులను తల్లిదండ్రులకు అందజేసి వాటిపై ఉపాధ్యాయులు లోతుగా చర్చించాలని, విద్యార్థుల్లో మెరుగుపడాల్సిన అంశాలు, పాఠశాల అభివృద్ధి కార్యక్రమాలపై అభిప్రాయాలు సేకరించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హాజరయ్యే వారందరికీ రుచికరమైన మరియు పౌష్టిక మధ్యాహ్న భోజన ఏర్పాట్లను చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటరమణారెడ్డి , మరియు ప్రభుత్వ బాలురు పాఠశాల ప్రధానోపాధ్యాయులు శారద, ఐతేపల్లి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు దేవికా దేవి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ప్రజాప్రతినిధులు, ఆయా గ్రామపెద్దలు, దాతలు, విద్యార్థులు పాల్గొనడం జరిగినది.

# ప్రభుత్వ పాఠశాలల్లో పండుగ వాతావరణంలో 'మెగా పేరెంట్-టీచర్ మీటింగ్'..!

## 'మెగా పేరెంట్-టీచర్ మీటింగ్'కు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే పులివర్తి నాని..

ప్రజా భూమి ప్రతినిధి, పాకాల:

నియోజకవర్గం పరిధిలోని పాకాల మండలం లోని మొగరాల,గాదంకి, పాకాల, దామలచెరువు, ఓసి పల్లి జిల్లా ఉన్నత పాఠశాల,ప్రాథమిక పాఠశాలలో మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశం శుక్రవారం నిర్వహించారు.మొగరాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 'మెగా పేరెంట్-టీచర్ మీటింగ్'కు ముఖ్య అతిథిగా చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని విచ్చేశారు.చంద్రగిరి ఎమ్మెల్యే కి విద్యార్థులు స్వాగతం పలికారు.ఈ సందర్భంగా చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఉన్నత స్థాయి చేరాలంటే ప్రతి ఒక్కరూ చదువుకోవాలని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కార్పొరేట్ స్కూలుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్యను తీసుకువచ్చిందని అన్నారు.గతంలో ఒక పిల్లవాడిని చదివించే దానికి తల్లిదండ్రులు చాలా ఇబ్బందులు పడుతున్న పరిస్థితులు ఏర్పడ్డాయి,కానీ ప్రస్తుత ప్రభుత్వం ఎంతమంది పిల్లలు ఉన్నా వారికి తల్లికి వందనం పథకం తీసుకువచ్చి వారికి




చేదోడు ఉందన్నారు.ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికీ ఈ పథకాన్ని అందిచి విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేస్తోందని చెప్పారు.పేదరికం కారణంగా మధ్యలోనే చదువు మానేసే విద్యార్థులకు ఈ పథకం ఒక గొప్ప భరోసాగా నిలుస్తుంది.తల్లులకు నేరుగా ఆర్థిక సహాయం అందడం వల్ల,వారు తమ పిల్లల చదువు పై ప్రత్యేక శ్రద్ధ పెట్టడానికి వీలవుతుందని చెప్పారు.పిల్లలకు జన్మనిచ్చిన వారు తల్లిదండ్రులైతే,విద్యార్థులకు ఉపాధ్యాయులు దేవుడిచ్చిన తల్లిదండ్రులు అని పేర్కొన్నారు. పాఠశాలలో తల్లిదండ్రులకు,విద్యార్థులకు ఆట పోటీలు నిర్వహించి ప్రతిభ కనపరిచిన వారికి బహుమతులు ప్రధానం చేశారు.గత ప్రభుత్వంలో'తల్లికి వందనం'పథకం ఒక కుటుంబంలో ఒక్కరికే పరిమితమై ఉండేదని, ప్రస్తుతం అర్హత ఉన్న ప్రతి విద్యార్థికి ఈ పథకం వర్తించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి విద్యార్థి కుటుంబానికి పథకం కింద ఆర్థిక సాయం నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ అవుతుందని స్పష్టం చేశారు.రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్,విద్య,ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ విద్యాభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారని కొనియాడారు.ఈనాటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంత్రిగా ఉన్న సమయంలో పాకాల మండలం పులివర్తివారిపల్లికి వచ్చిన సందర్భంలో ఆయనను చూసి,ఒకరోజు చంద్రగిరి నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా ప్రజలకు సేవ చేయాలనే సంకల్పం నాకు కలిగింది అని ఎమ్మెల్యే తెలిపారు.ఆ రోజు కన్న కలే నేడు ప్రజల ఆశీర్వాదంతో నిజమైందని,లక్ష్యం ఉంటే ఎంతటి సాధన అయినా సాధ్యమేనని పేర్కొన్నారు.ఈ సందర్భంగా పాకాల జడ్పిటిసి నంగా పద్మజ రెడ్డి,డీఈఓ కుమార్ మాట్లాడుతూ మెగా పేరెంట్--టీచర్స్ సమావేశాలు విద్యార్థుల అభ్యాస స్థాయిని తల్లిదండ్రులకు నేరుగా తెలియజేసే ఉత్తమ వేదికగా నిలుస్తున్నాయని అన్నారు.ప్రతి విద్యార్థి ప్రోగ్రెస్ కార్డును తల్లిదండ్రులకు వివరించి,ఏ సబ్జెక్టులో మెరుగుదల అవసరమో ఉపాధ్యాయులు ప్రత్యేకంగా సూచనలు అందిస్తున్నారని తెలిపారు. పిల్లలపై ఒత్తిడి చేయకుండా వారి ప్రతిభ,ఆసక్తులకు అనుగుణంగా ప్రోత్సహించాలని తల్లిదండ్రులకు సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి కుమార్,మండల విద్యాశాఖ అధికారులు బాబ్జి,లింగయ్య,ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు,తల్లిదండ్రులు, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# నీట్ లీకేజీలకు కేంద్ర మంత్రి రాజీనామా చేయాలి

## విద్యాసంస్థల బంద్ విజయవంతం

## ఎన్‌టిఏను రద్దు చేయాలి: ఏఐఎస్పీ,సిపిఐ




ప్రజాభూమి,పులివెందుల

నీట్ ప్రశ్నాపత్రాల లీకేజీలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని సిపిఐ, విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. శుక్రవారం విద్యార్థి యువజన సంఘాలు తలపెట్టిన విద్యాసంస్థల బంద్‌కు పులివెందులలో సిపిఐ, ప్రజాసంఘాల మద్దతుతో ఏఐఎస్ఎఫ్, ఏఐఎస్పి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకటరాములు మాట్లాడుతూ నీట్ లీకేజీలపై నెల రోజులుగా జంతర్ మంతర్ వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థులపై కేంద్ర ప్రభుత్వం లాఠీచార్జ్ చేయించడం దురదృష్టకరమన్నారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు దినేష్ కుమార్ మాట్లాడుతూ విద్యను కార్పొరేట్ వ్యాపారంగా మార్చడమే నీట్ కుంభకోణాలకు కారణమని విమర్శించారు. ఎన్‌టిఏను రద్దు చేసి పారదర్శకమైన పరీక్షా వ్యవస్థను ఏర్పాటు చేయాలని, సుప్రీంకోర్టు పర్యవేక్షణలో విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్, ఏఐఎస్పి, సిపిఐ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# లింగాల మండలంలో జిల్లా మైక్రో ఇరిగేషన్ పీడీ పర్యటన



ప్రజాభూమి లింగాల

జిల్లా సూక్ష్మ సేద్య (మైక్రో ఇరిగేషన్) ప్రాజెక్టు డైరెక్టర్ బి.వి. రమణ శుక్రవారం లింగాల మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా రైతుల పొలాలను సందర్శించి డ్రిప్, స్ప్రింక్లర్ వంటి సూక్ష్మ సేద్య విధానాల అమలు తీరును పరిశీలించారు. రైతులతో మాట్లాడిన ఆయన నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవడంతో పాటు ఆధునిక సాగు పద్ధతులను అవలంబించాలని సూచించారు. అనంతరం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మెగా పేరెంట్స్ మీటింగ్‌లో పాల్గొన్నారు. విద్యార్థుల విద్యాభివృద్ధిలో తల్లిదండ్రుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొంటూ, పాఠశాలల అభివృద్ధికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో సంబంధిత శాఖల అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, రైతులు పాల్గొన్నారు.

# తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలి

## - మెగా పీటిఎం 4.0లో మండల ప్రత్యేక అధికారిణి నాగసుధా



ప్రజాభూమి, వేంపల్లె

విధ్యార్ధులు తమ తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని సివిల్ సప్లయ్ జిల్లా మేనేజర్, మండల ప్రత్యేక అధికారిణి నాగసుధా సూచించారు. శుక్రవారం రామిరెడ్డిపల్లి గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యకు సంబంధించి అన్ని సౌకర్యాలు, వసతులు కల్పిస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాలలను ఓవైపు బలోపేతం చేస్తూ మరోవైపు విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మధ్య సంబంధాలను మరింత బలపరిచేందుకు మెగా పీటిఎం కార్యక్రమాన్ని శ్రీకారం చుట్టిందన్నారు. అనంతరం విద్యార్థులు సాధించిన ప్రగతిని తల్లిదండ్రులకు వివరించారు. లీప్ యాప్ ని డౌన్లోడ్ చేయించడం, హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులను విద్యార్థులకు పంపిణీ చేశారు. తల్లిదండ్రులకు ఆటల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఇఓ స్టాలిన్ ఐజాక్, హెచ్ఎం సంజీవరెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వర్షాల కోసం ఎగువపల్లిలో 'తాళ భజన' దీక్షలు

## మూడు రోజుల పాటు అహోరాత్రుల భక్తి పారవశ్యం

## పెద్దమ్మ తల్లికి 101 బిందెలతో జలాభిషేకం



ప్రజాభూమి లింగాల

సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని, గ్రామంలో సుఖశాంతులు, ఆయురారోగ్యాలు వర్ధిల్లాలని ఆకాంక్షిస్తూ లింగాల మండలం ఎగువపల్లి గ్రామంలో ప్రజలు సంప్రదాయబద్ధంగా మూడు రోజుల ప్రత్యేక భక్తి దీక్షలను చేపట్టారు. గ్రామ పెద్దల ఆధ్వర్యంలో గురువారం ప్రారంభమైన ఈ దీక్షలు శనివారం వరకు నిరంతరాయంగా కొనసాగనున్నాయి. రాత్రింబవళ్లు భక్తులు చేస్తోన్న తాళ భజనలు, తిరుగు భజనలతో ఎగువపల్లి గ్రామమంతా ఆధ్యాత్మిక శోభతో మురిసిపోతోంది.

**గ్రామ దేవతకు ప్రత్యేక పూజలు**

ఈ దీక్షల్లో భాగంగా గ్రామ దేవత అయిన పెద్దమ్మ తల్లికి 101 బిందెల నీటితో జలాభిషేకం నిర్వహించారు. అనంతరం పసుపు, కుంకుమ, కొబ్బరికాయలు, కర్పూరం, పూలతో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా భజన భక్తులకు గ్రామస్థుల సహకారంతో అల్పాహారం, అన్నదాన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

**శనివారం కొండపై వెలసిన స్వామివారి దర్శనం**

శనివారం మధ్యాహ్నం గ్రామంలోని కొండపై వెలసిన శ్రీ చింతల వెంకటరమణ స్వామి దేవుని పాదాలు, ఆలయాన్ని భజన బృందాలు, గ్రామ పెద్దలు, మహిళలు, యువత, చిన్నారులు పెద్ద ఎత్తున చేరుకుని దర్శించుకోన్నారు. అక్కడ కూడా నిరంతర భజనలు, తిరుగు భజనలు నిర్వహించి, స్వామివారికి నైవేద్యం సమర్పించి హారతులు సమర్పించారు .

**చుట్టుపక్కల గ్రామాల్లో పాదయాత్ర**

కొండ దిగివచ్చిన అనంతరం భజన బృందాలు ఈదులపల్లి, రంగాపురం, బండ్లపల్లి, మారుతాడు, దామానుపల్లె తదితర గ్రామాల మీదుగా భజనలు చేస్తూ పాదయాత్ర కొనసాగించారు.

**ఆదివారం దీక్షల ముగింపు**

ఆదివారం ఉదయం 6 గంటలకు భజన బృందాలు తిరిగి ఎగువపల్లి గ్రామానికి చేరుకుని, ఊరంతా భజనలతో ప్రదక్షిణ చేస్తాయి. ఆ తర్వాత గ్రామంలోని బొడ్రాళ్ల స్వామికి 101 బిందెల నీటితో అభిషేకం నిర్వహించి, చివరగా శ్రీ సీతారాముల ఆలయం వద్ద ప్రత్యేక పూజలతో ఈ మూడు రోజుల భక్తి దీక్షను మంగళకరంగా ముగించారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు, యూత్, చిన్నారులు, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేశారు .

# ఆర్‌జీయూకేటీ-ఆర్‌కే వ్యాలీలో స్కిల్ సెన్సస్--2026

## - 691 మంది బీటెక్ నాలుగో సంవత్సరం విద్యార్థుల హాజరు




ప్రజాభూమి, వేంపల్లె

రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ (ఆర్జీయూకేటీ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్కిల్ సెన్సస్--2026 పరీక్షను శుక్రవారం ఆర్‌జీయూకేటీ--ఆర్‌కే వ్యాలీ క్యాంపస్‌లో ఆన్‌లైన్ విధానంలో విజయవంతంగా నిర్వహించారు. ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ జి. విజయ్ ప్రకాష్ మాట్లాడుతూ, విద్యార్థుల్లోని ప్రాథమిక ఉద్యోగ నైపుణ్యాలను అంచనా వేయడం, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా వారిని తీర్చిదిద్దడం ఈ పరీక్ష ముఖ్య ఉద్దేశమని తెలిపారు. క్యాంపస్‌లోని వివిధ శాఖలకు చెందిన 691 మంది బీటెక్ నాలుగో సంవత్సరం విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. 23 తరగతి గదుల్లో జనరల్ ఆప్టిట్యూడ్, రీజనింగ్, ఇంగ్లీష్ కంప్రహెన్షన్, పైథాన్ ప్రోగ్రామింగ్ అంశాలపై పరీక్ష నిర్వహించారు. అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డా. పి. రవి కుమార్, డీన్ (అకాడమిక్స్) డా. రమేష్ డౌండ్కర్ తదితరుల పర్యవేక్షణలో అధ్యాపకులు, ఐటీ బృందం సమన్వయంతో పరీక్ష ఎలాంటి అంతరాయం లేకుండా సజావుగా పూర్తయింది. స్కిల్ సెన్సస్--2026 ద్వారా విద్యార్థుల నైపుణ్యాలను గుర్తించి, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు విద్యార్థులకు డిజిటల్ స్కిల్ కార్డులు అందజేయనున్నట్లు అధికారులు తెలిపారు.

# ముచ్చుకోన చెరువుకు కృష్ణా జలాలు విడుదల చేయాలి

- **నేలవరం తాండా రైతుల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి**
- **బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పుష్పలత నాయక్**



ప్రజాభూమి, వేంపల్లె

ముచ్చుకోన చెరువుకు కృష్ణా జలాలు విడుదల చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పుష్పలత నాయక్ ప్రభుత్వాన్ని కోరారు. మండలంలోని నేలవరం తాండాలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్‌తో కలిసి రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పుష్పలత నాయక్ మాట్లాడుతూ నేలవరం తాండాలో రైతులు 12 నుంచి 18 మార్లు బోర్లు వేసినా నీరు పడని దుస్థితి నెలకొందన్నారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు చెబుతున్న నేపథ్యంలో సకాలంలో వర్షాలు లేకపోతే ఈ ప్రాంత రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఉందన్నారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ముచ్చుకోన చెరువుకు కృష్ణా జలాలు విడుదల చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు. చెరువుకు నీరు చేరితే బక్కనగారిపల్లె, వెలమవారిపల్లె, చింతరాంపల్లె గ్రామాల్లో భూగర్భ జలాలు పెరిగి ఈ ప్రాంత రైతాంగానికి ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకుడు రంగారెడ్డి, బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబోయిన రవియాదవ్, రైతులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు విలువలతో కూడిన విద్య అవసరం వెంకటరామిరెడ్డి

## బ్రాహ్మణపల్లిలో మెగా పేరెంట్స్ మీటింగ్ 4.0

## విద్యార్థుల భవిష్యత్తు కోసం లోకేష్ కృషి



ప్రజాభూమి,పులివెందుల

విద్యార్థులకు మార్కుల కంటే విలువలు ముఖ్యమని టీడీపీ మాజీ పట్టణ అధ్యక్షుడు బ్రాహ్మణపల్లె వెంకటరామిరెడ్డి అన్నారు. పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని బ్రాహ్మణపల్లి జడ్పీ హైస్కూల్లో శుక్రవారం నిర్వహించిన మెగా పేరెంట్-టీచర్స్ మీటింగ్ 4.0 కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులతో, తల్లిదండ్రులతో ముచ్చటించిన ఆయన, విద్య కేవలం మార్కులకే పరిమితం కాకూడదని, విలువలతో కూడిన విద్య అవసరమని చెప్పారు. చదువు అనేది ఏ వర్గానికో చెందినది కాదని, కష్టపడి చదివేవారే గొప్పవారవుతారని సూచించారు. తల్లిదండ్రులు ఆడ, మగా తేడా లేకుండా పిల్లలను చదివించాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మెగా పేరెంట్స్ మీటింగ్ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తున్న మంత్రి నారా లోకేష్‌కు ధన్యవాదాలు తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు మేరీ, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# సాయి కృష్ణారెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన బీటెక్ రవి దంపతులు



ప్రజాభూమి,పులివెందుల

పులివెందుల పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో, పులివెందుల టీడీపీ ఇన్‌చార్జ్ బీటెక్ రవి ఆత్మీయుడు, సాయి కృష్ణారెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పులివెందుల టీడీపీ ఇన్‌చార్జ్ బీటెక్ రవి, ఆయన సతీమణి పులివెందుల జడ్పీటీసీ మారెడ్డి లత రెడ్డి ,తుంగభద్ర ప్రాజెక్టు హైలెవెల్ కెనాల్ చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి, వెంపల్లె టీడీపీ ఇంచార్జ్ అజ్జుగుట్టు రఘునాథరెడ్డి లు శుక్రవారం హాజరై కేక్ కట్ చేసి సాయి కృష్ణారెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు సాయి కృష్ణారెడ్డి ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, నిండు నూరేళ్లు వర్ధిల్లాలని, ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం పార్టీ నాయకులు, పులివెందుల మార్కెట్ యార్డ్ చైర్మన్ గడ్డం అమర్నాథ్ యాదవ్ ,కడపజిల్లా తెలుగు యువత కార్యదర్శి అక్కులుగారి విజయ్ కుమార్ రెడ్డి , కార్యకర్తలు, అభిమానులు సాయి కృష్ణారెడ్డి జన్మదిన కేక్ కట్ చేసి కృష్ణారెడ్డి కి పుష్పగుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఘనంగా మెగా పేరెంట్స్ డే 4.ఓకే

## విద్యార్థుల భవిష్యత్తుకు తల్లిదండ్రులే బలమైన పునాది



ప్రజా భూమి ప్రతినిధి బుచ్చినాయుడు కండ్రిగ:

తిరుపతి జిల్లా బి.ఎన్ కండ్రిగ మండల కేంద్రంలోని మోడల్ ప్రైమరీ స్కూల్‌లో శుక్రవారం మెగా పేరెంట్స్ డే కార్యక్రమం ఘనంగా నిర్వహించారుపాఠశాల ప్రగతి విద్యార్థుల విద్యా పురోగతిపై తల్లిదండ్రులతో విస్తృతంగా చర్చిస్తూ ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. సమావేశానికి విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో హాజరై పాఠశాల అభివృద్ధిపై తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఈ సందర్భంగా టీడీపీ సీనియర్ నాయకులు మాజీ మండల అధ్యక్షుడు మావిళ్లపల్లి సుధాకర్ నాయుడు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధిలో తల్లిదండ్రుల భాగస్వామ్యం అత్యంత కీలకమని, ఇంటి వద్ద కూడా పిల్లల చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. కార్యక్రమం అనంతరం విద్యార్థులు, తల్లిదండ్రులకు రుచికరమైన మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల భాగస్వామ్యంతో మెగా పేరెంట్స్ డే కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది.

# దస్తావేజులేఖరుల నిరసనకు వైకాపా మద్దతు



ప్రజాభూమి, హిందూపురం టౌన్

దస్తావేజులేఖరుల సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని వైకాపా నాయకులు గుడ్డంపల్లి వేణురెడ్డి పేర్కొన్నారు. నిరసనలో భాగంగా శుక్రవారం దస్తావేజులేఖరులు వేణురెడ్డిని కలిసి సమస్యలపై విన్నవించి మద్దతు కోరగా ఇందుకు ఆయన సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబర్ 369 వల్ల ఎదురయ్యే ఇబ్బందులను దస్తావేజులేఖరులు వివరించారు. దస్తావేజులేఖరుల సమస్యలపై పోరాడేందుకు వైకాపా అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో దస్తావేజు లేఖరుల సంఘం ప్రతినిధులు, వైకాపా నాయకులు పాల్గొన్నారు.

# పుట్లూరు మండలంలో ఘనంగా 'మెగా పేరెంట్స్ మీటింగ్ 4.O.

## మండల వ్యాప్తంగా 45 పాఠశాలల్లో ఉత్సాహంగా నిర్వహణ.

ప్రజాభూమి, పుట్లూరు.

పుట్లూరు మండల వ్యాప్తంగా ఈరోజు 'మెగా పేరెంట్స్ మీటింగ్ 4.0' కార్యక్రమం అత్యంత వైభవంగా, ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించబడిందనీ ఎం యు శ్రీదేవి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని మొత్తం 45 పాఠశాలల్లో ఈ వేడుకను ఘనంగా నిర్వహించడం జరిగిందని, ఈ కార్యక్రమానికి విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మరియు స్థానిక ప్రజల నుండి విశేష స్పందన లభించిందనీ,మండల వ్యాప్తంగా: దాదాపు 2,300 మంది విద్యార్థులు, 2,100 మందికి పైగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, అధికారులు మరియు ఇతర అతిథులతో కలిపి మొత్తం 5,000 మందికి పైగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో ఏర్పాటు చేసిన సమావేశాలకు స్థానిక ప్రజాప్రతినిధులు, పూర్వ విద్యార్థులు, విద్యాభిమానులు, దాతలు మరియు మండల స్థాయి అధికారులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపు, మౌలిక సదుపాయాల కల్పన మరియు విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై ప్రత్యేకంగా సమీక్షించారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు భాగస్వామ్యంతో ముందుకు సాగాలని అతిథులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన ఉపాధ్యాయులకు, అధికారులు, దాతలు మరియు తల్లిదండ్రులకు మండల విద్యాశాఖ తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# 25 వేల లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ మల్లికార్జున ప్రసాద్

## అనంతపురం దేవాదాయ శాఖ కార్యాలయంలో ఏసీబీ దాడులు



ప్రజాభూమి, పుట్లూరు.

అనంతపురం జిల్లా దేవాదాయ శాఖలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు గురువారం ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. రూ.25 వేల లంచం తీసుకుంటూ దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ మల్లికార్జున ప్రసాద్ ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా చిక్కారు. ఏసీబీ అధికారుల వివరాల ప్రకారం.. పుట్లూరు మండలం రామలింగేపల్లిలో ఆలయ నిర్మాణం కోసం తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీవాణి ట్రస్ట్ ద్వారా రూ.10 లక్షలు మంజూరయ్యాయి. ఆ నిధుల నుంచి రూ.2 లక్షల విడుదలకు సంబంధించిన ప్రక్రియలో ఆలయ కమిటీ చైర్మన్ వెంకట్రామిరెడ్డి వద్ద నుంచి అసిస్టెంట్ కమిషనర్ మల్లికార్జున ప్రసాద్ రూ.25 వేల లంచం డిమాండ్ చేసినట్లు తెలుస్తోంది. ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు, లంచం స్వీకరిస్తున్న సమయంలో మల్లికార్జున ప్రసాద్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం దేవాదాయ శాఖ కార్యాలయంలో తనిఖీలు నిర్వహించి సంబంధిత పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ నెల 31న పదవీ విరమణ చేయనున్న మల్లికార్జున ప్రసాద్ అరెస్టు జిల్లాలో సంచలనంగా మారింది. దాడులకు ఏసీబీ డీఎస్పీ ప్రసాద్ రెడ్డి, సీఐ హమీద్ ఖాన్ ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఏసీబీ అధికారులు తెలిపారు.

# 87.5 శాతం ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తి...సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు

## పులివెందుల నియోజకవర్గంలో 29,834 ఓటర్లకు నోటీసులు



ప్రజాభూమి,పులివెందుల

పులివెందుల నియోజకవర్గంలో ఎస్ ఐ ఆర్ ప్రక్రియ 87. 5 శాతం పూర్తి అయ్యిందని రిటర్నింగ్ అధికారి ఆర్డిఓ చిన్నయ్య తెలిపారు శుక్రవారం స్థానిక ఆర్డిఓ కార్యాలయంలో ఆర్డీవో చిన్నయ్య తహశీల్దార్ నజీర్ అహ్మద్ మున్సిపల్ కమిషనర్ తనూజ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారిలు ప్రజా ప్రతినిధులతో ఓటర్ జాబితా ప్రత్యేక సవరణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పులివెందుల నియోజకవర్గంలో ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం వేగంగా పూర్తి అయేందని, నియోజకవర్గంలో మొత్తం 2,30,276 మంది ఓటర్లు ఉండగా, వీరిలో ఇప్పటికే 2,00,442 మంది ఓటర్ల వివరాలను డిజిటలైజ్ చేశామని వారు తెలిపారు .మిగిలిన పరిశీలనలో భాగంగా చనిపోయిన వారు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు తరలిపోయిన వారు, ఇప్పటికే మరోచోట నమోదైన వారు, చిరునామాలో లేని వారు వంటి వివిధ కోవలకు చెందిన మొత్తం 29,834 మంది ఓటర్లకు సంబంధిత అధికారులు నోటీసులు జారీ చేశామని తెలిపారు . ఈ ప్రక్రియలో ప్రజా ప్రతినిధులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని అధికారులు కోరారు. ఓటర్లు ఎవరైనా సందేహాలు ఉంటే తమ పరిధిలోని బిల్ఒ, తహసీల్దార్ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమం లో అన్ని పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాభూమి,పులివెందుల

నేడు పులివెందుల మండలంలోని కొన్ని గ్రామాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని విద్యుత్ రూరల్ ఏఈ రమేష్ ఒక ప్రకటనలో తెలియజేశారు. శనివారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు 33 కేవీ లైన్స్ మరమ్మతు కార్యక్రమం వున్నందున నల్ల పురెడ్డి పల్లి, ఈ కొత్తపల్లి, మల్లికార్జునపురం , మోతునోతల పల్లి, కణంపల్లి, ఎర్రబల్లి, నల్లగొండ వారి పల్లి, కె వెలమవారి పల్లి, వెంకటాపురం గ్రామాలకు,వ్యవసాయ విద్యుత్ వినియోగదారులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని, కావున ప్రజలు రైతులు అంతరాయం కలుగును, కావున దయచేసి, ప్రజలు విద్యుత్ అధికారులకు సహకరించాలని ఆయన కోరారు



# కాకర్లమూడి ఎంపియు పి పాఠశాలలో వైభవంగా 'మెగా పేరెంట్స్ మీటింగ్ 4.0

## పిల్లల భవిష్యత్తుకు బాటలు వేసేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమన్వయం గ్రామ పెద్దలు, కూటమి నాయకుల ప్రశంసలు

ప్రజాభూమి బ్యూరో కృష్ణాజిల్లా

కాకర్లమూడిగ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల (MPUP School) నందు 'మెగా పేరెంట్స్ మీటింగ్ 4.0' కార్యక్రమం అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో, వేడుకగా నిర్వహించబడింది. పాఠశాల విద్యార్థుల సమగ్ర వికాసం, విద్యా ప్రమాణాల పెంపు మరియు తల్లిదండ్రుల భాగస్వామ్యమే లక్ష్యంగా ఈ సమావేశం జరిగింది.ముఖ్య అతిథుల సమాగమం – సంఘీభావంఈ విద్యా సమ్మేళనానికి గ్రామ ప్రజాప్రతినిధులు, రాజకీయ, సామాజిక నాయకులు మరియు అధికారులు పెద్ద సంఖ్యలో హాజరై తమ పూర్తి మద్దతును ప్రకటించారుగ్రామ సర్పంచ్ కామేశ్వరరావు జనసేన నాయకులు లింగం నరసింహస్వామికూటమి & గ్రామ ప్రముఖులు లింగం నాగరాజు , పరస రాజేష్ , లింగం శ్రీనివాసరావు సచివాలయ సిబ్బంది, గ్రామ పెద్దలువిద్యా ప్రగతిపై సమగ్ర చర్చ కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులతో నేరుగా సమావేశమై పిల్లల చదువు, క్రమశిక్షణ, పాఠశాలలో మౌలిక వసతుల కల్పనపై విస్తృతంగా చర్చించారు."మన పిల్లల ఉజ్వల భవిష్యత్తుకు పునాది వేసేది పాఠశాలలే.

ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కలసికట్టుగా శ్రద్ధ వహించినప్పుడే విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారు."కార్యక్రమంలో నాయ కులు, గ్రామ పెద్దల పిలుపువిజయవంతం చేసిన ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులుఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఏర్పాట్లు చేశారు. పెద్ద సంఖ్యలో హాజరైన పిల్లల తల్లిదండ్రులు తమ పిల్లల విద్యా పురోగతి పట్ల ఆనందం వ్యక్తం చేశారు. ఊరిలోని నాయకులు, సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు మరియు తల్లిదండ్రుల భాగస్వామ్యంతో ఈ 'మెగా పేరెంట్స్ మీటింగ్ 4.0' గ్రామంలో ఒక విద్యా పండుగలా ఘనంగా పూర్తయింది.

# ఢిల్లీ విద్యార్థుల ఆందోళనపై మచిలీపట్నం బార్ అసోసియేషన్ ఆందోళన

## విద్యార్థుల పోరాటానికి సంపూర్ణ మద్దతు ప్రకటించిన న్యాయవాదులు



మచిలీపట్నం/ప్రజాభూమి ప్రతినిధి

దేశ రాజధాని ఢిల్లీలో న్యాయబద్ధమైన డిమాండ్ల కోసం విద్యార్థులు చేపట్టిన నిరసనలపై మచిలీపట్నం బార్ అసోసియేషన్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. శుక్రవారం బార్ అసోసియేషన్ అధ్యక్షులు తుంగల హరిబాబు నాయకత్వంలో సమావేశమైన న్యాయవాదులు, విద్యార్థుల ఉద్యమానికి తమ సంపూర్ణ మద్దతును ప్రకటించారు.న్యాయవాదుల ప్రధాన డిమాండ్లు:కఠిన చట్టాల రూపకల్పన: విద్యా వ్యవస్థను పటిష్టం చేసేందుకు వెంటనే కఠినమైన చట్టాలు తీసుకురావాలి.తక్షణ న్యాయం: ఆందోళన బాట పట్టిన విద్యార్థులకు ఎలాంటి అన్యాయం జరగకుండా తగిన న్యాయం అందించాలి. "దేశానికి వెన్నుముక లాంటి విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడటం సరికాదు. విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేసి, విద్యార్థుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి."అని మచిలీపట్నం బార్ అసోసియేషన్ అధ్యక్షు తుంగల హరిబాబు అన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు:ఈ మద్దతు తెలిపిన కార్యక్రమంలో బార్ అసోసియేషన్ నాయకులు మరియు సీనియర్, మహిళా న్యాయవాదులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.అసోసియేషన్ ప్రతినిధులు: డి. శివకుమార్ (వైస్ ప్రెసిడెంట్), సర్వా లలితకుమారి (జనరల్ సెక్రటరీ).సీనియర్ న్యాయవాదులు: జె. నెహ్రూ, గుండు ప్రకాష్, పి. సూర్యప్రకాష్, ప్రభాకర్, రఘురామ్.మహిళా న్యాయవాదులు: క్రాంతి, శరణ్య, సీత, విజయ, రమణి, కృప, నాగమణి, రెజీనా, జగతి తదితరులు.

# విద్యార్థుల భవిష్యత్తుకు పీటీఎంలు ఎంతో కీలకం

## మెగా పీటీఎంలో పాల్గొన్న తులసిరెడ్డి.. విద్య, సంస్కారంపై విద్యార్థులకు సూచనలు




ప్రజాభూమి, వేంపల్లె

స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ (పీటీఎం) ఘనంగా నిర్వ హించారు. ఈ కార్యక్రమానికి పాఠశా ల ప్రధానోపాధ్యాయులు నాగాంజ నేయులు అధ్యక్షత వహించారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా తులసి రెడ్డి మాట్లాడుతూ విద్యార్థి దశ మానవ జీవితంలో స్వర్ణ యుగం వంటిదని అన్నారు. ఈ దశను సద్వినియోగం చేసుకున్న విద్యార్థులు జీవితంలో ఉన్నత శిఖరాలను చేరుకుంటారని తెలిపారు. ప్రతి విద్యార్థికి పుస్తక జ్ఞానంతో పాటు లోకజ్ఞానం, సంస్కారం, వ్యక్తిత్వ వికాసం, ఆత్మస్థైర్యం, సామాజిక స్పృహ పెంపొందేలా విద్య అందించాలని సూచించారు. పీటీఎం ద్వారా విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల మధ్య మంచి అవగాహన ఏర్పడి విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తుందని పేర్కొన్నారు. విద్యార్థులు డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ రామముని రెడ్డి, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు అమర్నాథ్ రెడ్డి, ఉత్తన్న, రవీంద్రనాథ్ రెడ్డి, రమణ, విశ్రాంత ఉపాధ్యాయులు నరసింహా రెడ్డి, పంచాయతీరాజ్ ఇంజనీర్ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు శ్రీనివాసులు, తదితర పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.



# మోపిదేవి ఎంజేపీ గురుకులంలో ఘనంగా మెగా పీటీఎం






ప్రజాభూమి ప్రతినిధి / అవనిగడ్డ

అణగారిన వర్గాల విద్యార్థులు పూలే స్ఫూర్తితో ఉన్నత స్థానాలు అందుకోవాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పిలుపునిచ్చారు. శుక్రవా రం మోపిదేవిలోని మహాత్మా జ్యోతిరావు పూలే ఆంధ్ర ప్రదేశ్ బీసీ వెల్ఫేర్ బాలుర గురుకుల పాఠశాల & జూనియర్ కళాశాలలో మెగా పీటీఎం 4.0సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థుల అభ్యసనా సామర్థ్యంతో పాటు, నడవడిక పట్ల తల్లిదండ్రులలో ప్రత్యేక శ్రద్ధ, ఆసక్తి పెంచి, విద్యా పురోగతికి బాటలు వేసేందుకు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఈ కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. బిడ్డలను బాధ్యతాయుత పౌరులుగా తీర్చిదిద్ది సమాజానికి అందించే మాతృమూర్తిని గౌరవించుకునేందుకు విద్యార్థులచే వారి తల్లులకు పాద పూజ, మాతృ వందనం చేయించటం ద్వారా విద్యార్థులకు సత్ప్రవర్తన అలవడుతుందన్నారు. దేశంలో బాలికా విద్యకు ఆద్యులు అయిన సంఘ సేవకులు మహాత్మా జ్యోతిరావు పూలే పేరిట స్థాపించిన ఈ పాఠశాలలో చదువుకుంటున్న విద్యా ర్థులు పూలే ఆదర్శ భావాలు అలవర్చుకోవాలన్నారు.

"విద్య లేకపోతే వివేకం లేదు. వివేకం లేకపోతే నీతి తప్పుతారు. నీతి లేకపోతే అభివృద్ధి జరుగదు. అభివృద్ధి లేకపోతే సంపద ఉండదు. సంపద లేకపోతే అణగారిపోతారు.. అన్న పూలే మాటలు స్ఫూర్తిగా తీసుకుని అట్టడు గున ఉన్న అణగారిన వర్గాలు విద్య ద్వారా ఉన్నత స్థితికి చేరుకోవాలని ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ పిలుపునిచ్చారు. మండలి వెంకటకృష్ణారావు విద్యాశాఖ మంత్రిగా ఉన్న సమయంలో 1977లో భీమునిపట్నం, అవనిగడ్డ గాంధీక్షేత్రం ల్లో రెండు మత్స్యకార ఆశ్రమ పాఠశాలలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వేటపై ఆధారపడి, విద్యకు దూరంగా ఉన్న మత్స్యకారులు తమ పిల్లలను చదివించేందుకు ఆసక్తి చూపకపోవటంతో గాంధీ క్షేత్రంలోని పాఠశాలలో కేవలం నలభై మంది విద్యార్థులు చేరితే, దివిసీమ ఉప్పెన తరువాత 200మందికి పైగా విద్యార్థులు వచ్చి చేరారని తెలిపారు. ఆనాడు చదువుకున్న మత్స్యకార బాలలు ఉన్నత స్థానాలు అందుకున్నారని తెలిపారు. చదువుతోనే ఉన్నత స్థాయి లభిస్తుందని, ప్రతి విద్యార్థి క్రమశిక్షణ, పట్టుదలతో చదువుకోవాలని సూచించారు.

అనంతరం విద్యార్థులకు రన్నింగ్ షూస్ ట్రాక్ అందచేశారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను సత్క రించారు. ముందుగా గురుకుల పాఠశా ల లో విజ్ఞాన ప్రదర్శన అంశాలు, గ్రంథాల యా న్ని ఎమ్మెల్యే సందర్శించారు. కార్యక్ర మం లో జడ్పీటీసీ సభ్యులు మెడబలిమి మల్లికార్జునరావు, ఎంఈఓలు జీ.ఎన్.బీ గోపాల్, ఏవీ రమణ, ప్రిన్సిపాల్ వీరరవి, ఎస్ఎంసీ చైర్మన్ నాగబాబు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# విద్యార్థుల భవిష్యత్తే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం : మంత్రి కొలు




**మెగా పేరెంట్–టీచర్ మీటింగ్ ద్వారా విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి బాటలు**

**తాళ్లపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో మెగా పీటీఎం కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి, ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు, జాయింట్ కలెక్టర్ ఎం నవీన్**

**తల్లిదండ్రులతో కలిసి పాదపూజ కార్యక్రమం, విద్యార్థులతో సహపంక్తి భోజనం**

మచిలీపట్నం/ప్రజాభూమి ప్రతినిధి

ఆంధ్రప్రదేశ్‌ను విద్య, నైపుణ్యాభివృద్ధి, ఉద్యోగ ఉపాధి కేంద్రంగా తీర్చిదిద్దడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర గనులు, భూగర్భవనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నాయ కత్వంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంపొందించేందుకు వినూత్న కార్య క్రమాలు అమలు చేస్తున్నామని తెలిపారు. శుక్రవారం ఉదయం మచిలీపట్నం మండలంలోని తాళ్లపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన తల్లిదండ్రులు ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశ (మెగా పేరెంట్–టీచర్ మీటింగ్) కార్యక్రమంలో మంత్రి, ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు, జాయింట్ కలెక్టర్ ఎం నవీన్ తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సన్మానించారు. తల్లిదండ్రులతో కలిసి విద్యార్థుల పాదపూజ కార్యక్రమంలో పాల్గొని వారిని అభినందించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసి వారితో ముఖా ముఖి మాట్లాడి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లా డుతూ మెగా పేరెంట్–టీచర్ మీటింగ్ ద్వారా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, పాఠశాల అభివృద్ధి కమిటీలు సమన్వయంతో పనిచేసి విద్యార్థుల విద్యా ప్రగతి, క్రమశిక్షణ, హాజరు, మౌలిక వసతులు, పాఠశాల అవసరాలపై నిరంతరం సమీక్షించే అవకాశం కలుగుతుందని మంత్రి తెలిపారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధి కోసం ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంతో నిర్వహిస్తోందన్నారు.ప్రపంచంలోనే ఒకే రోజు కోట్లాది మంది తల్లిదండ్రులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొనే స్థాయిలో మెగా పేరెంట్–టీచర్ మీటింగ్ నిర్వహించడం ఆంధ్రప్రదేశ్‌కే దక్కిన ప్రత్యేకత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల ఫలితంగా ప్రభుత్వ పాఠ శాలలు ప్రైవేట్ పాఠశాలలకు పోటీగా నిలుస్తు న్నాయని, పదో తరగతి ఉత్తీర్ణత శాతం కూడా గణనీయంగా పెరిగిందన్నారు.విద్యార్థులకు నాణ్య మైన విద్యతో పాటు పోషకాహారం అందిం చేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని మంత్రి చెప్పారు. మధ్యాహ్న భోజనంలో నాణ్యమైన సన్నబియ్యం, గుడ్లు, చికెన్, పోషకాహార మెనూ అందిస్తున్నామని తెలిపారు. యూనిఫారాలు, పాఠ్యపుస్తకాలు, బ్యాగులు, ఇతర అవసరాలన్నీ సమయానికి అం దేలా చర్యలు తీసుకుంటున్నా మన్నారు. విద్యకు రాష్ట్ర బడ్జెట్‌లో అత్యధిక ప్రాధాన్యం కల్పిస్తూ ప్రతి ఏడాది వేల కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నామని తెలిపారు. "తల్లికి వందనం" పథకం ద్వారా ప్రతి అర్హ విద్యార్థికి ఆర్థిక సహాయం అందిస్తూ కుటుంబాలపై విద్యా భారం తగ్గిస్తున్నామని చెప్పారు. కృష్ణా జిల్లాలో వేలాది మంది విద్యార్థులు ఈ పథకం ద్వారా లబ్ధి పొందుతున్నారని పేర్కొన్నారు.మెగా డీఎస్సీ ద్వారా పారదర్శకంగా 16,300 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసిన ప్రభుత్వం, అవసరాన్ని బట్టి మరిన్ని ఉపా ధ్యాయ నియామకాలు చేపడుతుందని మంత్రి తెలిపారు. ప్రతి పాఠశాలలో తగిన సంఖ్యలో ఉపాధ్యాయులు ఉండేలా ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.విద్యార్థులు భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డిజిటల్ నైపుణ్యాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై దృష్టి సారించాలని సూచించారు. రాష్ట్రంలో భారీ పరిశ్రమలు, ఐటీ సంస్థలు, పోర్టులు, పెట్టుబడులు పెరుగుతున్న నేపథ్యంలో భవిష్యత్‌లో ఉద్యోగ అవకాశాలు కూడా రాష్ట్రంలోనే విస్తృతంగా లభిస్తాయని చెప్పారు.ఆడపిల్లల విద్య కు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, తల్లిదండ్రులు బాలికల చదువును మధ్యలో ఆపకుండా ఉన్నత విద్య వరకు ప్రోత్సహించాలని మంత్రి కోరారు. పాఠశాలలో మరుగుదొడ్లు, శానిటరీ నాప్‌కిన్లు వంటి సౌకర్యాలపై తల్లిదండ్రులు ప్రస్తావించిన సమస్యలను వెంటనే పరిష్కరించే విధంగా తగిన చర్యలు తీసుకుంటామన్నారు.విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం, తల్లిదండ్రుల భాగస్వామ్యాన్ని పెంపొందించడం, పాఠశాలల అభివృద్ధికి సమా జాన్ని భాగస్వామ్యం చేయడమే మెగా పేరెంట్–టీచర్ మీటింగ్ ప్రధాన ఉద్దేశమని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.

కార్యక్రమంలో గత పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో 547 మార్కులు సాధించిన పూర్వ విద్యార్థిని మైలపల్లి లుథియాను అతిథులు ఘనంగా సన్మానించి అభినందించారు.కార్యక్రమానికి ముందు జాయింట్ కలెక్టర్, పాఠశాలలో 7, 9, 10వ తరగతుల విద్యార్థిని విద్యార్థులతో ముఖాముఖి సంభాషించి పలు ప్రశ్నలను అడిగారు. వారి హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులను పరిశీలించారు.కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి యు వి సుబ్బారావు, మండల విద్యాధికారి ప్రసాద్, ప్రధానోపాధ్యాయురాలు యం జ్యోత్స్న దేవి, జిల్లా పర్యాటక శాఖ అధికారి జి రామ లక్ష్మణరావు, మచిలీపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుంచె దుర్గాప్రసాద్ నాని, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ గోపు సత్యనారాయణ, ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు గుమ్మడి విద్యాసాగర్, విద్యా కమిటీ చైర్మన్ మన్నె వెంకటేశ్వరరావు, నీటి సంఘాల అధ్యక్షుడు జొన్న బాబురావు, సభ్యుడు జొన్న ప్రసాద్, కూటమి నాయకులు శేషగిరిరావు, కే సుశీల, శ్రీకాకుళం నాని, కొనకళ్ళ నాగరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.




## తల్లిదండ్రులు–ఉపాధ్యాయుల సమన్వయంతోనే విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది

### ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు

విద్యార్థుల విద్యాభివృద్ధి, వ్యక్తిత్వ వికాసానికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయడం అత్యంత అవసరమని ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు అన్నారు.విద్యార్థుల చదువులో పురోగతి, వారి బలాలు, బలహీనతలను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కలిసి సమీక్షించి అవసరమైన సూచనలు చేయడమే మెగా పేరెంట్స్–టీచర్స్ మీటింగ్ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. విద్యార్థుల అభ్యాసం కేవలం పాఠశాల బాధ్యత మాత్రమే కాదని, ఇంటి వద్ద తల్లిదండ్రులు కూడా పిల్లల చదువుపై నిరంతరం శ్రద్ధ వహించాలని సూచించారు.విద్యార్థి హోంవర్క్, చదువుపై ఆసక్తి, ప్రవర్తన, అభ్యాసంలో ఉన్న లోపాలను ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు తెలియజేస్తారని, అదే విధంగా తల్లిదండ్రులు కూడా పిల్లల గురించి ఉపాధ్యాయులతో చర్చించడం ద్వారా సమస్యలను సకాలంలో పరిష్కరించవచ్చని అన్నారు. ఈ సమన్వయం విద్యా ప్రమాణాల పెరుగుదలకు ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రత్యేక చొరవతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల మెరుగుదలకు పలు సంస్కరణలు అమలు చేస్తున్నారని కొనకళ్ల నారాయణరావు తెలిపారు. అర్హత కలిగిన ఉపాధ్యాయుల నియామకం, ఆధునిక బోధనా విధానాల అమలు, డిజిటల్ విద్యా సదుపాయాల కల్పన, విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం వంటి చర్యలతో ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో విశ్వాసం పెరిగి విద్యార్థుల చేరికలు కూడా గణనీయంగా పెరిగాయని చెప్పారు.భావి భారత పౌరులుగా విద్యార్థులను తీర్చిదిద్దడంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కలిసి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కొనకళ్ల నారాయణరావు పిలుపునిచ్చారు.

## విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు భాగస్వాములుగా పనిచేయాలి

### జాయింట్ కలెక్టర్ ఎం నవీన్

జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు భాగస్వాములుగా పనిచేయాలని, పిల్లల ప్రతిభను గుర్తించి సరైన దిశలో ప్రోత్సహించడం ద్వారానే వారి సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న మెగా పేరెంట్స్–టీచర్స్ మీటింగ్ కార్యక్రమం విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి కీలక వేదిక అని, విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమాన బాధ్యత వహించాలని అన్నారు. విద్యార్థుల చదువుతో పాటు వారి వ్యక్తిత్వ వికాసం, నైపుణ్యాల అభివృద్ధి, విలువల పెంపొందింపుపై కూడా దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. పేరెంట్స్–టీచర్స్ మీటింగ్‌కు తల్లి మాత్రమే కాకుండా తండ్రి కూడా తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు.

మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్యదేవోభవ అనే భారతీయ సంస్కృతి విలువలను ప్రతి కుటుంబం ఆచరించాలన్నారు.ప్రతి విద్యార్థికి అందజేసే హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డు ద్వారా వారి విద్యా ప్రగతి, భాషా నైపుణ్యాలు, గణిత సామర్థ్యం, ఇతర ప్రతిభలను తల్లిదండ్రులు తెలుసుకుని ఉపాధ్యాయులతో చర్చించాలని చెప్పారు. పిల్లల అభివృద్ధిని కేవలం పాఠశాలకే వదిలేయకుండా కుటుంబం కూడా భాగస్వామ్యం కావాలని సూచించారు.పిల్లల్లో ఎవరికైనా గణితం, భాషలు, కళలు, సంగీతం, క్రీడలు లేదా నాయకత్వ లక్షణాలపై ఆసక్తి ఉంటే వాటిని గుర్తించి ప్రోత్సహించాలని జాయింట్ కలెక్టర్ అన్నారు. క్రీడలు జట్టు భావన, నాయకత్వం, క్రమశిక్షణ, ఓటమిని ధైర్యంగా స్వీకరించే మనస్తత్వాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. అందువల్ల విద్యతో పాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.సెల్‌ఫోన్ వినియోగంపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని, పిల్లలకు అవసరమైనంత వరకు మాత్రమే ఫోన్ వినియోగానికి సమయం కేటాయించాలని చెప్పారు. పిల్లలు తల్లిదండ్రులను అనుకరిస్తారని, అందువల్ల పెద్దలు కూడా ఫోన్ వినియోగాన్ని తగ్గించి పుస్తకాలు, వార్తాపత్రికలు చదివే అలవాటు పెంపొందించాలని సూచించారు. తనలో పుస్తక పఠనంపై ఆసక్తి పెరగడానికి తన తండ్రి రోజూ పత్రిక చదివే అలవాటే కారణమని, అదే తనను సివిల్స్ వైపు నడిపించిందని తెలిపారు.మహాత్మా గాంధీ జీవితంలో హరిశ్చంద్రుని నాటకం చూపిన ప్రభావాన్ని ప్రస్తావిస్తూ, చిన్నప్పుడే పిల్లలకు మంచి విలువలు, నిజాయితీ, క్రమశిక్షణ, దేశభక్తి వంటి అంశాలను బోధించాలని అన్నారు. అలాంటి విలువలతోనే గాంధీజీ, డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం వంటి మహనీయులు రూపుదిద్దుకున్నారని పేర్కొన్నారు.పాఠశాలల్లోని గ్రంథాలయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని, ముఖ్యంగా డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం రచించిన "వింగ్స్ ఆఫ్ ఫైర్" వంటి స్ఫూర్తిదాయక పుస్తకాలను చదవాలని సూచించారు. ఉపాధ్యాయులు కూడా విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంపొందించేలా ప్రోత్సహించాలని కోరారు.


Printed and Published and owned by A.RAMAMOHANREDDY,Printed at Sri Lakshmi Offset Printers, R.S. No.268/2;D.No. 8/180,Surampalli Village, Gannavaram Mandalam, Krishna district, Andhra Pradesh and Published from D.NO. 32-26-85/6, MSR Street Marutinagar, Eluru Road, Vijayawada-520004,Krishna district, Andhra Pradesh, Editor :A.RAMAMOHANREDDY, RNI NO. APTEL/2011/41440, Phone No. Cell : 9502116677

# విద్యార్థుల భవిష్యత్తుకు కూటమి ప్రభుత్వం భరోసా.

### మెగా పి టి ఎమ్ సమావేశంలో మంత్రి సుభాష్.






ప్రజాభూమి ప్రతినిధి-కాజులూరు.

విద్యార్థుల ఆశయాలకు అనుగుణంగా వారి భవిష్యత్తుకు కూటమి ప్రభుత్వం వేలాది కోట్ల రూపాయలు ఖర్చు చేసి భరోసా ఇస్తుందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాశంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. ఈమేరకు శుక్రవారం మీ భవిష్యత్తు మా బాధ్యత మీ చదువు దేశానికి వెలుగు అనే మహోన్నత లక్ష్యంతో నిర్వహించిన మెగా పేరెంట్స్-టీచర్స్ మీటింగ్ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ కాజులూరు జిల్లా పరిషత్ హైస్కూల్ , జూనియర్ కళాశాల, గొల్లపాలెంలో జరిగిన మెగా పేరెంట్స్-టీచర్స్ మీటింగ్‌ల్లో పాల్గొని విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తూ "తల్లికి వందనం" పథకాన్ని అమలు చేస్తోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 67.47 లక్షల మంది విద్యార్థులు ఈ పథకం ద్వారా లబ్ధి పొందుతున్నారని, 42.70 లక్షల మంది తల్లుల బ్యాంకు ఖాతాల్లో రూ.10,120.78 కోట్లను ప్రభుత్వం జమ చేస్తోందని వెల్లడించారు. కుటుంబంలో ఎంత మంది పిల్లలు చదువుకుంటే అంతమందికీ ఒక్కో విద్యార్థికి రూ.13,000 చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్నామని తెలిపారు. ఒకే కుటుంబంలో తొమ్మిది మంది పిల్లలు చదువుకుంటే రూ.1.17 లక్షల వరకు అనంతపురం జిల్లాలో అందించామన్నారు. అలాగే ఐదుగురు, ఆరుగురు పిల్లలు ఉన్న కుటుంబాలకు కూడా పూర్తి స్థాయిలో పథకం ప్రయోజనం అందించామని గర్వంగా పేర్కొన్నారు. ఇది కేవలం నగదు బదిలీ కార్యక్రమం కాదని భవిష్యత్ తరాలపై ప్రభుత్వం చేస్తున్న పెట్టుబడి అని మంత్రి స్పష్టం చేశారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఏ విద్యార్థి కూడా చదువు మధ్యలో ఆపకూడదనే లక్ష్యంతో ఈ పథకాన్ని అమలు చేస్తున్నామని చెప్పారు. తల్లుల ఖాతాల్లో నేరుగా నిధులు జమ చేయడం ద్వారా మహిళల ఆర్థిక సాధికారతకు ప్రభుత్వం మరింత బలం చేకూరుస్తోందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో రాష్ట్ర విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తున్నామని మంత్రి సుభాష్ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన, డిజిటల్ విద్య, ఆధునిక తరగతి గదులు, నాణ్యమైన బోధన, మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. విద్య ద్వారానే కుటుంబం, సమాజం, రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ప్రభుత్వం విశ్వసిస్తోందన్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని కష్టపడి చదివి రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు తీసుకురావాలని మంత్రి సుభాష్ పిలుపునిచ్చారు. తల్లిని గౌరవిస్తే కుటుంబం బలపడుతుందని విద్యార్థిని ప్రోత్సహిస్తే రాష్ట్రం అభివృద్ధి చెందుతుంది అనే సంకల్పంతోనే తల్లికి వందనం పథకాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రతి తల్లి ఆనందంగా ఉండాలని, ప్రతి బిడ్డ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ప్రభుత్వం ఆకాంక్షిస్తోందన్నారు. రాష్ట్రంలో బాల కార్మిక వ్యవస్థను పూర్తిగా నిర్మూలించి, ప్రతి బాలబాలికకు నాణ్యమైన విద్య అందేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే విద్యా రంగానికి ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. గత వైసీపీ ప్రభుత్వంపై మంత్రి సుభాష్ విమర్శలు గుప్పించారు. విద్యా రంగాన్ని నిర్లక్ష్యం చేసి యువత భవిష్యత్తును దెబ్బతీశారని ఆరోపించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం విద్య, వైద్యం, ఉపాధి రంగాల్లో అభివృద్ధికి కృషి చేస్తుంటే ప్రతిపక్షం విమర్శలకే పరిమితమైందని అన్నారు. ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, జనసేన ఇంచార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ లు మాట్లాడకుండా కూటమి ప్రభుత్వం విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి ప్రోత్సహిస్తున్నామన్నారు. గత వైసిపి ప్రభుత్వం అర్హులైన విద్యార్థులకు సంక్షేమ పథకాలు అందకుండా చేసిందని విమర్శించారు. ఈకార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్లు, జనసేన మండల అధ్యక్షులు బొండా వెంకన్న, కూటమి పార్టీ నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

### రాష్ట్రం లో ఆహార సరఫరా వ్యవస్థలపై

## కేరళ రాష్ట్ర ఆహార పౌర సరఫరాల శాఖ మంత్రి అనూప్ రూబెన్స్ అధ్యయనం

- పెద్దాపురంలోని లలితా ఇండస్ట్రీస్ ప్లాంట్ సందర్శన
- జిల్లాలో ధాన్యం కొనుగోలు,ప్రజా పంపిణీ వ్యవస్థలపై జిల్లా అధికారులు,రైస్ మిల్లర్ అసోసియేషన్ ప్రతినిధులతో ప్రత్యేక సమీక్ష







ప్రజాభూమి ప్రతినిధి-పెద్దాపురం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఆహార భద్రత, ప్రజా పంపిణీ వ్యవస్థ పనితీరును అధ్యయనం చేసే నిమిత్తం జిల్లాకు విచ్చేసిన కేరళ రాష్ట్ర ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి అనూప్ జాకబ్, పౌరసరఫరాల సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వి.ఎం జయ కృష్ణన్ కాకినాడ జిల్లా పర్యటనలో భాగంగా శుక్రవారం పెద్దాపురంలోని లలిత ఇండస్ట్రీస్ ను సందర్శించారు. రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ చైర్మన్ తోట సుధీర్, కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, లలిత ఇండస్ట్రీస్ ప్రతినిధులు ఈ సందర్భంగా ఆయనకు సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా లలిత ఇండస్ట్రీస్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సిద్ధం చేసిన బుక్స్ పంపిణీ చేశారు. అనంతరం లలిత ఇండస్ట్రీస్ ప్లాంట్ ను కేరళ రాష్ట్ర ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి అనూప్ జాకబ్, పౌరసరఫరాల సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వి.ఎం జయ కృష్ణన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ప్లాంట్ లో బియ్యం ఉత్పత్తుల ప్యాకింగ్, ఇతర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి అధికారులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన రైస్ మిల్లర్ల అసోసియేషన్ ప్రతినిధులతో సమావేశమయ్యారు. అనంతరం పట్టాభి ఆగ్రో ఇండస్ట్రీస్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులను ఉద్దేశించి కేరళ రాష్ట్ర మంత్రి అనూప్ జాకబ్ మాట్లాడుతూ.. దేశంలోని వివిధ ప్రాంతాలలో ధాన్యం కొనుగోలుకు సంబంధించి అందుబాటులో ఉన్న ఉత్తమ పద్ధతులను క్షుణ్ణంగా అధ్యయనం చేయడమే తమ ప్రధాన ఉద్దేశం అని కేరళ రాష్ట్ర ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి అనూప్ జాకబ్ తెలిపారు.

ఈ నేపథ్యంలో భాగంగా మా బృందం నిన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అధికారికంగా పర్యటించి, అక్కడి మంత్రి, ఇతర ఉన్నతాధికారులను కలవడం జరిగిందని వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లో ధాన్యం కొనుగోలు ప్రక్రియ జరుగుతున్న తీరును, చెల్లింపుల విధానాన్ని, కొనుగోలు పద్ధతులను, నిల్వ చేసే విధానాన్ని అలాగే చౌక ధరల దుకాణాలకు సరుకుల పంపిణీ జరుగుతున్న తీరును తమ బృందంలోని అధికారులు ప్రత్యక్షంగా పరిశీలించామన్నారు. గత రెండు రోజులు గా మేం పరిశీలించిన ఈ ఉత్తమ పద్ధతులను లోతుగా అధ్యయనం చేసి,మా రాష్ట్రం లో మెరుగైన రీతిలో అమలు చేయడానికి తగిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. కేరళలో వరి కొనుగోలు పూర్తి స్థాయిలో జరుగుతున్నప్పటికీ,అక్కడ మాకు కొన్ని ఆచరణాత్మక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఆ సమస్యలన్నింటినీ శాశ్వతంగా పరిష్కరించడానికి ప్రభుత్వం తరఫున నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. కర్ణాటక లో రైతులకి కనీస మద్దతు ధర ఇస్తున్నట్లు తాము తెలుసుకున్నామన్నారు. అయితే కేరళలో రైతులకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రత్యేక బోనస్ కూడా అందిస్తున్నామని, ఇది ఇతర రాష్ట్రాలతో పోలిస్తే కొంచెం భిన్నమైన పద్ధతి అని తెలిపారు. అయినప్పటికీ, ఆంధ్రప్రదేశ్ లో కొనుగోలు ప్రక్రియ మరింత వేగంగా జరుగుతోందని ఆయన పేర్కొన్నారు. నిన్న జరిగిన సమావేశంలో భాగంగా కేరళలోని మా సరఫరా వ్యవస్థ పనితీరును తెలుసుకోవడానికి ఆంధ్రప్రదేశ్ ఆహార శాఖ మంత్రి త్వరలో మా రాష్ట్రంలోపర్యటించనున్నారని తెలిపారు. కేరళ పౌరసరఫరాల సంస్థ ఆధ్వర్యంలో సుమారు ఒక వేల ఆరు వందల విక్రయ కేంద్రాలు పనిచేస్తున్నాయన్నారు. దేశంలోని పౌరసరఫరాల సంస్థలలో ఇది అతిపెద్ద రిటైల్ వ్యవస్థలలో ఒకటిగా నిలిచిందన్నారు. కేరళలో తాము అనుసరిస్తున్న మంచి పద్ధతులను పరిశీలించడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా మా రాష్ట్రానికి రావాలని యోచిస్తోందని తెలిపారు. ప్రస్తుతం మేము కేరళలోని రేషన్ కార్డు దారులందరికీ దాదాపు పదమూడు రకాల సబ్సిడీ వస్తువులను పంపిణీ చేస్తున్నామని మంత్రి తెలిపారు. అంతేకాకుండా వంట గ్యాస్ గోడౌన్లు, ఇంధన నిల్వ కేంద్రాలు వంటి ఇతర ప్రజా సేవలను కూడా నిర్వహిస్తున్నామన్నారు. ఇవన్నీ కేరళలో మేము అదనంగా చేస్తున్న ప్రజా సంక్షేమ పనులు అని ఈ అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలించి,వాటిలో అత్యంత ఉత్తమమైన వాటిని చర్చించి, ప్రభుత్వ స్థాయి విధాన పరమైన నిర్ణయాల తర్వాత కేరళలో మరింత పకడ్బందీగా అమలు చేస్తామని మంత్రి అనూప్ జాకబ్ వెల్లడించారు. ఈ పర్యటనలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ప్రసన్న లక్ష్మి దేవి, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ ఎం.ఆనంద రావు, ఎఫ్.సీ.ఐ అధికారులు కాకినాడ జిల్లా రైస్ మిల్లు అసోసియేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి బిడ్డ చదువుకు 'తల్లికి వందనం' భరోసా

- పనిచేసే మంచి ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి.
- మంత్రి నిమ్మల రామానాయుడు



ప్రజాభూమి ప్రతినిధి-పాలకొల్లు

కుటుంబంలో ఎంతమంది పిల్లలు చదువుకుంటే వారందరికీ 'తల్లికి వందనం' పథకం ద్వారా రూ.13 వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తూ ప్రతి బిడ్డ చదువుకు కూటమి ప్రభుత్వం భరోసా కల్పిస్తుందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. పాలకొల్లులోని బి.వి.ఆర్.ఎం బాలికల మున్సిపల్ ఉన్నత పాఠశాల, దొడ్డిపట్ల జడ్పీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం నిర్వహించిన మెగా పేరెంట్--టీచర్స్ కమిటీ సమావేశాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా 67,47,110 మంది విద్యార్థులకు రూ.10,120 కోట్లను 'తల్లికి వందనం' పథకం కింద తల్లుల ఖాతాల్లో జమ చేశామని తెలిపారు. పాలకొల్లు నియోజకవర్గం మొత్తం మీద 27 లక్షల మంది విద్యార్థులకు 35 కోట్లు తల్లుల ఖాతాల్లో జమ జరిగిందన్నారు. ఈ విద్యాసంవత్సరం నుంచి గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో పనిచేస్తున్న 47,555 మంది అంగన్‌వాడీ కార్యకర్తల పిల్లలకు కూడా ఈ పథకాన్ని వర్తింపజేస్తున్నట్లు చెప్పారు. గత గొడ్డలి పార్టీ ప్రభుత్వంలో కుటుంబంలో ఎంతమంది పిల్లలు ఉన్నా అందరికీ మేనమామగా సాయం చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్కరికే పరిమితం చేసి మిగిలిన వారిని రోడ్డున పడేసారంటూ జగన్‌పై మంత్రి విమర్శలు గుప్పించారు. కూటమి ప్రభుత్వం మాత్రం అధికారంలోకి వచ్చిన తొలి ఏడాది నుంచే కుటుంబంలోని ప్రతి విద్యార్థికి రూ.13 వేల చొప్పున అందిస్తోందన్నారు. ఈ పథకం వల్ల చదువు మానేసిన పలువురు విద్యార్థులు తిరిగి పాఠశాలల్లో చేరుతున్నారని పేర్కొన్నారు. గత ఐదేళ్ల పాలనలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ దెబ్బతిన్నప్పటికీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆర్థిక పరిస్థితిని గాడిన పెట్టడంతో పాటు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమర్థంగా అమలు చేస్తున్నారని మంత్రి తెలిపారు. మధ్యాహ్న భోజన పథకాన్ని గత ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని ఆరోపించిన ఆయన, ప్రస్తుతం 'డొక్కా సీతమ్మ' పేరుతో నాణ్యమైన సన్నబియ్యం, పౌష్టికాహారంతో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వం ఒక్క ఉపాధ్యాయ పోస్టును కూడా భర్తీ చేయలేదని, కూటమి ప్రభుత్వం ఇప్పటికే 16 వేలకుపైగా ఉపాధ్యాయ పోస్టులను డీఎస్సీ ద్వారా భర్తీ చేసిందని తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం పనిచేస్తున్న ఉపాధ్యాయుల్లో సుమారు 80 శాతం మంది చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో నిర్వహించిన డీఎస్సీల్లో ఎంపికైన వారేనని పేర్కొన్నారు. మొదటి తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణ పేరుతో ఉచిత స్టడీ మెటీరియల్ అందిస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో అమలు జరుగుతున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ అమరావతి రాజధాని, పోలవరం ప్రాజెక్టు , పరిశ్రమల స్థాపన ఉద్యోగ ఉపాధి అవకాశాలు వంటి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను కోటమి ప్రభుత్వం పరుగులు పెట్టిస్తుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, వీరికి అండగా ప్రధాని మోడీ ల సహకారంతో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. భవిష్యత్తులో ఏ ఎన్నికల జరిగిన కూటమి బలపరిచిన అభ్యర్థులను ఏకపక్షంగా గెలిపించాలని , మంచి ప్రభుత్వాన్ని పనిచేసే నాయకుడిని ఆశీర్వదించాలని మంత్రి రామానాయుడు కోరారు. పాలకొల్లులో జరిగిన సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, పాలకొల్లు ఎంఈఓ శర్మ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై ప్రభాకర్ శాస్త్రి, కూటమి నాయకులు బోనం చినబాబు, ఉన్నమట్ల కబది, వల్లభు శ్రీనివాస్, పెనుమాక రామ్మోహన్రావు, శ్రీకాకొల్లు కామేశ్వరరావు, శ్రీకాకోలపు వెంకన్న, రేనా, దీప్తి అప్పారావు తదితరులు పాల్గొన్నారు. దొడ్డిపట్లలో మామిడిసెట్టి పెద్దిరాజు , చేగొండి రవి శంకర్, బోనం నాని , మోహన్ , దేగల సత్యనారాయణ,బాలాజీ , షేరు కృష్ణ , వరబాబు జరిగిన సమావేశంలో పేరెంట్స్--టీచర్స్ కమిటీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### మెగా పీటీఎం 4.0 విజయవంతం

- పాఠశాలకు రూ.16 వేల విలువైన ఎప్సన్ ప్రింటర్ విరాళం
- విద్యార్థులకు ప్రత్యేక మధ్యాహ్న భోజనం ఏర్పాటు



ప్రజాభూమి ప్రతినిధి-తాళ్లపూడి

తాళ్లపూడి మండలం బల్లిపాడు గ్రామంలోని ఆదర్శ ప్రాథమిక పాఠశాల (జెబి)లో శుక్రవారం తల్లిదండ్రులు-ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం (మెగా పీటీఎం 4.0) ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల విద్యాభివృద్ధి, పాఠశాల అభివృద్ధి కార్యక్రమాలు, తల్లిదండ్రుల భాగస్వామ్యంపై విస్తృతంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో సామాజిక సేవా దృక్పథంతో కాకర్ల శ్రీనివాస్ పాఠశాలకు రూ.16 వేల విలువైన ఎప్సన్ ప్రింటర్‌ను బహూకరించారు. ఆయన సేవా భావాన్ని ఉపాధ్యాయ సిబ్బంది, తల్లిదండ్రులు అభినందించారు. అలాగే మద్దుకూరి శంకరం శుభదిన భోజనం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు చికెన్ కర్రీతో పాటు స్వీట్, హాట్ వంటకాలను ఏర్పాటు చేసి ఆతిథ్యం అందించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు కె.వి.చెల్లాజీరావు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి తల్లిదండ్రులు, దాతలు అందిస్తున్న సహకారం అభినందనీయమని పేర్కొన్నారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కె.వి.చెల్లాజీరావు,ఉపాధ్యాయులు జి.విజయకుమార్ రాజు , కె.రాజ్యలక్ష్మి , జి.వరలక్ష్మి, తల్లిదండ్రులు, గ్రామ సచివాలయ సిబ్బంది, వైద్య సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

### అమ్మవార్ల కు శాఖంబరి అలంకరణ

ప్రజాభూమి ప్రతినిధి-పాలకొల్లు





పాలకొల్లు పట్టణంలో వేంచేసి ఉన్న శ్రీ క్షీరా రామ లింగేశ్వర స్వామి దేవస్థానం నందు శుక్రవారం శ్రీ పార్వతీ దేవి అమ్మవారు, శ్రీలక్ష్మి దేవి అమ్మవార్లకు ఆషాడ మాసం సందర్భముగా శాఖంబరి అలంకారము ఆలయ ప్రధాన అర్చకులు సన్నిధి రాజు రామకృష్ణమూర్తి (కిష్టప్ప) , వివిధ రకములైన కూరగాయలతో పలు రకాల పండ్లతో అలంకరణ చేసియున్నారు. ఈ మేరకు ఆలయకార్యనిర్వహణాధికారి ముచ్చర్ల శ్రీనివాస్ రావు తెలిపారు.

### కృషి ఉడాన్‌తో వ్యవసాయ ఉత్పత్తుల కార్గో రవాణాకు ఊతం

-ఎంపీ పుట్టా మహేష్ కుమార్

ప్రజాభూమి ప్రతినిధి-ఏలూరు



కృషి ఉడాన్ పథకం ద్వారా రాష్ట్రంలోని విమానాశ్రయాల నుంచి వ్యవసాయ ఉత్పత్తుల కార్గో రవాణా గణనీయంగా పెరుగుతోందని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ తెలిపారు. ఈ పథకం అమలుపై ఆయన లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు కేంద్ర పౌర విమానయాన శాఖ సహా య మంత్రి మురళీధర్ మోహోల్ సమాధానం ఇచ్చారు. వ్యవసాయ, ఉద్యాన, మత్స్య, పశుసంప ద ఉత్పత్తులను తక్కువ ఖర్చుతో,వేగంగా మార్కెట్లకు చేరవేయడమే కృషి ఉడాన్ పథకం లక్ష్య మని మంత్రి వివరించారు. పథకం కింద ఎంపిక చేసిన విమానాశ్రయాల్లో ల్యాండింగ్, పార్కిం గ్, నావిగేషన్ చార్జీలకు మినహాయింపులు కల్పిస్తున్నట్లు తెలిపారు. కేంద్రం వెల్లడించిన వివరాల ప్రకారం విజయవాడ, తిరుపతి, రాజమండ్రి, విశాఖపట్నం విమానాశ్రయాల నుంచి కార్గో రవాణా గత రెండేళ్లలో పెరిగింది. ముఖ్యంగా విజయవాడ, తిరుపతి విమానాశ్రయాల నుంచి అంతర్జాతీయ కార్గో సేవలు ప్రారంభించేందుకు చర్యలు కొనసాగుతున్నాయని ఎంపీ పేర్కొన్నారు. దీంతో రైతులకు మెరుగైన మార్కెట్ అవకాశాలు లభించడంతో పాటు వ్యవసాయ ఉత్పత్తుల రవాణా మరింత సులభతరం కానుందని ఆయన అన్నారు.

### ఎండిన వరి నారుమడిలో వైస్సార్సీపీ నిరసన



ప్రజాభూమి ప్రతినిధి-పాలకొల్లు

పశ్చిమ గోదావరి జిల్లా యలమంచిలి మండలం మేడపాడు గ్రామంలో (మెయిన్ బోదె )పరబోదు లో సాగునీరు అందక వరి ఆకుమడులు ఎండిపోవడం జరిగింది.. ఈ విషయం తెలుసుకున్న పాలకొల్లు నియోజకవర్గ ఇన్చార్జ్ గుడాల గోపి రైతులకు అండగా, కూటమి ప్రభుత్వం పై ఆకుమడిలో "సైకిల్ తొక్కి నిరసన"వ్యక్తం చేశారు. వెంటనే రైతులకు నీళ్లు ఇవ్వాలి లేకపోతె రైతులతో ధర్నా చేస్తానని తెలియచేసారు.. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఉచ్చుల స్టాలిన్ , ఎంపీపీ ఇనుకొండ ధనలక్ష్మి రవికుమార్, జిల్లా ఉపాధ్యక్షులు ఓదురి భాస్కర రావు , మాజీ సర్పంచులు, కవురు గోపి ,పాలంకి శీను , గ్రామ అధ్యక్షులు గుర్రాల వెంకట్రావు , పాకా సూర్యనారాయణ రావు , సిరా నాగరాజు,కుక్కల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ లో అనామలీస్ వెంటనే పూర్తి చెయ్యాలి.

జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి బిఎల్ఓ లను ఆదేశించారు.

ప్రజాభూమి ప్రతినిధి-పెదపాడు.

పెదపాడులోని స్వర్ణ గ్రామ సచివాలయాన్ని శుక్రవారం జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి, కార్యాలయ రికార్డులు, హాజరుపట్టికను పరిశీలించారు. ప్రజలకు నాణ్యమైన సేవలు వేగవంతంగా అందించాలన్నారు. ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ పై బిఎల్ఓ లతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ గడువు ముగుస్తున్నందున అనామలీస్ వెంటనే పూర్తి చేయాలన్నారు. బిఎల్ఓ ల వారీగా పెండింగ్ జాబితాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఓటర్ల జాబితాలో అభ్యంతరాలపై అందిన దరఖాస్తులను నిర్దేశించిన సమయంలోగా పరిష్కరించాలన్నారు. అనంతరం కార్యాలయ ఆవరణను పరిశీలించి, విశాలమైన ఆవరణలో మొక్కలు పెంచాలని సిబ్బందికి సూచించారు.

**పారిశుద్ధ్య కార్యక్రమాలు సక్రమంగా చేయాలి-జిల్లా కలెక్టర్**

పెదపాడు గ్రామంలో పారిశుద్ధ్య పనులను పారిశుద్ధ్య కార్మికులను అడిగి తెలుసుకున్నారు. రానున్న వర్షాకాలంలో అపరిశుద్ధ్యం కారణంగా వ్యాధులు ప్రబలకుండా డ్రైన్లలో మురుగునీరు నిల్వ ఉండకుండా సిల్ట్ తొలగించాలన్నారు. గ్రామంలో రోడ్లపై ఎక్కడా చెత్త లేకుండా శుభ్రం చేయాలన్నారు. ఇంటింటికీ వెళ్లి తడి, పొడి చెత్త సేకరించాలన్నారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ కృష్ణజ్యోతి, ఎంపిడిఓ అమీన్ జమ, సచివాలయ ప్రభృతులు పాల్గొన్నారు.

# ప్రజాభూమి

జనరల్ 14

శనివారం 25 జూలై 2026


## దుర్గి పేరి మోడల్ ప్రైమరీ స్కూల్లో అంగరంగ వైభవంగా మెగా పేరెంట్స్ డే నిర్వహించారు





**ప్రజా భూమి ప్రతినిధి-ఏర్పేడు.**

తిరుపతి జిల్లా ఏర్పేడు మండల పరిధిలో ఉన్న అంగన్వాడి స్కూల్ నుంచి మొదలుపెడితే మోడల్ ప్రైమరీ స్కూల్స్ జడ్పీ హై స్కూల్స్ లో మెగా పేరెంట్స్ డే అంగరంగ వైభవంగా నిర్వహించారు. అందులో భాగంగా ఏర్పేడు మండలం దుర్గిపేరి మోడల్ ప్రైమరీ స్కూల్లో మెగా పేరెంట్స్ డే ని ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో తల్లిదండ్రుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు మాట్లాడుతూ పిల్లలకు విద్య నేర్పించే ఉపాధ్యాయులే కాకుండా తల్లిదండ్రులు కూడా వారి యొక్క నడవడికపై ప్రధానంగా వారి అలవాట్లు పై ప్రత్యేకంగా గమనిస్తూ తల్లిదండ్రులు పిల్లలపై శ్రద్ధ చూపాలని వారు స్కూల్ నుంచి ఇంటికి వచ్చిన తర్వాత స్కూల్లో ఎటువంటి విద్యా బోధన చేశారని ప్రతిరోజు పిల్లల్ని అడిగి తెలుసుకోవడం తల్లిదండ్రుల బాధ్యతని అలా చేయడం వలన పిల్లలు సక్రమంగా వారికి ఇచ్చినటువంటి హోంవర్క్ చక్కగా చేసుకునే అవకాశం ఉంటుందని తద్వారా మంచి నడవడిక ఏర్పడుతుందని చదువు పట్ల ఆసక్తి పెరుగుతుందని స్కూల్లో ఉపాధ్యాయులే కాకుండా ఇంటిదగ్గర వారిపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ ఉంచి వారిని మంచి మార్గంలో నడిపించాలని తల్లిదండ్రులకు వివరించారు.

**ఘనంగా ఏర్పేడు మండలం పొంగూరు జడ్పీ హైస్కూల్లో మెగా పేరెంట్స్ డే**

వంగూరు జడ్పీ హైస్కూల్లో మెగా పేరెంట్స్ డే సందర్భంగా భారీ సంఖ్యలో తల్లిదండ్రులు పాల్గొనడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టిడిపి సీనియర్ నేత రాఘవేంద్ర నాయుడు పాల్గొన్నారు. అదేవిధంగా జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు మరియు స్కూల్ యాజమాన్యం పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా ప్రధాన ఉపాధ్యాయులు మాట్లాడుతూ ప్రభుత్వం పిల్లలకి అందిస్తున్నటువంటి ప్రోత్సాహం గురించి క్షుణ్ణంగా వివరించడం జరిగింది. తదుపరి పిల్లల చేత పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసినటువంటి తల్లిదండ్రుల దగ్గర కూడా కొన్ని క్రీడలు నిర్వహించి వారికి బహుమతులు కూడా అందజేశారు. ఈ మెగా పేరెంట్స్ డే ని ఇంత విజయవంతంగా పూర్తి చేసినటువంటి ప్రతి తల్లిదండ్రులకి ముఖ్య అతిథులుగా విచ్చేసినటువంటి నాయకులకు స్కూలు యాజమాన్యం కృతజ్ఞతలు తెలియజేసింది.

## త్రిశక్తి పీఠంలో సంప్రదాయంగా ఆషాడమాస సారె సంబరాలు.

**ప్రజాభూమి ప్రతినిధి-బుట్టాయగూడెం**



స్థానిక త్రిశక్తి పీఠంలో ఆషాడ మాస సంప్రదాయ సారె సంబరాలు ఘనంగా నిర్వహించారు. త్రిశక్తి పీఠంలో శుక్రవారం ఉదయం ఆలయ అర్చకుడు ఉడతా ఉమామహేశ్వరరావు ఆధ్వర్యం లో మహిళలు శ్రీ మహాకాళి, శ్రీమహాలక్ష్మి, శ్రీ మహా సరస్వతి అమ్మవార్లకు ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం బుట్టాయగూడెంకు చెందిన కట్రెడ్డి ఆదినారాయణమూర్తి, వెంకటలక్ష్మి దంపతులు వారి కుమారులు ఉమామహేశ్వరరావు, సురేష్, కిట్టు,మధు అమ్మ వార్లకు పసుపు, కుంకుమ, నూతన వస్త్రములు, మిఠాయిలు పూలు పండ్లు సారెగా అందించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మోగల్లు కు చెందిన పెన్మత్స బలరామరాజు,స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం ఉద్యోగి రవికుమార్ రాజు, గుబ్బల హేమలత, కురెళ్ళ నాగేంద్ర (స్వాతి రెస్టారెంట్), మరి కొంతమంది భక్తులు సారె,ప్రసాద వితరణకు సహకారం అందించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవార్లకు సారె సమర్పించి, పూజలు నిర్వహించారు. ఆలయా నికి వచ్చిన భక్తులకు నిర్వాహకులు అమ్మవార్ల సారెను ప్రసాదంగా అందించారు.

## విద్యార్థుల ఉన్నతికి పేరెంట్స్, టీచర్స్ భాగస్వామ్యం అవసరం.

- ఏపీ ట్రైకార్ చైర్మన్ బొరగం.




**ప్రజాభూమి ప్రతినిధి-బుట్టాయగూడెం**

విద్యార్థుల ఉన్నతికి, బంగారు భవిష్యత్తుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల భాగస్వామ్యం ఎంతో అవసరమని రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు అన్నారు మండలంలోని బుసరాజుపల్లి, గిరిజన సంక్షేమ గురుకుల బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం జరిగిన మెగా పేరెంట్స్-టీచర్స్ మీటింగ్ 4.0కు బొరగం ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు నిరంతరం భాగస్వామ్యంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. తల్లిదండ్రులు సమయం కేటాయించి, పాఠశాలకు వచ్చి పిల్లల చదువు, ప్రవర్తన గురించి ఉపాధ్యాయులతో ముచ్చటించడం అవసరం అన్నారు. గతేడాది ఈపాఠశాలలో విద్యార్థులు 100% ఉత్తీర్ణత సాధించినట్లే, ఈ సంవత్సరం కూడా అంతటి ప్రతిభ కనబరిచి 100% ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. పాఠశాల అభివృద్ధికి ప్రభుత్వం, ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రుల సలహాలు, సహకారం కూడా ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన విద్యా విభాగాలు, విద్యార్థుల ప్రతిభ, పాఠశాలను తీర్చిదిద్దిన ఉపాధ్యాయ బృందాన్ని, పాఠశాల ప్రిన్సిపాల్ కుమారిని ప్రత్యేకంగా అభినందించారు.ఈ కార్యక్రమంలో ఏలూరు జిల్లా సోషల్ మీడియా కో ఆర్డినేటర్ మానెల్లి బాలు, కేరం వెంకటేశ్వరావు, కప్పల నాగేశ్వరరావు, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు ఎల్లపు సురేష్, పైదా వసంతారావు,వరక కృష్ణ రాజు, మాటూరి ముసలయ్య, మానికల శ్రీను,పెద్ద సంఖ్యలో తల్లిదండ్రులు హాజరయ్యారు.

## పట్టుదలతో ఉంటే ఉన్నత శిఖరాలు చేరుకోవచ్చు



**ప్రజా భూమి ప్రతినిధి-ఆగిరిపల్లి**

ఆగిరిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మెగా పీటీఎం-4.0 కార్యక్రమాన్ని నిర్వహించి, తల్లిదండ్రులకు విద్యార్థుల విద్యా ప్రగతిని వివరించడంతో పాటు లీప్, దీక్ష యాప్‌ల వినియోగంపై అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయురాలు పి. పుష్పలత పాఠశాల నివేదికను సమర్పించగా, టీడీపీ మండల అధ్యక్షుడు నక్కనబోయిన వేణు మాట్లాడుతూ థామస్ ఆల్వా ఎడిసన్‌లా పట్టుదలతో శ్రమిస్తే ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చని విద్యార్థులకు సూచించారు. ఎస్ఐ ఎ. నాగరాజు మంచి నడవడిక, క్రమశిక్షణతో మెలగాలని సూచించగా, కె. ఆనంద్ కుమార్, బి.వి.ఎస్. లక్ష్మి, ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అనంతరం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనాన్ని అందరికీ వడ్డించారు.

## ఢిల్లీలో విద్యార్థులపై లాఠీ చార్జిని ఖండించిన లిబరేషన్

**ప్రజా భూమి ప్రతినిధి-చాట్రాయి.**



ఢిల్లీలో కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో కేంద్ర విద్యా శాఖమంత్రిధ ర్మేంద్ర ప్రధాన్ రాజీనా మా కోరుతూ "చలో పార్లమెంట్ "పిలుపులో భాగంగాలక్షలాదిగా తరలివచ్చిన విద్యా ర్థులపై పరమ పాసవికంగా జరిపిన పోలీస్ లాఠీచార్జిని సిపిఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కమిటీ తీవ్రం గా ఖండిస్తున్నట్లు జిల్లా కార్యదర్శి దుర్గం పుల్లారావు ఏలూరు జిల్లా చాట్రాయి లో జరిగిన పత్రికా సమావే శంలో తెలియజేశారు. పార్లమెంటులో ప్రజా సమస్యలు చర్చించకుండా తమ ఏజెండా ను అమలు చేసుకోవా లని మోడీ సర్కారు సిద్ధమైందని పుల్లారా వు ఆరోపించారు. విద్యార్థుల ఆగ్రహానికి మోడీ తలవంచక తప్పదన్నారు. తక్షణం విద్యార్థి నేతలతో చర్చలు జరపాలని నీట్ పరీక్ష కుంభకోణా లకు బాధ్యుడైన ధర్మేంద్ర ప్రధాన్ ను బర్త్ రఫ్ చేయాలని మర ణించిన23 విధ్యార్దుల కుటుంబాలకు ఎక్స్గ్రే షియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. నీట్ పరీక్షల అవకతవకల ను నూతన విద్యా విధానంలో మార్పులు చేయాలని డిమాండ్ చేస్తూ వాటి లోటుపాట్ల నుతేట తెల్లం చేయ టంలో విద్యార్థి ఉద్య మం విజయం సాధిం చిందన్నారు. విద్యార్థు లతో చర్చలు జరప టానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధం కావటం విద్యార్థి ఉద్యమ విజయమని పుల్లారావు అన్నా రు .ఎన్డీఏ భాగస్వామ్య పార్టీలు విద్యార్థులపై జరిగిన లాఠీచార్జీని ఖండించాలని కోరారు. ఆంధ్ర రాష్ట్రంలో ఐసా ఆర్ వై ఏ విద్యార్థి సంఘాలు వామపక్షాలు పార్లమెంటు మార్చి బలపరుస్తూ లాఠీ చార్జీ ని ఖండిస్తూ సంఘీ భావం తెలియజేశారని వారందరికీపుల్లారావుఅభినందనలు తెలి యజేశారు.

## ముఖ్యమంత్రి చంద్ర బాబు దూర దృష్టి ,విద్యాశాఖామంత్రి నారా లోకేష్ నిరంతర శ్రమతో రాష్ట్రంలో విద్యావ్యవస్థ మారుతున్న రూపురేఖలు

**ప్రజాభూమి ప్రతినిధి-చాట్రాయి.**



విద్యా వ్యవస్థలో రూపురేఖలు వేగంగా మారిపోతున్నాయని నూజివీడు నియోజక వర్గ తెలుగు రైతు అధ్యక్షుడు మోరంపూడి శ్రీనివాస రావు అన్నారు.శుక్రవారం ఉదయం చాట్రాయి మండలం, చనుబండ శివారు సూరంపాలెం గ్రామంలోని గౌడ బజారు స్కూల్ లో, ఎస్సీ కాలనీ లోని సీ ఎస్ ఐ పాఠశాల లో, చనుబండ గ్రామంలోని మెయిన్ స్కూల్లో, కురుమ బజారు స్కూల్లో , జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలోనూ మెగా పేరెంట్ టీచర్ మీట్ ఘనంగా నిర్వహించడం జరిగింది.జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో మోరంపూడి శ్రీనివాస రావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ పాఠశాలలు కేవలం చదువు చెప్పే కేంద్రాలు గానే కాకుండా సంతోషం,సృజనాత్మకత, నైతిక విలువలు నేర్పించే వికాస నిలయాలుగా ప్రభుత్వం తీర్చి దిద్దుతోందని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల కు డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ కిట్ పేరుతో మంచి నాణ్యత గల యూనిఫాం దుస్తులు, షూస్, బెల్ట్, బ్యాగ్, పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు ఉచితంగా ఇస్తోంది. డొక్కా సీతమ్మ ఉచిత మధ్యాహ్న భోజన పథకం ద్వారా స్టూడెంట్స్ కు మంచి రుచికరమైన, శుచికరమైన భోజనం పెడుతున్నారని మోరంపూడి అన్నారు.పోయిన ఏడాది 10 వ తరగతి స్టూడెంట్స్ కు 100 రోజుల స్పెషల్ ప్రోగ్రామ్ పెట్టడం వల్ల ఉత్తీర్ణత శాతం పెరిగిందని, ఆ ఘనత నారా లోకేష్ దే నని మోరంపూడి కొనియాడారు. ఇంటికేనా పీపీ ఈ కార్యక్రమంలో చింతగుంట్ల వెంకటేశ్వర రావు,కందుల కృష్ణ, నక్కా రాము, నెక్కళపు వెంకటేశ్వర రావు, బన్నే వీరయ్య, మోరంపూడి సత్యనారాయణ, మోరంపూడి రమేష్, మిద్దె చెన్నారావు, తేనేటి రాంబాబు, మోదుగు ముత్తయ్య, నక్కా రత్నారావు, ఆయా స్కూళ్ళ హెచ్ ఎం లు,ఉపాధ్యాయిని,ఉపాధ్యాయులు, పిల్లల తల్లి దండ్రులు, గ్రామ పెద్దలు, హెల్త్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. తుమ్మ గూడెం ఎం పి పి ఎస్ ఉర్దూ పాఠశాలలో, చాట్రాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో మెగా ఉపాధ్యాయ తల్లిదండ్రుల సమావేశాలు ఘనంగా నిర్వహించారు.

## కుక్కునూరులో విద్యాసంస్థల బంద్ విజయవంతం

### ప్రధాన రహదారిపై రాస్తారోకో విద్యాసంస్థల వద్ద ధర్నాలు




**కుకునూరు**

నీట్ పేపర్ లీకేజీకి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని నీటి పరీక్షా విధానాన్ని రద్దుచేసి రాష్ట్రాలవారీగా మెడికల్ ప్రవేశ పరీక్షలు నిర్వహించాలని వామపక్ష విద్యార్థి సంఘాల పిలుపుమేరకు శుక్రవారం మండల కేంద్రంలో విద్యాసంస్థల బంధు విజయవంతమైంది. బందులో భాగంగా కుకునూర్ ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాల, జడ్పీహెచ్ఎస్ స్కూల్, కేజీబీవీ వద్ద ధర్నాల నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల కేజీబీవీ జడ్పీహెచ్ఎస్ హైస్కూల్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల శ్లోక ఈ ఎం స్కూల్ లిటిల్ స్టార్ హై స్కూల్ యాజమాన్యాలు స్వచ్ఛందంగా బందుకు సహకరించాయి .ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ పూర్వ జిల్లా సహాయ కార్యదర్శి ఎర్రం సాయికిరణ్, ఏఐటియుసి మండల కన్వీనర్ కొన్నే లక్ష్మయ్య ,సిపిఐ ఎంఎల్ ప్రజాపంద మండల కార్యదర్శి కే కన్నయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గజ్జి రాములు మాట్లాడుతూ నీట్ పేపర్ లీకేజీ దేశ విద్యా వ్యవస్థను దెబ్బతీసిందని పరీక్షా వ్యవస్థలో పారదర్శకత తీసుకురావాలని పేపర్ లీకేజీ బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ పోలవరం సోషల్ మీడియా నియోజకవర్గ కన్వీనర్ మల్లెల చంటి నాయుడు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నాగేంద్రావు, గిరిజన సంఘం మండల కార్యదర్శి పి లక్ష్మయ్య ,కాంగ్రెస్ నాయకులు వర్షా నాగేశ్వరరావు మడకం వీరయ్య ప్రజాపంద నాయకులు ఎం ప్రశాంత్, పెంకె వీరబాబు, సిఐటియు నాయకులు పి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు

## మెగా పేరెంట్-టీచర్ మీటింగ్ ఘనం.. మెరిట్ విద్యార్థులకు నగదు బహుమతులు



**ప్రజా భూమి ప్రతినిధి-ఆగిరిపల్లి**

ఈదులగూడెం మండల పరిషత్ మోడల్ ప్రాథమిక పాఠశాలలో ఇన్‌చార్జి హెచ్ఎం కె. పద్మశ్రీ ఆధ్వర్యంలో మెగా పేరెంట్-టీచర్ మీటింగ్ 4.0 ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథి గ్రామ మాజీ సర్పంచ్ చిట్నేని విజయ శేషగిరిరావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతున్నందున తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. అనంతరం గత విద్యా సంవత్సరంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు రూ.500 నగదు బహుమతులు, పోటీల్లో విజేతలైన తల్లిదండ్రులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అంకం వెంకటేశ్వరరావు, షేక్ హసీనా బేగం, కొవ్వలి కోటమ్మ, సచివాలయ సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్ రామకృష్ణ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## తల్లిదండ్రుల భాగస్వామ్యంతో మెగా పీటీఎం విజయవంతం



**ప్రజా భూమి ప్రతినిధి, ఆగిరిపల్లి**

పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అడవినెక్కలంలో శుక్రవారం మెగా పీటీఎం 4.0 సమావేశం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు పి.వి. రమణ విద్యార్థుల చదువు, హాజరు వివరాలను తల్లిదండ్రులు యాప్ ల ద్వారా తెలుసుకోవాలని సూచిం చారు. ప్రభుత్వ పథకాలు, పాఠశాలలో కల్పిస్తున్న సౌకర్యాలపై అవగాహన కల్పించారు. అనంతరం తల్లిదండ్రులకు ఆటల పోటీలు నిర్వహించి కార్యక్రమాన్ని ముగించారు.

## నూజివీడు ఈవోగా పామర్తి సీతారామయ్య



**ప్రజాభూమి ప్రతినిధి-నూజివీడు**

నూజివీడు దేవాలయ శాఖ ఏ 1గ్రేడ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (ఈవో)గా పామర్తి సీతారామయ్య బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన నూజివీడులోని శ్రీ కోట మహిషాసుర మర్దిని అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు.గత రెండేళ్లుగా దేవాలయ శాఖ పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేసిన స్థానికులు, కొత్త ఈవోగా పామర్తి సీతారామయ్య నియమితులవడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు. రానున్న దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను దృష్టిలో ఉంచుకుని దేవాదాయ శాఖ ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.ఇంతకుముందు బలివే దేవాదాయ శాఖలో ఈవోగా సేవలందించిన పామర్తి సీతారామయ్య ప్రస్తుతం నూజివీడు దేవాలయ శాఖ ఈవోగా బాధ్యతలు చేపట్టారు.ఆయన నాయకత్వంలోఅ మరింత పెరుగుతాయని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## పాఠశాల అభివృద్ధికి గాంధీరాజు కృషి అభినందనీయం



**ప్రజాభూమి ప్రతినిధి-పాలకొల్లు**

పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు మండలం పూలపల్లి గ్రామంలోని జడ్పీ హైస్కూల్ అభివృద్ధికి ఏపీ రాష్ట్ర ఆక్వా రైతు సంఘం అధ్యక్షులు గొట్టుముక్కల గాంధీ భగవాన్ రాజు చేస్తున కృషి అభినందనీయమనిస్కూల్ హెడ్మాస్టరు జీటీ కుమార్ తో పాటు పలువురు గ్రామ పెద్దలు కొనియాడారు. జడ్పీ హైస్కూల్లో శుక్రవారం జరిగిన విద్యార్థులు తల్లిదండ్రుల కమిటీ సమావేశంలోగాంధీ భగవాన్ రాజు ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గాంధీ భగవాన్ రాజు ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పూలపల్లి తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు శ్రీహరిరాజు, గుబ్బల ప్రసాద్, నున్నబోయిన నాగరాజు,ఉనికిల నాగేశ్వరరావు, గోనేడ రామకృష్ణ,పాలపర్తి చాంద్ రాజు, గబిడి నరసింహస్వామి, నూకల శ్రీను, గూడూరి లక్ష్మణ్,స్కూల్ పిటి వారది వెంకటరమణారావు గ్రామ పంచాయతీ కార్యదర్శి పాలా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టిక ఆహారాన్ని అందించాలి

- మధ్యాహ్న భోజనం నాణ్యత, పరిమాణం లోపిస్తే చర్యలు తప్పవు
- మంత్రి కొలుసు పార్థసారథి

**ప్రజాభూమి ప్రతినిధి-నూజివీడు**



నూజివీడు మండలం గొల్లపల్లి గ్రామంలోని శ్రీ అన్నే రామకృష్ణయ్య జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో శుక్రవారం మెగా పిటియం - 4.0 కార్యక్రమం అనంతరం మధ్యాహ్న భోజనంకు స్వయంగా లైనులో నిలబడి వడ్డించుకుని, పిల్లలతో కలిసి రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాలు శాఖ మంత్రి కొలుసు పార్థసారథి సహబంతి భోజనం చేశారు.ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థ సారథి మాట్లాడుతూ విద్యాఅభివృద్ధి కార్యక్రమాలకు జాతీయనాయకులు పేర్లతో శ్రీకారం చుట్టామని, దీనివలన విద్యార్థుల్లో స్ఫూర్తి, జాతీయభావాన్ని మరింతపెంపొందించుకోవచ్చునని అన్నారు. మధ్యాహ్న భోజనం రుచి, పరిమాణం లోపిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి విద్యార్థికి పౌష్టికాహారం అందించాలనే లక్ష్యంతో మంచి మెనూ రూపొందించి డొక్కా సీతమ్మ పేరిట మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తున్నామని అన్నారు. విద్యార్థి దశ నుండే మంచి పౌష్టికాహారం అందించడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజాన్ని రూపొందించా లనేదే ప్రభుత్వ లక్ష్యం అన్నారు.ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టరు బొల్లిపల్లి వినూత్న, జిల్లా విద్యాశాఖ అధికారి యం.వెంకటలక్ష్మమ్మ, డిప్యూటీ విద్యాశాఖ అధికారి డా.పి.యస్. సుధాకర్, మండల విద్యాశాఖ అధికారులు, వివిధ శాఖలు అధికారులు, ప్రధానోపాధ్యాయులు జి.శారద, ఉపాధ్యాయులు, నాన్ టీచింగు సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు వారి తల్లితండ్రులు పాల్గొన్నారు.